## భారత మ్యాప్‌పై యూ-టర్న్...
# వివాదాస్పద పోస్ట్‌ను తొలగించిన అమెరికా

అమెరికా: భారత్‌కు సంబంధించిన ఓ వివాదాస్పద సోషల్ మీడియా పోస్ట్‌ను యునైటెడ్ స్టేట్స్ ట్రేడ్ రిప్రజెంటేటివ్ కార్యాలయం తన అధికారిక ఎక్స్ ఖాతా నుంచి తొలగించింది. పాక్ ఆక్రమిత కశ్మీర్ (పీవోకే), అక్సాయి చిన్‌లను భారత్‌లో అంతర్భాగంగా చూపుతూ ప్రచురించిన మ్యాప్‌తో కూడిన ఈ పోస్ట్ తీవ్ర చర్చనీయాంశం కావడంతో అమెరికా ఈ నిర్ణయం తీసుకుంది. గత వారం, భారత్-అమెరికా మధ్య కుదిరిన ఓ తాత్కాలిక వాణిజ్య ఒప్పందం గురించి ప్రకటిస్తూ యూఎస్టీఆర్ ఈ పోస్ట్ చేసింది. అయితే, ఈ ప్రకటనకు జత చేసిన మ్యాప్‌లో పూర్తి జమ్మూకశ్మీర్‌ను (పీవోకే, అక్సాయి చిన్‌లతో సహా) భారత్‌లో చూపించడం అందరి దృష్టినీ ఆకర్షించింది. సాధారణంగా వివాదాస్పద ప్రాంతాలను ప్రత్యేకంగా గుర్తించే అమెరికా ప్రభుత్వ వైఖరికి ఇది భిన్నంగా ఉండటంతో, దీనిపై సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున చర్చ జరిగింది. ఇది పొరపాటున జరిగిందా? లేక కశ్మీర్‌పై అమెరికా విధానంలో మార్పు వచ్చిందా? అనే దానిపై తీవ్రమైన ఊహాగానాలు చెలరేగాయి. ఈ నేపథ్యంలో, ఎటువంటి అధికారిక ప్రకటన చేయకుండా యూఎస్టీఆర్ సైలెంట్‌గా ఆ పోస్ట్‌ను తమ ఖాతా నుంచి తొలగించింది. పీవోకే, అక్సాయి చిన్ సహా పూర్తి జమ్మూకశ్మీర్, లడఖ్ తమ అంతర్భాగమని భారత్ ఎప్పటినుంచో స్పష్టం చేస్తున్న విషయం తెలిసిందే. కాగా, ఈ పోస్ట్ తొలగింపుపై యూఎస్టీఆర్ కార్యాలయం ఇప్పటివరకు ఎలాంటి వివరణ ఇవ్వలేదు.

# ఏపీలో ఆర్టీసీ ఉద్యోగులకు గుడ్ న్యూస్

అమరావతి: ఆర్టీసీ ఉద్యోగులకు ఏపీ రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి గుడ్ న్యూస్ చెప్పారు. ఆర్టీసీ ఉద్యోగులకు పదోన్నతుల ప్రక్రియను వేగంగా పూర్తి చేసి, అర్హులైన 7,514 మందికి త్వరితగతిన పదోన్నతులు కల్పించాలని అధికారులను ఆయన ఆదేశించారు. సచివాలయంలో నిన్న రవాణా శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎంటీ కృష్ణబాబుతో కలిసి ఆర్టీసీ, రవాణా శాఖలపై మంత్రి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్టీసీ అధికారులు మంత్రికి వివరాలు వెల్లడించారు. 2025-26 డీపీసీ కింద అర్హులైన ఉద్యోగుల ఎంప్యానల్‌ను ఈ నెల 20వ తేదీ నాటికి పూర్తిచేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. ప్రస్తుతం ఆర్టీసీలో 44,131 మంది ఉద్యోగులే ఉన్నారని, వచ్చే మూడేళ్లలో 6,891 మంది పదవీ విరమణ చేయనున్నట్లు మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. ఈ నేపథ్యంలో 7,673 ఖాళీల భర్తీకి సంబంధించి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపేందుకు చర్యలు చేపట్టాలని మంత్రి ఆదేశించారు. అలాగే మెడికల్ అన్‌ఫిట్ అయిన 682 మంది ఉద్యోగుల్లో 36 మందికి ప్రత్యామ్నాయ ఉద్యోగాలు, మరో 646 మందికి ఆర్థిక పరిహారం చెల్లించాల్సి ఉందని అధికారులు తెలిపారు. ఇతర రాష్ట్రాల్లో రిజిస్ట్రేషన్ చేసుకుని ఏపీలో తిరిగే బస్సులకు సంబంధించిన అఖిలభారత టూరిస్ట్ పర్మిట్ పన్నులపై ట్రావెల్స్ బస్సుల సంఘాలతో సమావేశం నిర్వహించి తుది నిర్ణయం తీసుకుందామని మంత్రి రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. పన్ను తగ్గిస్తే ఆయా బస్సులు ఏపీలోనే రిజిస్ట్రేషన్ అవుతాయని రవాణా అధికారులు మంత్రికి వివరించారు. డ్రైవింగ్ లైసెన్సులు, రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ల కోసం జారీ చేసే స్మార్ట్ కార్డుల టెండర్ నిబంధనలు త్వరగా ఖరారు చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు. అలాగే కేంద్ర ప్రభుత్వ నిబంధనల ప్రకారం వాహనాలకు వెహికల్ లోకేషన్ ట్రాకింగ్ డివైజ్ (వీఎల్‌టీ) ఉంటేనే రిజిస్ట్రేషన్ చేయాల్సి ఉన్నందున, అందుకు సంబంధించిన ఆర్ఎఫ్‌పీ (ఆర్ఎఫ్‌పీ)ను సిద్ధం చేయాలని సూచించారు. ఈ సమావేశంలో రవాణా కమిషనర్ మనీష్‌కుమార్ సిన్హా, ఆర్టీసీ ఈడీలు బ్రహ్మానందరెడ్డి, రవివర్మ తదితరులు పాల్గొన్నారు.

## 'సర్వం ఏఐ'.. ప్రపంచ దేశాలకు పోటీగా భారత్ స్వదేశీ ఏఐ

ఢిల్లీ: కృత్రిమ మేధస్సు (ఏఐ) ఇప్పుడు కేవలం టెక్నాలజీ మాత్రమే కాదు... ఇది దేశాల మధ్య శక్తి పోరాటంగా మారింది. ఎవరు అత్యాధునిక ఏఐ వ్యవస్థలను తయారు చేస్తారు? ఎవరి నియంత్రణలో భవిష్యత్ డిజిటల్ ప్రపంచం ఉంటుంది? అన్న ప్రశ్నల చుట్టూ ప్రపంచ శక్తులు పోటీ పడుతున్నాయి. అమెరికా, చైనా, యూరప్, భారత్... ఈ నాలుగు శక్తులు నాలుగు విధానాలతో ముందుకు సాగుతున్నాయి. తాజాగా 'సర్వం ఏఐ' మోడల్ తో భారత్ కూడా ఈ పోటీలో తనదైన పంథాను ఎంచుకుంది. భారత్ ఇప్పుడే పూర్తి స్థాయి ఏఐ శక్తిగా ఎదగకపోయినా, వేగంగా ముందుకు సాగుతోంది. స్టాన్‌ఫర్డ్ గ్లోబల్ ఏఐ వైబ్రెన్సీ ర్యాంకింగ్స్ ప్రకారం అమెరికా, చైనా తర్వాత భారత్ మూడో స్థానంలో ఉంది. ఏఐని ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడం, భారతీయ భాషలకు ప్రాధాన్యతనివ్వడం, సామాజిక సమస్యలకు పరిష్కారాలు, 22 షెడ్యూల్ భాషలకు మద్దతు, విదేశీ ఏఐపై ఆధారపడడాన్ని తగ్గించడం, దేశీయ ఉపాధి అవకాశాలను మెరుగుపరచడం, 'బుల్ బుల్ వీ3' వంటి భాషా మోడళ్లను అభివృద్ధి పరచడం వంటి లక్ష్యాలతో భారత్ ముందుకు సాగుతోంది. ఈ నేపథ్యంలోనే 'సర్వం ఏఐ' ప్రారంభమయింది. భారతీయ అవసరాలకు పూర్తిగా సరిపోయే ఏఐగా ఇది రూపొందుతోంది.

# జనగణమన కంటే ముందు తప్పనిసరి

ఢిల్లీ: 'వందేమాతరం' గీతాన్ని అన్ని ప్రభుత్వ కార్యక్రమాలు, అన్ని పాఠశాలల్లో తప్పనిసరి చేస్తూ కేంద్ర హోంమంత్రిత్వ శాఖ బుధవారం కొత్త నిబంధనలు తీసుకువచ్చింది. 'జనగణమన' వంటి జాతీయ గీతాల కంటే ముందు దీనిని కచ్చితంగా ఆలపించాలని ఈ నిబంధనలలో పేర్కొంది. వందేమాతర గీతం ఆలపించినప్పుడు అందరూ నిలబడాలని పేర్కొంది. అన్ని పురస్కారాలు ఇచ్చే సమయంలో, రాష్ట్రపతి హాజరయ్యే అన్ని కార్యక్రమాల్లో వందేమాతరం ఆలపించాలని ఈ నిబంధనల్లో పేర్కొంది. జాతీయ గీతం, గేయం పాడుతుండగా అంతరాయం కలిగించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోనున్నట్లు తెలిపింది. తాజాగా విడుదల చేసిన నిబంధనల కింద బాధ్యులకు గరిష్ఠంగా మూడేళ్ళ జైలు శిక్ష విధించనున్నట్లు స్పష్టం చేసింది. సినిమా హాల్స్ వంటి ప్రదేశాల్లో కూడా దీనిని తప్పనిసరి చేసింది. ఈ సందర్భాల్లో నిలబడటాన్ని తప్పనిసరి చేయలేదు. కేంద్ర ప్రభుత్వం 'వందేమాతరం' 150వ వార్షికోత్సవాలను నిర్వహిస్తోంది. ఈ క్రమంలో ఈ కొత్త నిబంధనలను విడుదల చేసింది. 1937లో తొలగించిన నాలుగు చరణాలతో కలిపి మొత్తం ఆరు చరణాలను పాడాలని కేంద్రం వెల్లడించింది. స్వాతంత్ర పోరాట సమయంలో ముస్లిం లీగ్ అభ్యంతరాల మేరకు నాలుగు చరణాలను తొలగించిన కాంగ్రెస్, రెండు చరణాలను స్వీకరించింది. స్వాతంత్ర్యానంతరం నెహ్రూ ప్రభుత్వం రెండు చరణాలతోనే 'వందేమాతరం'ను జాతీయ గేయంగా ప్రకటించింది.

# కొడంగల్ లో ఓటేసిన సీఎం..

హైదరాబాద్: తెలంగాణలోని 116 మున్సిపాలిటీలలో ఉదయం 7 గంటల నుంచి పోలింగ్ కొనసాగుతోంది. పలువురు ప్రముఖులు తమ ఓటు హక్కు వినియోగించుకుంటున్నారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కొడంగల్ లో ఓటు వేశారు. వికారాబాద్ జిల్లాలోని కొడంగల్ జడ్పీ హైస్కూల్ లో ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్ కు వెళ్లి తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. అనంతరం ఆయన హైదరాబాద్‌కు తిరిగి బయల్దేరారు. కాసేపట్లో ఆయన శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌కి చేరుకుని ఢిల్లీకి వెళతారని సమాచారం. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మధిర మున్సిపాలిటీ పరిధిలోని 9వ వార్డు పోలింగ్ కేంద్రంలో ఓటు వేశారు. కరీంనగర్ జ్యోతి నగర్‌లోని ఎస్సార్ హై స్కూల్ కేంద్రంలో కేంద్రమంత్రి బండి సంజయ్ కుటుంబ సభ్యులతో కలిసి ఓటు హక్కు వినియోగించుకున్నారు. మంచిర్యాలలోని హైటెక్‌సిటీలో 227వ నంబర్ పోలింగ్ బూత్‌లో మంత్రి వివేక్ వెంకటస్వామి ఓటు వేశారు. కామారెడ్డి పట్టణంలోని 151 పోలింగ్ బూత్ లో ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ ఓటు హక్కును వినియోగించుకున్నారు. రాష్ట్రంలోని ఏడు కార్పొరేషన్లు, 116 మున్సిపాలిటీలకు పోలింగ్.

# రాష్ట్ర హక్కుల కోసం ప్రత్యక్ష పోరాటం చేస్తాం

హైదరాబాద్: కృష్ణా జలాలను ఏపీ ప్రభుత్వం తీసుకుపోతుంటే ఎపెక్స్ కౌన్సిల్ సమావేశానికి సీఎం రేవంత్‌రెడ్డి ఎందుకు డిమాండ్ చేయడం లేదని భారాస శాసనసభా పక్ష ఉపనేత, మాజీ మంత్రి హరీశ్‌రావు ప్రశ్నించారు. తెలంగాణ అవసరాలను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వానికి లేదా అని నిలదీశారు. కృష్ణా జలాల హక్కుల కోసం భారాస ప్రత్యక్ష పోరాటానికి దిగుతుందని వెల్లడించారు. అవసరమైతే కేఆర్ఎంబీని ముట్టడిస్తామని, పార్లమెంట్‌లో ప్రశ్నిస్తామని స్పష్టం చేశారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో మంగళవారం పార్టీ శాసనమండలి పక్ష నేత మధుసూదనాచారి, ఎమ్మెల్సీ శ్రావణ్‌కుమార్, ఎమ్మెల్యే వివేకానందతో కలిసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. "కృష్ణా జలాల్లో 664 టీఎంసీలను(80శాతం) ఏపీ వాడుకుంది. ఇదే విషయాన్ని జనవరి 28న కేఆర్ఎంబీకి అప్పటి నీటిపారుదల శాఖ ఈఎన్సీ లేఖ రాశారు. అదే నెల 31న ఆయన రిటైరవగా ఈ పోస్టును ఖాళీగా ఎందుకు పెట్టారు? ఈ రోజు(మంగళవారం) కూడా ఏపీ ఒకటిన్నర టీఎంసీల నీటిని తరలించుకుపోయింది. ఈఎన్‌సీ లేఖ ప్రకారం కోటాకు మించి అదనంగా 16 టీఎంసీలను ఏపీ తీసుకెళ్లింది. ఈ నెల 6న ఏపీకి కేఆర్ఎంబీ.. ఇప్పటి వరకు 555 టీఎంసీల నీటిని తరలించారని, వాడకాన్ని ఆపాలని లేఖ రాసింది. కేంద్రంలో.. మంత్రులుగా ఉన్న కిషన్‌రెడ్డి, బండి సంజయ్ ఈ వ్యవహారంలో ఏం చేస్తున్నారు? కాంగ్రెస్, భాజపాలు తెలంగాణ నీటి హక్కును ఏపీకి దోచిపెడుతున్నాయి. ఏపీకి నీటి మళ్లింపులను ఆపి శ్రీశైలం, సాగర్‌లకు భవిష్యత్తు అవసరాల కోసం రాష్ట్ర వాటాను తరలించాలి. భారాస ప్రభుత్వం కృష్ణానదిపై 19 చోట్ల టెలిమెట్రీలను ఏర్పాటు చేసింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్కటీ పెట్టలేదు. ఇందుకోసం ఇచ్చిన రూ.4 కోట్లను బోర్డు వాడుకున్నా సీఎం నోరు విప్పడం లేదు" అని హరీశ్‌రావు విమర్శించారు.

# వైసీపీ కుట్రల పట్ల టీడీపీ, జనసేన, బీజేపీ అప్రమత్తంగా ఉండాలి

మొదటి పేజి తరువాయి

11 నిమిషాల పాటు నిరసన తెలిపి వాకౌట్ చేశారు. అసెంబ్లీ వాయిదా పడిన అనంతరం కమిటీ హాలులో చంద్రబాబు అధ్యక్షతన నిర్వహించిన ఎన్డీయే శాసనసభాపక్ష సమావేశంలో పవన్ కల్యాణ్ మాట్లాడుతూ, వైసీపీ కుట్రల పట్ల కూటమిలోని టీడీపీ, జనసేన, బీజేపీ పార్టీలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వైసీపీ హిందూమతాన్ని రాజకీయంగా ఉపయోగించుకోవాలని చూస్తోందని ఆరోపించారు. దక్షిణ భారతదేశంలో ప్రతి ఒక్కరూ హిందూమతాన్ని గౌరవిస్తారని అన్నారు. మన ప్రభుత్వంపై జగన్, ఆయన పార్టీ చేసే కుట్రలను గుర్తించాలని అన్నారు. అనంతరం, పయ్యావుల కేశవ్ మాట్లాడుతూ, సభలో ఎంతసేపు మాట్లాడామనే దానికంటే అవసరమైన విషయం ఎంత మాట్లాడామనేది ముఖ్యమని అన్నారు. దావోస్‌లో ముఖ్యమంత్రి, తాను ప్రతి సంస్థపై ముందస్తుగా కసరత్తు చేసినట్లు చెప్పారు. అందుకే తమను కలిసిన ప్రతి సంస్థకు ముఖ్యమంత్రి క్లుప్తంగా ఏడు నిమిషాల్లోనే విషయం చెప్పి ముగించేవారని గుర్తు చేసుకున్నారు. అందుకే తక్కువ సమయంలో ఎక్కువమంది పారిశ్రామికవేత్తలను ముఖ్యమంత్రి కలవగలిగారని అన్నారు. శాసనసభలో కూడా సభ్యులు ఆయనను స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు.

## ఐక్యంగా ఉంటేనే గుజరాత్ తరహాలో
# అభివృద్ధి సాధ్యమని స్పష్టం

మొదటి పేజి తరువాయి

ఎన్డీఏ శాసనసభా పక్ష సమావేశంలో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను ఉద్దేశించి ఆయన సుదీర్ఘంగా ప్రసంగించారు. గడిచిన 20 నెలల్లో కూటమి నాయకత్వంలో ఎక్కడా విభేదాలు రాకపోవడం శుభపరిణామమని, ఇదే ఐక్యతతో పనిచేసి ఎమ్మెల్యేలు ప్రజల్లో మంచి పేరు తెచ్చుకోవాలని సూచించారు. ఎన్నికల నాటి కంటే ఇప్పుడు కూటమిపై ప్రజా మద్దతు మరింత పెరిగిందని చంద్రబాబు అన్నారు. "గుజరాత్‌లో బీజేపీ వరుసగా ఐదుసార్లు గెలిచి అధికారంలో ఉంది. ఒకే ప్రభుత్వం సుదీర్ఘకాలం కొనసాగడం వల్లే అక్కడ అభివృద్ధి సాధ్యమైంది. మన రాష్ట్రంలోనూ అదే జరగాలి. మరో 15 ఏళ్ల పాటు మూడు పార్టీలు ఐక్యంగా ప్రజల వద్దకు వెళ్లి ఓట్లు అడిగే పరిస్థితి రావాలి. అప్పుడే శాశ్వతంగా రాజకీయాల్లో నిలబడగలం" అని ఆయన దిశానిర్దేశం చేశారు.

### ఎమ్మెల్యేలకు స్పష్టమైన ఆదేశాలు

ఈ సందర్భంగా శాసనసభ్యులకు ముఖ్యమంత్రి పలు కీలక సూచనలు చేశారు. "అసెంబ్లీ సమావేశాలను ప్రతి సభ్యుడు సీరియస్‌గా తీసుకోవాలి. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు అందరూ సభలోనే ఉండాలి. నేను కూడా సభను పూర్తిగా ఫాలో అవుతాను. సభలో సబ్జెక్టులపై అర్థవంతమైన చర్చలు జరగాలి. ఎదుటివారు తిట్టారని మనం కూడా బూతులు తిట్టకూడదు. ప్రజామోదయోగ్యంగా సభను నడుపుదాం" అని అన్నారు. త్వరలోనే జిల్లాల వారీగా ఎమ్మెల్యేలు, ఎంపీలు, కలెక్టర్లు, ఎస్పీలతో ఉమ్మడి సమావేశాలు నిర్వహించి, నియోజకవర్గాల్లో పెండింగ్ పనులను ప్రాధాన్యతా క్రమంలో పూర్తిచేస్తామని హామీ ఇచ్చారు.

### విశాఖ స్టీల్ ప్లాంట్ కోసం కేంద్రం తన పాలసీనే మార్చుకుంది

కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సహకారం వల్లే రాష్ట్రం వేగంగా కోలుకుంటోందని చంద్రబాబు వివరించారు. "వెంటిలేటర్‌పై ఉన్న రాష్ట్రాన్ని గాడిన పెట్టామంటే దానికి కేంద్రం చేయూతే కారణం. అమరావతి, పోలవరం ప్రాజెక్టులకు కేంద్రం నిధులు ఇవ్వకపోయి ఉంటే అవి ముందుకు కదిలేవి కావు. 2027 జూన్ నాటికి పోలవరం పూర్తి చేసి జాతికి అంకితం ఇస్తున్నామంటే అది కేంద్రం సాయంతోనే. విశాఖ స్టీల్ ప్లాంట్‌ను నిలబెట్టేందుకు కేంద్రం తన పాలసీనే మార్చుకుంది. ఫలితంగా, మొదటిసారిగా స్టీల్ ప్లాంట్ ఒక్క నెలలో రూ.54 కోట్ల లాభాలు సాధించింది. సూపర్ సిక్స్‌తో సహా అన్ని పథకాలు అమలు చేస్తున్నామంటే దాని వెనుక కేంద్రం అండ ఉంది. ఈ ప్రభుత్వ కార్యక్రమాలను ప్రతి ఎమ్మెల్యే ఓన్ చేసుకోవాలి" అని ఆయన పిలుపునిచ్చారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో కూటమి నేతలు ఎదుర్కొన్న అణచివేతను చంద్రబాబు గుర్తుచేశారు. పవన్ కల్యాణ్‌ను విశాఖలో హోటల్ గదికే పరిమితం చేయడం, తన అరెస్టు సమయంలో ఆయనకు అడుగడుగునా అడ్డంకులు సృష్టించడం వంటి ఘటనలను ప్రస్తావించారు. అలాంటి ఎన్నో సవాళ్లను ఎదుర్కొని ఐక్యంగా నిలబడి గెలిచామని, ఈ స్ఫూర్తిని ఎప్పటికీ మరువకూడదని హితవు పలికారు.

### కూటమి ధర్మానికి కట్టుబడి ఉందాం: పవన్ కల్యాణ్

ముఖ్యమంత్రి అభిప్రాయంతో డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్ కల్యాణ్ పూర్తిగా ఏకీభవించారు. గత 20 నెలలుగా ఐక్యంగా పనిచేసి, వైసీపీ ఐదేళ్ల విధ్వంసం నుంచి రాష్ట్రాన్ని గట్టెక్కించి ప్రగతి బాట పట్టిస్తున్నామని అన్నారు. "రాష్ట్రాభివృద్ధి కోసం మరో 15 ఏళ్లు కూటమి కలిసి ఉంటుంది. ఐక్యంగా ముందుకు వెళ్తుంది. ఎన్నికల్లో ఏ స్ఫూర్తితో పనిచేశామో, అదే స్ఫూర్తి భవిష్యత్తులోనూ అవసరం. పార్టీల మధ్య ఏవైనా భిన్నాభిప్రాయాలు ఉంటే, వాటిని అంతర్గతంగా కూర్చుని పరిష్కరించుకోవాలి. ప్రతి ఒక్కరూ కూటమి ధర్మానికి కట్టుబడి పనిచేయాలి" అని పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు.

# ఇంధన స్వాతంత్ర్యాన్ని అమెరికాకు తాకట్టు పెట్టారు

మొదటి పేజి తరువాయి

'భారత మాత'ను అమెరికాకు అమ్మేశారని సంచలన వ్యాఖ్యలు చేశారు. బుధవారం కేంద్ర బడ్జెట్‌పై జరిగిన చర్చలో పాల్గొన్న రాహుల్, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌ను లక్ష్యంగా చేసుకుని విమర్శలు గుప్పించారు. విదేశీ క్లౌడ్ సర్వీస్ ప్రొవైడర్లకు పన్ను రాయితీలు ఇవ్వడంపై రాహుల్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. "ఆర్థిక మంత్రి నవ్వుతున్నారు, ఆమెకు నవ్వడం అంటే చాలా ఇష్టం. పెద్ద టెక్ కంపెనీలకు 20 ఏళ్ల పాటు పన్ను మినహాయింపు ఇచ్చారు. మన డేటాతో మీరు చేసిందేమిటి?" అని ప్రభుత్వాన్ని నిలదీశారు. ఈ వాణిజ్య ఒప్పందం కింద టారిఫ్‌లలో చేసిన మార్పులు ఏకపక్షంగా అమెరికాకు మేలు చేసేలా ఉన్నాయని రాహుల్ ఆరోపించారు. "మొదట్లో మనపై సగటు టారిఫ్ 3 శాతం ఉండేది, ఇప్పుడు అది 18 శాతానికి పెరిగింది. అంటే ఆరు రెట్లు ఎక్కువ. అమెరికా నుంచి దిగుమతులు 46 బిలియన్ డాలర్ల నుంచి 146 బిలియన్ డాలర్లకు పెరుగుతాయి. కానీ మనకు వాళ్లు ఎలాంటి హామీ ఇవ్వలేదు. మనం మాత్రం వారికి కట్టుబడి ఉండాలి. వాళ్లపై మన టారిఫ్ 16 శాతం నుంచి సున్నాకి తగ్గింది, మనపై మాత్రం వాళ్ల టారిఫ్ 3 నుంచి 18 శాతానికి పెరిగింది" అని ఆయన గణాంకాలతో వివరించారు. ఈ ఒప్పందం వల్ల దేశంలోని టెక్స్‌టైల్ పరిశ్రమ పూర్తిగా నాశనమవుతుందని రాహుల్ ఆందోళన వ్యక్తం చేశారు. "అమెరికా బంగ్లాదేశ్‌పై సుంకాన్ని సున్నా శాతానికి తగ్గించింది, కానీ భారత్‌పై 18 శాతం విధిస్తోంది. మన టెక్స్‌టైల్ పరిశ్రమదారులు ఏం చేయాలి? వాళ్ల పోటీదారు బంగ్లాదేశ్. వాళ్లు అమెరికా కాటన్‌ను దిగుమతి చేసుకుంటే సున్నా డ్యూటీ. దీంతో మన టెక్స్‌టైల్ పరిశ్రమ పూర్తిగా నాశనమైపోతుంది" అని అన్నారు. అంతేకాకుండా, ఈ ఒప్పందం దేశ ఇంధన స్వాతంత్ర్యాన్ని దెబ్బతీస్తుందని రాహుల్ ఆరోపించారు. "ఇకపై మనం ఏ దేశం నుంచి చమురు కొనాలో అమెరికా నిర్ణయిస్తుంది, మన ప్రధానమంత్రి కాదు. వాళ్లు మనల్ని పర్యవేక్షిస్తారు. అమెరికాకు నచ్చని దేశం నుంచి భారత్ చమురు కొంటే, మనపై టారిఫ్‌లతో శిక్ష విధిస్తారు" అని విమర్శించారు. రైతుల ప్రయోజనాలను కూడా ప్రభుత్వం కాలరాస్తోందని, "పేద రైతులను అణచివేయడానికి తలుపులు తెరిచారు" అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. విమర్శల తీవ్రతను పెంచుతూ, "మీరు భారతదేశాన్ని అమ్మేశారని నేను చెబుతున్నాను. దేశాన్ని అమ్మడానికి మీకు సిగ్గుగా లేదా? మన తల్లి భారత్ మాతను అమ్మేశారు" అని రాహుల్ గాంధీ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ప్రధానమంత్రి ఒత్తిడితోనే ఈ ఒప్పందానికి అంగీకరించారని ఆయన ఆరోపించారు. రాహుల్ వ్యాఖ్యలు లోక్‌సభలో తీవ్ర దుమారం రేపాయి.

# ప్రజల తరఫున గళం విప్పేందుకు ప్రధాన ప్రతిపక్ష హోదా ఇవ్వాల్సిందే

మొదటి పేజి తరువాయి

కూటమి ప్రభుత్వం కావాలనే గవర్నర్‌తో తప్పుడు ప్రసంగం చేయిస్తోందని వైఎస్సార్‌సీపీ నేతలు ఆరోపించారు. ఈ సందర్భంగా కూటమి ప్రభుత్వ అరాచక పాలనను ప్రశ్నిస్తూ.. ప్రతిపక్ష నేతలు, వారి ఇళ్లపై జరుగుతున్న దాడులను సభ వేదికగా ఖండించారు. ఏపీ బడ్జెట్ సమావేశాల నేపథ్యంలో కూటమి ప్రజా వ్యతిరేక నిర్ణయాలు, వైఎస్సార్‌సీపీకి ప్రధాన ప్రతిపక్ష హోదా ఇవ్వకపోవడంపై వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ సహా పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు అసెంబ్లీ వద్ద నిరసనలు తెలిపారు. ప్లకార్డులు పట్టుకుని వైఎస్సార్‌సీపీకి ప్రతిపక్ష హోదా ఇవ్వాలని డిమాండ్ చేశారు. కూటమి వ్యతిరేక నినాదాలు చేశారు. ఈ సందర్భంగా కూటమి పార్టీలు ప్రజలను మోసం చేస్తున్నాయని ఆరోపించారు. ప్రజల తరపున ప్రశ్నిస్తామనే కారణంతోనే ప్రతిపక్ష హోదా ఇవ్వడం లేదని మండిపడ్డారు. ప్రజల తరపున గళం విప్పేందుకు ప్రధాన ప్రతిపక్ష హోదా ఇవ్వాల్సిందేనన్నారు. ప్రజల పక్షాన వైఎస్సార్‌సీపీ పోరాటం చేస్తోందని.. రాష్ట్ర ప్రజలకు జరుగుతున్న అన్యాయాలపై కచ్చితంగా గళం వినిపిస్తామన్నారు. అనంతరం, సభలో గవర్నర్ ప్రసంగంపై వైఎస్సార్‌సీపీ నేతలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. గవర్నర్ ప్రసంగంలో అన్నీ అబద్ధాలేనని ఆరోపించారు. రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉన్న గవర్నర్‌తో కూడా అబద్ధాలు చెప్పించడం బాధాకరమని అన్నారు. ప్రధాన ప్రతిపక్షంగా గుర్తింపు ఇవ్వరు, రాష్ట్రంలో కుప్పకూలిన శాంతి భద్రతలపై నిలదీయనివ్వరు.. అంటూ నినాదాలు చేశారు. తిరుమల లడ్డూపై తప్పుడు ప్రచారం, సభ్యుల హక్కులను కాపాడాలని, మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ.. నినాదాలు తెలిపారు. ఎన్టీఆర్ భవన్ నుంచి వచ్చిన స్క్రిప్ట్ ను గవర్నర్ చదువుతున్నారు. తన ప్రసంగంలో చదువుతున్నది వాస్తవమా కాదా అని కూడా గవర్నర్ చూడటం లేదు. 3.2 లక్షల కోట్లు అప్పులు చేసి ఎవరికిచ్చారు? అని ప్రశ్నించారు. ఈ క్రమంలో గవర్నర్ ప్రసంగాన్ని అడ్డుకునే ప్రయత్నం చేశారు.

### ప్లకార్డులతో జగన్ నిరసన

ఏపీలో అశాంతి, అశ్లీల నృత్యాల పాలన సాగుతోందని.. కూటమి ప్రభుత్వంలో సంక్షేమం, అభివృద్ధి లేదన్నారు. మహిళా సాధికారత కొరవడింది.. రైతులకు గిట్టుబాటు ధర లేని పరిస్థితి ఉందన్నారు. ఫీజు రీయింబర్స్ మెంట్ ఇవ్వకపోవడం వల్ల విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారని అన్నారు. ప్రభుత్వం ఇచ్చిన అన్ని హామీలపై పోరాటం కొనసాగిస్తామని అన్నారు. చంద్రబాబు, లోకేష్, పవన్ పాలనా వైఫల్యాలను ఎండగడతామన్నారు. ఉద్యోగులపై ఈ ప్రభుత్వం తీవ్రమైన ఒత్తిడి తెస్తోంది. ప్రభుత్వం తెచ్చే ఒత్తిడితో ఉద్యోగులు ప్రాణాలు కోల్పోతున్నారు. ఉద్యోగులకు బకాయిలు చెల్లించకుండా వేధిస్తోంది. వాలంటీర్లకు హామీలిచ్చి ఈరోజు రోడ్డున పడేశారు. నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి ఇస్తామని మాటతప్పారు. ఉద్యోగాలిస్తామని మాయమాటలు చెప్పి యువతను మోసం చేశారు. దేశంలోనే గవర్నెన్స్‌లో ఏపీ అట్టడుగు స్థానంలో ఉందని గుర్తు చేశారు. ఇవన్నీ గవర్నర్ ప్రసంగంలో ఎందుకు చేర్చలేదని నిలదీశారు. అనంతరం, సభను వాకౌట్ చేసి బయటకు వెళ్లిపోయారు.

# జీహెచ్ఎంసీ.. ఇకపై మూడు కార్పొరేషన్లు..

మొదటి పేజి తరువాయి

ఈ మేరకు అధికారికంగా ఉత్తర్వులు జారీ చేసింది. పునర్వ్యవస్థీకరించిన జీహెచ్ఎంసీతో పాటు, సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జవీజ), మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ (వీవీజ) పేరుతో రెండు కొత్త సంస్థలను ఏర్పాటు చేసింది. ఈ నిర్ణయం తక్షణమే అమల్లోకి వస్తుందని ప్రభుత్వం స్పష్టం చేసింది. నగర జనాభా, విస్తీర్ణం వేగంగా పెరుగుతున్న నేపథ్యంలో పౌర సేవలను ప్రజలకు మరింత చేరువ చేసేందుకు, జవాబుదారీతనాన్ని పెంచేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రభుత్వం పేర్కొంది. జీహెచ్ఎంసీ చట్టం, 1955లోని సెక్షన్ 3(1) ప్రకారం ఈ విభజన ప్రక్రియను పూర్తి చేశారు. పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్ ఈ ఉత్తర్వులపై సంతకం చేశారు.

కొత్త కమిషనర్లు, జోన్ల కేటాయింపు

ప్రభుత్వం మూడు కార్పొరేషన్లకు కమిషనర్లను నియమించింది. ప్రస్తుత జీహెచ్ఎంసీ కమిషనర్‌గా ఉన్న ఆర్.వి. కర్ణన్‌ను అదే పదవిలో కొనసాగించింది. జీహెచ్ఎంసీ అదనపు కమిషనర్లుగా పనిచేస్తున్న జి. సృజనను సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా, టి. వినయ్ కృష్ణారెడ్డిని మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా నియమించింది. ఈ మూడు కార్పొరేషన్ల మధ్య సమన్వయం కోసం జయేష్ రంజన్‌ను ప్రత్యేక అధికారిగా నియమిస్తూ మరో ఉత్తర్వు జారీ చేసింది. కొత్తగా ఏర్పడిన కార్పొరేషన్ల పరిధిని జోన్ల వారీగా స్పష్టంగా నిర్వచించారు.

జీహెచ్ఎంసీ: శంషాబాద్, రాజేంద్రనగర్, చార్మినార్, గోల్కొండ, ఖైరతాబాద్, సికింద్రాబాద్ జోన్లు.

సైబరాబాద్ కార్పొరేషన్: శేరిలింగంపల్లి, కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్ జోన్లు.

మల్కాజ్‌గిరి కార్పొరేషన్: మల్కాజ్‌గిరి, ఉప్పల్, ఎల్.బి. నగర్ జోన్లు.

విభజన నేపథ్యం

గత ఏడాది డిసెంబర్‌లో 27 చుట్టుపక్కల పట్టణ స్థానిక సంస్థలను జీహెచ్ఎంసీలో విలీనం చేయడంతో దాని పరిధి సుమారు 2,000 చదరపు కిలోమీటర్లకు విస్తరించింది. ఈ నేపథ్యంలో వార్డుల సంఖ్యను 150 నుంచి 300కు, సర్కిళ్ల సంఖ్యను 30 నుంచి 60కి పెంచుతూ డిలిమిటేషన్ ప్రక్రియ చేపట్టారు. పెరిగిన పరిధికి అనుగుణంగా పాలనను సులభతరం చేసేందుకే తాజాగా ఈ మూడు కార్పొరేషన్ల ఏర్పాటుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. మొత్తం 60 సర్కిళ్లలో జీహెచ్ఎంసీకి 30, సైబరాబాద్‌కు 16, మల్కాజ్‌గిరికి 14 సర్కిళ్లను కేటాయించారు. ఈ విభజనతో మూడు కార్పొరేషన్లు ప్రత్యేక చట్టబద్ధ సంస్థలుగా తమ కార్యకలాపాలు నిర్వహిస్తాయి. కాగా, సైబరాబాద్ నూతన కమిషనర్‌గా జి. సృజన ఇప్పటికే బాధ్యతలు స్వీకరించారు. ఈ పునర్వ్యవస్థీకరణ ద్వారా మౌలిక సదుపాయాల కల్పన వేగవంతం కావడంతో పాటు, స్థానిక సమస్యలు త్వరితగతిన పరిష్కారమవుతాయని అధికారులు భావిస్తున్నారు.

## గత 12 ఏళ్లలో మున్సిపాలిటీల
# అభివృద్ధి కుంటుపడింది

మొదటి పేజి తరువాయి

ఓటరు మహాశయులకు నమస్కారం అంటూ ఎక్స్ వేదికగా ఓటర్లను ఉద్దేశించి ఒక ప్రకటన విడుదల చేశారు. గత 12 ఏళ్ల బీఆర్ఎస్, కాంగ్రెస్ పాలనలో రాష్ట్రవ్యాప్తంగా మున్సిపాలిటీల అభివృద్ధి పూర్తిగా కుంటుపడిందని కిషన్ రెడ్డి ఆరోపించారు. ప్రస్తుతం పట్టణాలు కనీసం వీధి లైట్లకు కూడా నోచుకోని దుస్థితికి చేరుకున్నాయని, ప్రజలు నిత్యం ఏదో ఒక సమస్యతో సతమతమవుతున్నారని ఆయన పేర్కొన్నారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకులకు ప్రజాధనాన్ని కొల్లగొట్టడం, మజ్లిస్-మైనార్టీ ఓట్లపై దృష్టి పెట్టడం తప్ప ప్రజా సమస్యలను పరిష్కరించాలనే ఆలోచన ఏమాత్రం లేదని ఆయన తీవ్రంగా విమర్శించారు. దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్న ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వానికి అండగా నిలవాలని, మున్సిపాలిటీల సమగ్రాభివృద్ధి కోసం బీజేపీ అభ్యర్థులను ఆశీర్వదించాలని కిషన్ రెడ్డి ప్రజలను కోరారు.

## 20 నెలల పాలన.. 60 విజయాలు..
# ప్రజలకు వివరించండి
## కూటమి నేతలకు
## జాబితా ఇచ్చిన సీఎం చంద్రబాబు

అమరావతి: ఏపీ శాసనసభ బడ్జెట్ సమావేశాల తొలిరోజున అసెంబ్లీ కమిటీ హాలులో ముఖ్యమంత్రి చంద్రబాబు ఎన్డీఏ కూటమి ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో సమావేశమయ్యారు. గడిచిన 20 నెలల కూటమి ప్రభుత్వ పాలనలో సాధించిన విజయాలను, చేపట్టిన అభివృద్ధి-సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని ఆయన దిశానిర్దేశం చేశారు. రాష్ట్రం విధ్వంసం నుంచి వికాసం వైపు పురోగమిస్తోందని, ప్రతి రంగంలోనూ వృద్ధి నమోదైందని తెలిపారు. ప్రజావసరాలను గుర్తించి నిర్ణయాలు తీసుకుంటూ అతి తక్కువ కాలంలోనే ప్రజలు మెచ్చే పాలన అందించామని చంద్రబాబు అన్నారు. ప్రతి ఎమ్మెల్యే, మంత్రి ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజలకు వివరించాలని ఆయన సూచించారు. ఈ సందర్భంగా, 20 నెలల కాలంలో ప్రభుత్వం చేపట్టిన 60 ప్రధాన కార్యక్రమాలు, సాధించిన విజయాల జాబితాను సీఎం వివరించారు. ఆ వివరాలు ఇలా ఉన్నాయి:

1. తల్లికి వందనం: రూ.10,090 కోట్లు తల్లుల ఖాతాల్లో జమ. 67.27 లక్షల మంది విద్యార్థులకు సాయం. 2. స్త్రీ శక్తి: 43.51 కోట్లకు పైగా ఉచిత బస్సు ప్రయాణాలు. రూ.1,532 కోట్లు ఖర్చు. 3. దీపం 2 పథకం: 1.08 కోట్ల కుటుంబాలకు ఏడాదికి ఉచితంగా 3 సిలిండర్ల పంపిణీ. ఇప్పటికి 3.64 కోట్ల సిలిండర్లు అందజేత, రూ.2,891 కోట్లు వ్యయం. 4. అన్నదాత సుఖీభవ: 46.86 లక్షల మంది రైతులకు ఏడాదికి రూ.20 వేల చొప్పున సాయం. రెండు విడతల్లో రూ.6,310 కోట్లు జమ. 5. ఎన్టీఆర్ భరోసా: నెలకు 63 లక్షల మందికి పింఛన్లు. ఇప్పటికి రూ.58,654 కోట్లు వ్యయం. 6. దివ్యాంగులకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం, ఎక్కడైనా పింఛను తీసుకునే అవకాశం. 7. మత్స్యకార భరోసా: ఏడాదికి రూ.20 వేల చొప్పున 1.25 లక్షల మందికి రూ.250 కోట్లు. 8. నేతన్నలకు ఉచిత విద్యుత్: మరమగ్గాలకు 500, మగ్గాలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్. లక్షకు పైగా కుటుంబాలకు లబ్ధి. 9. ఆటో డ్రైవర్లకు ఏడాదికి రూ.15,000 సాయం. రూ.436 కోట్లు జమ, 2.90 లక్షల మందికి లబ్ధి. 10. అన్న క్యాంటీన్లు: 113 నియోజకవర్గాల్లో 205 క్యాంటిన్ల ద్వారా 7.50 కోట్ల భోజనాలు. 11. గీత కార్మికులకు 10 శాతం మద్యం షాపుల కేటాయింపు, స్వర్ణకారులకు ప్రత్యేక కార్పొరేషన్. 12. వివాదాలకు తావివ్వకుండా ఎస్సీ వర్గీకరణ, అన్ని వర్గాలకు సమన్యాయం. 13. 8,427 మంది పాస్టర్లకు నెలకు రూ.5,000 గౌరవ వేతనం. 14. ఇమామ్‌లకు నెలకు రూ.10,000, మౌజన్లకు రూ.5,000 గౌరవ వేతనం. 15. అర్చకులకు వేతనం రూ.15,000కు పెంపు. నాయీ బ్రాహ్మణులకు నెలకు రూ.25,000, జూనియర్ లాయర్లకు రూ.10,000 గౌరవ వేతనం. 16. మెగా డీఎస్సీ ద్వారా 15,941 టీచర్ పోస్టుల భర్తీకి తొలి సంతకం. 17. 5,757 కానిస్టేబుల్ పోస్టుల నియామకం పూర్తి. స్టైఫండ్ రూ.12,500కు పెంపు. 18. రాజముద్రతో కొత్త పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ, ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు. 19. అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశాలకు గ్రాట్యుటీ అమలు. బాలింతలకు ఎన్టీఆర్ బేబీ కిట్లు. 20. ప్రతీ నెలా 3వ శనివారం 'స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర'. చెత్తపన్ను రద్దు. 21. రూ.1,000 కోట్లతో రోడ్ల మరమ్మతులు, రూ.3,000 కోట్లతో నూతన రహదారులు. 22. కొత్తగా 25 పారిశ్రామిక పాలసీలు, 175 నియోజకవర్గాల్లో ఎంఎస్ఎంఈ పార్కులు. 23. విశాఖ సీఐఐ సమ్మిట్‌లో రూ.13.25 లక్షల కోట్ల పెట్టుబడులు, 16.13 లక్షల ఉద్యోగాలకు ఒప్పందాలు. 24. 14 ఎస్ఐపీబీ సమావేశాల్లో రూ.8.74 లక్షల కోట్ల పెట్టుబడులకు ఆమోదం, 8.36 లక్షల ఉద్యోగాలు. 25. విశాఖలో రూ.1.25 లక్షల కోట్లతో గూగుల్ ఏఐ డేటా సెంటర్ ఏర్పాటు. 26. అమరావతిలో క్వాంటం వ్యాలీ భవనాలకు శంకుస్థాపన. విశాఖలో టీసీఎస్ ప్రారంభం. 27. కాకినాడలో ఏఎమ్ గ్రీన్ అమోనియా ప్రాజెక్టుకు శంకుస్థాపన. 28. తిరుమల సహా ప్రధాన ఆలయాల్లో నిత్యాన్నదానాలు. 29. విశాఖలో యోగాంధ్ర, కర్నూలులో సూపర్ జీఎస్టీ సభ విజయవంతం. 30. పీపీపీ విధానంలో మెడికల్ కాలేజీలు, పేదలకు అదనంగా 110 వైద్య విద్య సీట్లు. 31. గ్రామ సభల ద్వారా 3 వేల పనులకు శ్రీకారం, పంచాయతీలకు నిధుల విడుదల, అమరజీవి జలధార పథకం. 32. విద్యా వ్యవస్థలో మార్పులు, మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్, డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం. 33. గేట్స్ ఫౌండేషన్, టాటాలతో సంజీవని ప్రాజెక్టు, యూనివర్సల్ హెల్త్ పాలసీ ప్రతిపాదన. 34. విద్యుత్ చార్జీల పెంపు లేదని ప్రకటన, ట్రూ అప్ భారాన్ని భరిస్తున్న ప్రభుత్వం. 35. రాష్ట్ర ఆర్థికాభివృద్ధి డబుల్ డిజిట్ గ్రోత్ 11.28 శాతానికి చేరిక. 36. పేదలకు ఇళ్ల స్థలాల కోసం దరఖాస్తుల స్వీకరణ, 3 లక్షల ఇళ్లకు గృహ ప్రవేశాలు. 37. ఉచిత ఇసుక పథకం అమలు, నాలా యాక్ట్ రద్దు. 38. 20 లక్షల ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు ఉచితంగా సోలార్ రూఫ్ టాప్. 39. తగ్గిన క్రైమ్ రేట్, గంజాయి-డ్రగ్స్ అరికట్టేందుకు ఈగల్ టాస్క్ ఫోర్స్. 40. మన మిత్ర ద్వారా వాట్సప్ గవర్నెన్స్‌తో 921 సేవలు. 41. విశాఖపట్నం, అమరావతి, తిరుపతి కేంద్రంగా 3 రీజియన్ల అభివృద్ధికి కార్యాచరణ. 42. పూర్వోదయ పథకంలో రాష్ట్రానికి చోటు, రాయలసీమ, ఉత్తరాంధ్ర అభివృద్ధికి ఆస్కారం. 43. విశాఖ రైల్వేజోన్ ప్రధాన కార్యాలయం పనుల ప్రారంభం. 44. విశాఖ స్టీల్ ప్లాంట్‌కు రూ.11,440 కోట్ల కేంద్ర సాయం. 45. 90 కేంద్ర పథకాల పునరుద్ధరణ, నిధుల సద్వినియోగం. 46. రాష్ట్రానికి రూ.1 లక్ష కోట్ల విలువైన నేషనల్ హైవే, రైల్వే ప్రాజెక్టులు. 47. కొత్తగా రెండు జిల్లాల ఏర్పాటుతో మొత్తం 28 జిల్లాలు. 48. మహిళలకు లక్ష కుట్టు మిషన్ల పంపిణీ. 49. రికార్డు స్థాయిలో ధాన్యం సేకరణ, 24 గంటల్లో రైతులకు రూ.8,120 కోట్లు జమ. 50. మార్కెట్ ఇంటర్వెన్షన్‌తో వివిధ పంటలకు రూ.1,100 కోట్లకు పైగా సాయం. 51. సమర్థ నీటి నిర్వహణతో 6.08 మీటర్లకు పెరిగిన భూగర్భ జలాలు. 52. సాగునీటి ప్రాజెక్టులకు 20 నెలల్లో రూ.23,793 కోట్ల ఖర్చు. 53. హంద్రీనీవా పనులు పూర్తి చేసి సీమకు 43 టీఎంసీల తరలింపు. 54. వెలిగొండ ప్రాజెక్టుకు రూ.571 కోట్లు వ్యయం. 55. శరవేగంగా పోలవరం నిర్మాణం, 2027 పుష్కరాలకు ప్రారంభం. 56. తుంగభద్ర గేట్ల మరమ్మతులకు ఏపీ వాటాగా రూ.55 కోట్లు. 57. రూ.610 కోట్లతో వివిధ ప్రాజెక్టుల మరమ్మతులు, రూ.878 కోట్లతో కాలువల నిర్వహణ. 58. 6,047 సాగునీటి సంఘాలకు ఎన్నికలు. 59. కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రం మీదుగా 3 హై స్పీడ్ రైల్ కారిడార్లు. 60. ఆర్థిక కష్టాలు ఉన్నా ప్రభుత్వ ఉద్యోగులకు సంక్షేమ ఫలాలు.

# రెడ్ డ్రెస్ లో మానస అందాలు..





సోషల్ మీడియాను ఈ మధ్య సెలబ్రిటీలు పాపులారిటీ సంపాదించుకోవడానికి ఆయుధంగా మలుచుకుంటున్నారు. అందులో భాగంగానే అందాలు ఆరబోస్తూ ప్రేక్షకులను ఆకట్టుకోవడమే కాకుండా తమ ట్రెండీ ఫ్యాషన్స్ తో అటు ఫ్యాషన్ ప్రియులను కూడా మెప్పిస్తున్నారు. ముఖ్యంగా తమ డ్రెస్ సెన్స్ తో అమ్మాయిలకు సరికొత్త ఫ్యాషన్ ను పరిచయం చేస్తున్న విషయం తెలిసిందే. ఈ మధ్యకాలంలో కాలేజ్ కి వెళ్ళే అమ్మాయిలు కూడా హీరోయిన్స్ డ్రెస్సింగ్ ను ఫాలో అవుతున్నారు అంటే ఇక సెలబ్రిటీలు ఏ రేంజ్ లో యువతను ఆకట్టుకుంటున్నారో అర్థం చేసుకోవచ్చు. కాలానుకనుగుణంగా చాలా అందంగా తయారవుతూ అభిమానులను ఆకట్టుకుంటున్న ఈ ముద్దుగుమ్మలు.. అటు ఫాలోవర్స్ ని కూడా పెంచుకుంటున్నారు. ఒకవైపు అందాలు ఆరబోస్తూ మరొకవైపు కొన్ని ఉత్పత్తులను ప్రమోట్ చేస్తూ భారీగా ఆదాయాన్ని పెంపొందించుకుంటున్న విషయం తెలిసిందే . ఇదిలా ఉండగా ఇప్పుడు తన అందంతో ఆకట్టుకోవడమే కాకుండా తన సినిమా ప్రమోషన్స్ లో భాగంగా ఇలా ఘాటు మిర్చిలా రెడ్ డ్రెస్ లో ఫోటోలు షేర్ చేసి అందరినీ ఆకట్టుకుంది మానస వారణాసి.అందం , అభినయంతో అభిమానులను ఆకట్టుకునే ఈ చిన్నది సింపుల్ స్టైల్ తో మనసుకు హత్తుకునేలా ఫోటోలకు ఫోజులిచ్చింది.



విషయంలోకి వెళ్తే.. సంతోష్ శోభన్ హీరోగా మానస వారణాసి హీరోయిన్గా తెరకెక్కుతున్న చిత్రం కపుల్ ఫ్రెండ్లీ . ఫిబ్రవరి 14వ తేదీన వాలెంటైన్స్ డే సందర్భంగా ప్రేక్షకుల ముందుకు రాబోతున్న నేపథ్యంలో ఇటీవల మంగళవారం హైదరాబాదులో ఒక ప్రెస్ మీట్ నిర్వహించింది. చిత్ర బృందం. అందులో భాగంగానే తన అద్భుతమైన డ్రెస్సింగ్ సెన్స్ తో అందర్నీ ఆకట్టుకున్న ఈమె.. అవే ఫోటోలను ఫోటోషూట్ నిర్వహించి సోషల్ మీడియా వేదికగా పంచుకుంది. ఇందులో సింపుల్ స్టైల్ తో ఆకట్టుకుంటూనే మరొకవైపు గార్జియస్ లుక్ లో కనిపించి ఆడియన్స్ హృదయాలను దోచుకుంది. అసలు గుట్టు విప్పిన నిఖిల్ ఇకపోతే ఈ లుక్ లో ఈమెను చూసిన కొంతమంది అభిమానులు జూనియర్ అనుపమ అంటూ కామెంట్ కూడా చేస్తున్నారు. మొత్తానికైతే మానస వారణాసి పంచుకున్న ఈ లేటెస్ట్ ఫోటోషూట్ విపరీతంగా వైరల్గా మారింది. ఇకపోతే వాలెంటైన్స్ డే సందర్భంగా తన సినిమా విడుదలవుతున్న నేపథ్యంలో.. తాజాగా నిర్వహించిన ప్రెస్ మీట్ లో మానస వారణాసి మాట్లాడుతూ.. ప్రేమపై తన అభిప్రాయాన్ని చెప్పుకొచ్చింది. మనం మన ఇంట్లో మన కుటుంబ సభ్యుల మధ్య ఎంత భద్రతగా ఫీల్ అవుతామో ..ప్రేమికుడి వద్ద అంతే భద్రతగా ఉండాలి. అదే అసలైన ప్రేమకు నిర్వచనం అంటూ చెప్పుకొచ్చింది.. మొత్తానికైతే అటు తన నటనతోనే కాదు ఇటు అద్భుతమైన అభిప్రాయాలను పంచుకుంటూ వార్తల్లో నిలుస్తోంది మానస వారణాసి. మానస వారణాసి తెలంగాణకు చెందిన మోడల్.. కోకోకోల మ్యూజిక్ హాల్ 2021 భారతదేశం తరపున మిస్ వరల్డ్ పోటీలలో ప్రాతినిధ్యం వహించి పదవ స్థానంలో నిలిచింది.

# పవర్‌స్టార్ కోసం క్రేజీ ప్లాన్.. ఫ్యాన్స్‌కు పూనకాలే?

పవర్‌స్టార్ పవన్‌కల్యాణ్ -ఓజీ- బ్లాక్ బస్టర్‌తో మళ్లీ ట్రాక్‌లోకి వచ్చేశారు. సుజీత్ డైరెక్ట్ చేసిన ఈ మూవీ పవన్ ఫ్యాన్స్‌ని ఫుల్ ఖుషీ చేసింది. బాక్సాఫీస్ వద్ద భారీ విజయాన్ని సాధించి వసూళ్ల పరంగానూ రికార్డులు సృష్టించింది. గత ఏడాది విడుదలైన సౌత్ సినిమాల్లో అత్యధిక వసూళ్లని రాబట్టిన మూవీగా నిలిచింది. పవన్ యుఫోరియా కారణంగా ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద రూ.300 కోట్లమేర కలెక్షన్స్‌ని రాబట్టిన విషయం తెలిసిందే. ఈ మూవీ అందించిన జోష్‌తో పవన్ ఇప్పుడు -ఉస్తాద్ భగత్‌సింగ్-లో నటిస్తున్న విషయం తెలిసిందే.-గబ్బర్‌సింగ్- వంటి బ్లాక్ బస్టర్ హిట్ మూవీ తరువాత హరీష్ శంకర్, పవన్ కల్యాణ్ కలిసి చేస్తున్న సినిమా కావడంతో ఈ ప్రాజెక్ట్‌పై అభిమానుల్లో, సినీ లవర్స్‌లో భారీ అంచనాలు ఏర్పడ్డాయి. ఇందులో పవన్ పవర్ ఫుల్ పోలీస్ ఆఫీసర్‌గా నటిస్తున్నాడు. శ్రీలీల, రాశీఖన్నా హీరోయిన్‌లుగా నటిస్తున్నారు. దర్శకుడు దశరథ్ స్క్రీన్‌ప్లే అందిస్తున్న ఈ మూవీ షూటింగ్ ఇప్పటికే పూర్తయింది. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు జరుగుతున్నాయి. ఇప్పటికే అంచనాలు పెంచేసిన ఈ క్రేజీ యాక్షన్ డ్రామాని మార్చి 26న భారీ స్థాయిలో రిలీజ్ చేస్తున్నారు. సత్యదేవ్, అశుతోష్ రాణా, నవాబ్ షా, గౌతమి కీలక పాత్రల్లో నటిస్తున్నారు. దళపతి విజయ్ హిట్ మూవీ -థేరీ- దీనికి ఆధారమని ప్రచారం జరుగుతోంది. కానీ హరీష్ శంకర్ మాత్రం ఇది రీమేక్ కాదని వాదిస్తున్నాడు. ఇదిలా ఉంటే దీని తరువాత పవన్ కల్యాణ్ స్టైలిస్ డైరెక్టర్ సురేందర్‌రెడ్డితో ఓ భారీ యాక్షన్ డ్రామాని చేయనున్న విషయం తెలిసిందే.



వక్కంతం వంశీ స్టోరీ అందిస్తున్న ఈ మూవీని రామ్ తాళ్లూరి నిర్మించనున్నారు. ఇది అన్నా దమ్ముల నేపథ్యంలో సాగే పవర్ ఫుల్ స్టోరీ అని తెలుస్తోంది. అసలు గుట్టు విప్పిన నిఖిల్ అంతా ఓకే మరి తమ్ముడిగా పవన్‌కు ఎవరు నటిస్తారు? అన్నది ఇప్పుడు అందరిలో ఆసక్తిని రేకెత్తిస్తోంది. తాజా సమాచారం ప్రకారం ఓ క్రేజీ హీరోని పవన్‌కు సోదరుడి క్యారెక్టర్ కోసం సురేందర్ రెడ్డి ట్రై చేస్తున్నారట. తను ఓకే అంటే థియేటర్లలో పూనకాలేనని తెలుస్తోంది. ఇంతకీ పవన్ కల్యాణ్‌కు తమ్ముడిగా సురేందర్‌రెడ్డి ట్రై చేస్తున్న యంగ్ హీరో మరెవరో కాదని, రౌడీ స్టార్ విజయ్ దేవరకొండ అని ఇండస్ట్రీ వర్గాల్లో వినిపిస్తోంది. ప్రస్తుతం విజయ్ దేవరకొండ -రౌడీ జనార్ధన-, -రణబాలి- వంటి పాన్ ఇండియా సినిమాలతో బిజీగా ఉన్నాడు. ఈ రెండు కూడా తనకు చాలా ఇంపార్టెంట్. ఇలాంటి సమయంలో విజయ్ దేవరకొండ...పవన్ కోసం తమ్ముడిగా నటిస్తాడంటే కష్టమే. ఆ అవకాశం లేదు. కానీ సురేందర్‌రెడ్డి ట్రై చేస్తే అవుతుందని ఓ వర్గం అంటున్నారు. ఏది ఏమైనా వరుస పాన్ ఇండియా ప్రాజెక్ట్‌లతో బిజీగా ఉన్న విజయ్ దేవరకొండ ..సురేందర్‌రెడ్డి ఆఫర్‌ని అంగీకరించే అవకాశమే లేదని, పవన్‌కు తను తమ్ముడి కనిపించకపోవచ్చని రౌడీ ఫ్యాన్స్ అంటున్నారు.

# మినీ ఫ్రాక్ లో పిచ్చెక్కిస్తున్న సిమ్రాన్ చౌదరి..



ఒకవైపు సినిమాలతో బిజీగా ఉంటూనే.. మరొకవైపు అభిమానులను అలరించడానికి నిత్యం పరితపిస్తున్న హీరోయిన్స్ ఎంతోమంది ఉన్నారు. ముఖానికి మేకప్ వేసుకుని కెమెరా ముందు దర్శనమిచ్చే ఈ అమ్మాయిలు.. తమ అందాలతో యువతను విపరీతంగా అలరిస్తున్నారు అనడంలో సందేహం లేదు. నిత్యం సినిమా షూటింగ్ లతో బిజీగా ఉండే ఈ హీరోయిన్స్ అభిమానులను ఎప్పటికప్పుడు అలరించడానికి భిన్న విభిన్నమైన వస్త్రధారణలతో అలరిస్తున్న విషయం తెలిసిందే. ఇకపోతే ఫోటోషూట్ అంటూ ప్రత్యేకంగా కొన్ని ప్రదేశాలను కూడా ఎంపిక చేసుకొని తమ అందాలతో ఆడియన్స్ హృదయాలను దోచుకుంటున్నారు. అందులో భాగంగానే ప్రముఖ యంగ్ బ్యూటీ సిమ్రాన్ చౌదరి కూడా తన అందాలతో ఆకట్టుకోవడానికి మరోసారి అభిమానుల ముందుకు వచ్చేసింది. అయితే ఈసారి తన ఫోటోషూట్ ను టెన్నిస్ కోర్టు నుంచి షేర్ చేసుకోవడం గమనార్హం. స్కై బ్లూ అండ్ వైట్ మినీ స్కర్ట్ ధరించి తన అందాలతో మెస్మరైజ్ చేసింది. పైగా ఉల్లి పొరలాంటి వైట్ కలర్ షర్ట్ ధరించి పలు రకాల ఫోజులతో యువతను విపరీతంగా ఆకట్టుకుంటుంది. ముఖ్యంగా సిమ్రాన్ చౌదరి షేర్ చేసిన ఈ ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ అవ్వడమే కాకుండా అమ్మడి అందానికి ముగ్ధులవుతున్నారు. విశ్వక్ సేన్ పాగల్, అథర్వ వంటి చిత్రాలతో భారీ పాపులారిటీ సొంతం చేసుకున్న సిమ్రాన్ చౌదరి ఈ ఏడాది 'వనవీర' సినిమాతో కొత్త సంవత్సరాన్ని ప్రారంభించింది. 2026 జనవరి 1న విడుదలైన తెలుగు యాక్షన్ డ్రామా చిత్రంగా వచ్చిన ఈ చిత్రానికి అవినాష్ తిరువీధుల దర్శకత్వం వహించారు. నందు విజయ్ కృష్ణ తో కలిసి నటించారు. పౌరాణిక ప్రేరేపిత యాక్షన్ చిత్రమే కానీ అంచనాలు పెద్దగా లేకపోవడం వల్ల ఈ సినిమా బాక్సాఫీస్ వద్దగా రాణించలేదు. ఈ చిత్రానికి వివేక్ సాగర్ సంగీతాన్ని అందించారు. మరోవైపు టీవీ సిరీస్ 'మిషన్ తఫాసీ' లో కూడా నటిస్తోంది. ప్రస్తుతం ఇది షూటింగ్ దశలో ఉన్న విషయం తెలిసిందే. అలాగే తరుణ్ భాస్కర్ దర్శకత్వంలో బ్లాక్ బస్టర్ హిట్ అందుకున్న 'ఈ నగరానికి ఏమైంది?' సీక్వెల్ లో కూడా నటిస్తోంది. ప్రస్తుతం ఈ నగరానికి ఏమైంది రిపీట్ ప్రేక్షకుల ముందుకు రానున్న ఈ సినిమా షూటింగ్ జరుపుకుంటుంది. కాలేజ్ ఫ్రెండ్షిప్, ఫన్, కలలు వంటి అంశాలను మిళితం చేస్తూ చాలా సహజంగా చూపించిన ఈ నగరానికి ఏమైంది అనే సినిమా అప్పట్లో సూపర్ హిట్ గా నిలిచింది . ఇప్పుడు ఆ సినిమాకు కొనసాగింపుగా ఈ నగరానికి ఏమైంది రిపీట్ అంటూ ప్రేక్షకుల ముందుకు రానున్నారు. అక్టోబర్ లేదా నవంబర్ నెలలో ఈ సినిమాను విడుదల చేయాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ కూడా శరవేగంగా సాగుతోంది. మొత్తానికైతే సిమ్రాన్ చౌదరి ఇలా ఒకవైపు వరుస సినిమాలలో హీరోయిన్గా నటిస్తూనే.. మరొకవైపు అందాలు ఆరబోస్తూ అభిమానులను ఆకట్టుకునే ప్రయత్నం చేస్తోంది.



# 2027:టాప్ క్రేజీ పాన్ ఇండియా మూవీస్ ఇవే!






పాన్ ఇండియా సినిమాల ప్రవాహం తరువాత ఎక్కడా చూసినా, ఏ నోట విన్నా వినిపిస్తున్న మాట సౌత్..సౌత్.. బాలీవుడ్ ప్రభావం భారీగా తగ్గడం, క్రేజీ స్టార్ల సినిమాలు బాక్సాఫీస్ వద్ద భారీ డిజాస్టర్లుగా మారడంతో సౌత్‌తో పాటు నార్త్ ప్రేక్షకులు కూడా ఇప్పుడు సౌత్ సినిమాల జపం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో వచ్చే ఏడాది సౌత్ నుంచి భారీ క్రేజీ సినిమాలు బాక్సాఫీస్ వద్ద సందడి చేయబోతున్నాయి. వేల కోట్ల మేర బిజినెస్ చేయడానికి రెడీ అవుతున్నాయి. అందులో టాప్ 4 సినిమాలపై ఇప్పుడు ప్రత్యేకమైన చర్చ జరుగుతోంది. 2027లో అత్యంత హైప్‌ని సొంతం చేసుకున్న సినిమాలు రజనీ-కమల్‌ల కాంబినేషన్‌ల రానున్న భారీ మల్టీస్టారర్ ఒకటి. ఇదే తరహాలో అల్లు అర్జున్, అట్లీల కాంబినేషన్‌లో రూపొందుతున్న భారీ పాన్ వరల్డ్ మూవీ మరొకటి. జక్కన్న, సూపర్ స్టార్ మహేష్‌బాబుల తొలి కాంబినేషన్‌లో రూపొందుతున్న -వారణాసి- మూడవది. క్రేజీ సినిమాలతో దర్శకుడిగా ప్రత్యేకతను చాటుకుంటున్న సందీప్‌రెడ్డి వంగ, ప్రభాస్ కలయికలో రూపొందుతున్న మోస్ట్ యాంటిసిపేటెడ్ మూవీ -స్పిరిట్- నాలుగవది. ఈ వరుసలో రజనీ- కమల్ మూవీ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిందే. దాదాపు 46 విరామం తరువాత మళ్లీ వీరిద్దరు కలిసి చేస్తున్న భారీ మల్టీస్టారర్ మూవీగా దీన్ని చెబుతున్నారు. డార్క్ కామెడీ యాక్షన్ డ్రామాగా రూపొందనున్న ఈ మూవీకి -జైలర్- డైరెక్టర్ నెల్సన్ దిలీప్ కుమార్ దర్శకత్వం వహించనున్నాడు. ఇటీవలే దీనికి సంబంధించిన ఓ ప్రోమోని కూడా షూట్ చేసినట్టుగా తెలిసింది. ఈ ప్రాజెక్ట్‌పై భారీ అంచనాలున్నాయి. 80వ దశకం నేపథ్యంలో సాగే యాక్షన్ డ్రామాగా దీన్ని నెల్సన్ తెరకెక్కించబోతున్నాడు. బిజినెస్ కూడా రికార్డు స్థాయిలో జరగనున్న ఈ మూవీ 2027లో వన్ ఆఫ్ ద టాప్ టాక్డ్ మూవీగా నిలుస్తుందని తెలుస్తోంది. -పుష్ప 2- వంటి పాన్ ఇండియా బ్లాక్ బస్టర్ తరువాత బన్నీ కోలీవుడ్ స్టార్ డైరెక్టర్ అట్లీ డైరెక్షన్‌లో భారీ పాన్ వరల్డ్ మూవీకి శ్రీకారం చుట్టిన విషయం తెలిసిందే. దీపిక పదుకునే మెయిన్ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ మూవీని హాలీవుడ్ స్టార్ సూపర్ హీరో మూవీగా తెరకెక్కిస్తున్నారు. సన్ పిక్చర్స్ బ్యానర్‌పై ఇండియన్ ఫిల్మ్ ఇండస్ట్రీలోనే అత్యంత భారీ బడ్జెట్ ఫిల్మ్‌గా దీన్ని రూపొందిస్తున్నారు. రష్మిక మందన్న, మృణాల్ ఠాకూర్, జాన్వీ కపూర్ హీరోయిన్‌లుగా నటిస్తున్నారని ప్రచారం జరుగుతోంది. అయితే రష్మిక ఇప్పటికే సెట్‌లోకి ఎంట్రీ ఇవ్వడం, యాక్షన్ ఘట్టాల్లో పాల్గొనడంతో సినిమాపై అంచనాలు తారా స్థాయికి చేరుకున్నాయి. హాలీవుడ్ టెక్నీషియన్‌లు ఈ మూవీకి వర్క్ చేస్తున్నారు. ఇది వచ్చే ఏడాది ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇక సూపర్‌స్టార్ మహేష్ బాబు, జక్కన్నల తొలి కాంబినేషన్‌లో రూపొందుతున్న మూవీ -వారణాసి-. పృథ్వీరాజ్ సుకుమారన్ కీలక విలన్ పాత్రలో నటిస్తుండగా గ్లోబల్ బ్యూటీ ప్రియాంక చోప్రా హీరోయిన్‌గా నటిస్తోంది. ప్రకాష్ రాజ్ కీలక పాత్రలో కనిపించనున్న ఈ మూవీని టైమ్ ట్రావెల్, మైథలాజికల్ డ్రామాగా రాజమౌళి తెరకెక్కిస్తున్నాడు. ఇప్పటికే దేశ వ్యాప్తంగా హాట్ టాపిక్‌గా మారిన ఈ మూవీ వచ్చే ఏడాది ఏప్రిల్ 7న రిలీజ్ కానుంది. ప్రభాస్ నటిస్తున్న భారీ యాక్షన్ డ్రామా -స్పిరిట్-. సందీప్‌రెడ్డి వంగ దర్శకుడు. ప్రకాష్‌రాజ్, కాంచన, వివేక్ ఓబెరాయ్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. త్రిప్తి దిమ్రీ హీరోయిన్. ప్రభాస్ ఫస్ట్ టైమ్ పవర్‌ఫుల్ పోలీస్ ఆఫీసర్‌గా నటిస్తున్న ఈ మూవీ షూటింగ్ ప్రస్తుతం శరవేగంగా జరుగుతోంది. భారీ బడ్జెట్‌తో రూపొందుతున్న ఈ సినిమాతో బాక్సాఫీస్ రికార్డ్స్‌ని తిరగరాయాలని సందీప్‌రెడ్డి వంగ ప్లాన్ చేస్తున్నాడు. వచ్చే ఏడాది మార్చి 5న పాన్ ఇండియా మూవీగా ప్రేక్షకుల ముందుకు రానుంది. వీటితో పాటు -రామయణ 2- కూడా వచ్చే ఏడాదే రానుంది. 2027 దీపావళికి ఈ భారీ మూవీని రిలీజ్ చేయబోతున్నారు. ఫస్ట్ పార్ట్ 2026 దీపావళి సందర్భంగా నవంబర్ 8న రిలీజ్ కాబోతోంది.

# బాలయ్య, వంశీతో మూవీ.. పవన్ డైరెక్టర్ ప్లాన్ ఏంటి?

టాలీవుడ్ లో ఇంట్రెస్టింగ్ కాంబినేషన్లకు ఎప్పుడూ స్పెషల్ క్రేజ్ ఉంటుందని చెప్పాలి. అలాంటి మరొక కాంబో ఇప్పుడు ఫిక్స్ అయినట్లు టాక్ వినిపిస్తోంది. నటసింహం నందమూరి బాలకృష్ణ, ప్రముఖ నిర్మాత నాగవంశీ, దర్శకుడు హరీష్ శంకర్ కాంబోలో మూవీ దాదాపు ఖరారైనట్లు వార్తలు వస్తున్నాయి. మరికొద్ది రోజుల్లో అధికారిక ప్రకటన కూడా రానుందని వినికిడి అయితే చాలా కాలంగా బాలయ్యతో సినిమా చేయాలన్న ప్రయత్నంలో ఉన్న హరీష్ శంకర్ కు ఎట్టకేలకు గ్రీన్ సిగ్నల్ దొరికిందన్న టాక్ వినిపిస్తోంది. నిజానికి మాస్ ఎంటర్టైన్మెంట్ సినిమాలు తీయడంలో హరీష్ శంకర్ టాలెంట్ తెలిసిందే. గబ్బర్ సింగ్, మిరపకాయ్, సుబ్రహ్మణ్యం ఫర్ సేల్ వంటి సినిమాలతో తన మార్క్ చూపించారు. ముఖ్యంగా స్టార్ హీరోలను మాస్ ఆడియన్స్ కు మరింత దగ్గర చేయడం ఆయన స్పెషాలిటీ. మిస్ ఇండియా కిరీటం మిస్ అయినా.. వెండితెర 'రంభ'గా ఆమె మేజిక్ తగ్గలేదు! ఇప్పుడు బాలయ్య బాడీ లాంగ్వేజ్ కు సరిపోయే పవర్ ఫుల్ స్టోరీ రెడీ చేశాడని సమాచారం. నాగవంశీ నిర్మాణంలో భారీ బడ్జెట్ తో ఆ ప్రాజెక్ట్ సెట్స్ పైకి వెళ్లనుందట. అయితే హరీష్ శంకర్ ప్రస్తుతం ఫామ్ లో లేరనే అభిప్రాయం చాలా మందిలో ఉంది. ఇటీవల రవితేజతో చేసిన మిస్టర్ బచ్చన్ సినిమా భారీ అంచనాల మధ్య విడుదలై బాక్సాఫీస్ వద్ద తీవ్ర నిరాశ కలిగించింది. డిజాస్టర్ గా నిలిచిన ఆ సినిమా తర్వాత హరీష్ కెరీర్ పై ప్రశ్నలు తలెత్తాయి. సాధారణంగా ఇలాంటి సమయంలో హీరోలు దర్శకుల సెలెక్షన్ విషయంలో జాగ్రత్త పడుతుంటారు. ఫ్లాప్ ట్రాక్ లో ఉన్న దర్శకులకు సినిమా చేసే ఛాన్స్ ఇవ్వడంలో కొంత వరకు ఆలోచిస్తారు. కానీ బాలయ్య మాత్రం వేరు. కథ నచ్చితే దర్శకుడి గత రిజల్ట్స్ ను పెద్దగా పట్టించుకోరని తెలిసిందే.టాలెంట్ ను నమ్మి అవకాశాలు ఇవ్వడం బాలయ్య స్టైల్. ఆ కారణంతోనే ఇప్పుడు హరీష్ శంకర్ కు ఛాన్స్



దక్కినట్లు తెలుస్తోంది. మరో విషయమేమిటంటే ఇప్పుడు హరీష్ శంకర్.. ఉస్తాద్ భగత్ సింగ్ మూవీతో బిజీగా ఉన్నారు. పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ తో చేస్తున్న ఆ సినిమా మీద భారీ అంచనాలు ఉన్నాయి. మంచి హిట్ గా నిలిస్తే హరీష్ కు మళ్లీ మాస్ డైరెక్టర్ గా స్ట్రాంగ్ రీఎంట్రీ దక్కే అవకాశం ఉంది. అప్పుడు బాలయ్య ప్రాజెక్ట్ కూ మరింత బూస్ట్ వచ్చే ఛాన్స్ ఉంది. మార్కెట్, బిజినెస్ పరంగా కూడా హైప్ పెరుగుతుందనే చెప్పాలి. ఏదేమైనా బాలయ్య- హరీష్ శంకర్ కాంబో నిజమైతే మాస్ ప్రేక్షకులకు పండగే. పవర్ ఫుల్ డైలాగులు, యాక్షన్ ఎలిమెంట్స్, ఎమోషన్స్ తో పక్కా కమర్షియల్ ఎంటర్టైనర్ మూవీ రూపొందే అవకాశాలు కనిపిస్తున్నాయి. దీంతో అఫీషియల్ అనౌన్స్మెంట్ కోసం అభిమానులు ఈగర్ గా వెయిట్ చేస్తున్నారు.

# ప్రజాక్షేత్రంలో దూసుకెళ్తున్న బీసీవై పార్టీ

## పార్టీ పదవుల మూడో జాబితా విడుదల

**నెల్లూరు, అల్లూరి సీతారామరాజు, తిరుపతి జిల్లాల్లో వివిధ పదవులకు నూతన సారథులు నియామకం**

మంగళగిరి, ఫిబ్రవరి 11 (

బడుగు, బలహీన వర్గాల రాజ్యాధికార సాధనే లక్ష్యంగా, క్షేత్రస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేసే దిశగా భారతచైతన్య యువజన పార్టీ జాతీయ అధ్యక్షులు బోడె రామచంద్రయాదవ్ మరో ముందడుగు వేశారు. పార్టీ పదవుల నియామకాలకు సంబంధించి, ఆయన బుధవారం నాడు మూడో జాబితాను విడుదల చేశారు. మూడో జాబితాలో భాగంగా స్టేట్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ నుంచి నియోజకవర్గ ఇన్ చార్జ్ వరకు అనేక పదువులకు నాయకులను నియమించారు, ప్రధానంగా నెల్లూరు, అల్లూరి సీతారామరాజు, తిరుపతి జిల్లాలకు సంబంధించి వివిధ స్థాయిలలో పలువురు నాయకులను కీలక పదవులలో నియమించారు. జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయి కమిటీలతో పాటు, వివిధ అనుబంధ సంఘాలలో నూతన నాయకులకు బాధ్యతలు అప్పగించారు.నూతనంగా నియమితులైన నాయకులందరూ, పార్టీ ఆశయాలకు అనుగుణంగా పనిచేయాలని, ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగడుతూ, ప్రజల పక్షాన నిలబడాలని రామచంద్రయాదవ్ పిలుపునిచ్చారు. రాబోయే రోజుల్లో మరిన్ని నియామకాలతో పార్టీని మరింత పటిష్టం చేసి, ప్రజా ఉద్యమాలను ఉధృతం చేస్తామని ఆయన ప్రకటించారు.

# కరాటేలో కెబిఎన్ విద్యార్థులకు పతకాలు



జపాన్ కరాటే అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 8వ తేదీన తాడేపల్లిలో జరిగిన జాతీయ స్థాయి పోటీల్లో తమ కళాశాలలో శిక్షణ పొందిన విద్యార్థులు 'కటా', 'కుమితే' విభాగాల్లో పతకాలు సాధించినట్లు కె.బి.ఎన్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.కృష్ణవేణి చెప్పారు. బుధవారం కళాశాలలో నిర్వహించిన అభినందన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ బాలికల 'కటా' విభాగంలో బి.కృతఘ్న్య ప్రథమ, అయేషా కౌశర్, జి.ధర్మిక తృతీయ స్థానాలు సాధించినట్లు చెప్పారు. బాలుర 'కటా' విభాగంలో సిహెచ్. సాయి స్మరణ్ ప్రథమ, బి.రక్షణ్, ఎన్.ఉమేష్ చంద్ర ద్వితీయ, కె.తనీష్ సాయి తేజ, డి.కష్వంత్ తృతీయ స్థానాలు పొందినట్లు చెప్పారు. కరాటే శిక్షకురాలు జి.వరలక్ష్మి మాట్లాడుతూ బాలిక 'కుమితే' విభాగంలో బి.కృతఘ్న్య, జి.దర్మిక తృతీయ స్థానాలు పొందగా, బాలుర 'కుమితే' విభాగంలో సిహెచ్.సాయిస్మరణ్ ద్వితీయ, బి.రక్షణ్, ఎన్. ఉమేష్ చంద్ర, కె.తనీష్ సాయి తృతీయ స్థానాలు పొందినట్లు చెప్పారు. వైస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ ఎం.వేంకటేశ్వరరావు, పి.ఎల్.రమేష్ విజేతలను అభినందించారు.

# శైవభక్తులకు ఉచిత వైద్య శిబిరం

**లీ ఫార్మా.. ఏలూరి లక్ష్మీదేవి చారిటబుల్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో**

అమరావతి, ఫిబ్రవరి 11



మహాశివరాత్రి మహాపర్వదినాన్ని పురస్కరించుకుని పాదయాత్రగా శ్రీశైలం వెళ్లే శైవభక్తుల ఆరోగ్య రక్షణను దృష్టిలో ఉంచుకుని లీ ఫార్మా, ఏలూరి లక్ష్మీదేవి చారిటబుల్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నారు. మానవతామూర్తిగా, ఆదర్శవంతమైన జీవితాన్ని గడిపిన స్వర్గీయ ఆళ్ల నాగిరెడ్డి స్మారకార్థం ఏర్పాటు చేసిన ఫౌండేషన్ ద్వారా ఈ వైద్య సేవలు అందించబడుతున్నాయి. అలాగే నిస్వార్థ సేవకు ప్రతిరూపంగా నిలిచిన స్వర్గీయ ఏలూరి లక్ష్మీదేవి జ్ఞాపకార్థం స్థాపించిన ఏలూరి లక్ష్మీదేవి చారిటబుల్ ట్రస్ట్ ద్వారా పలు సేవా కార్యక్రమాలు, ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ మహాశివరాత్రి సందర్భంగా దోర్నాల నుంచి నడకదారిలో శ్రీశైలం చేరుకునే భక్తులకు కాళ్ల నొప్పులు, జ్వరం, తలనొప్పి, అలసట, బీపీ, షుగర్ వంటి సమస్యలకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు పంపిణీ చేయనున్నారు. ఈ సేవా కార్యక్రమం ఈ నెల 14వ తేదీ నుంచి 16వ తేదీ వరకు కొనసాగుతుందని డాక్టర్ ఏలూరి రామచంద్రరెడ్డి తెలిపారు. "శరీరారోగ్యమే శివారాధనకు ఆధారం" అన్న భావంతో భక్తులకు ఉచిత వైద్య సేవలు అందించడం ఆనందంగా ఉందని పేర్కొన్నారు. ఈ శిబిరం దోర్నాలలో నీలంపాటి అమ్మవారి గుడి ఎదురుగా, శ్రీశైలం రోడ్డులో నిర్వహించబడుతుందని వివరించారు. "హర హర మహాదేవ" నామస్మరణతో సాగుతున్న పాదయాత్రలో ఈ వైద్య శిబిరం భక్తులకు శివానుగ్రహంగా నిలవాలని నిర్వాహకులు ఆకాంక్షించారు.

# రూ.6 కోట్లతో నూజివీడు పట్టణ అభివృద్ధి పనులు ప్రారంభం

**స్మార్ట్ సిటీ లక్ష్యంగా ముందడుగు: మంత్రి కొలుసు పార్థసారథి**

నూజివీడు, ఫిబ్రవరి 11 )



నూజివీడు పట్టణాన్ని స్మార్ట్ సిటీగా అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో రాష్ట్ర గృహ నిర్మాణ మరియు సమాచార--పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి సుమారు రూ.6 కోట్ల గ్రాంట్లు మంజూరు చేసి పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. ఇప్పటికే నియోజకవర్గంలోని మండలాల్లో బీటీ, సీసీ రోడ్లు విస్తృతంగా నిర్మించిన మంత్రి, పట్టణాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించారు. పట్టణంలో బీటీ రోడ్లు, సీసీ రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ అభివృద్ధి, సెంట్రల్ లైటింగ్, పార్కు మరియు స్మశానవాటిక అభివృద్ధి వంటి పనులు చేపట్టారు.ఆర్టీసీ బస్టాండ్ నుంచి రాజీవ్ సర్కిల్ వరకు రూ.61 లక్షలతో బీటీ రోడ్డు నిర్మాణం, చిన గాంధీ సెంటర్ నుంచి హనుమాన్ జంక్షన్ రోడ్డులోని ఎన్టీఆర్ విగ్రహం వరకు రోడ్డు విస్తరణకు రూ.1.32 కోట్లు మంజూరు చేశారు. సెంట్రల్ లైటింగ్ కోసం రూ.63 లక్షలు, సీసీ రోడ్ల అభివృద్ధికి రూ.1 కోటి, సీసీ రోడ్లు మరియు డ్రైనేజీ అభివృద్ధికి రూ.1.64 కోట్లు, పార్కు అభివృద్ధికి రూ.40 లక్షలు, స్మశానవాటిక అభివృద్ధికి రూ.40 లక్షలు కేటాయించారు. ఈ పనులు శరవేగంగా పూర్తి చేసి ప్రజలకు అంకితం చేయనున్నట్లు తెలిపారు. పట్టణాన్ని ఉన్నత స్థాయికి తీసుకెళ్లేందుకు అహర్నిశలు కృషి చేస్తున్న మంత్రికి నియోజకవర్గ ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నో ఏళ్లుగా అభివృద్ధికి దూరంగా ఉన్న ప్రాంతాల్లో కూడా ఇప్పుడు రహదారులు, లైటింగ్, మౌలిక వసతులు కల్పించడం పట్ల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. నూజివీడు అభివృద్ధికి మంత్రి కొలుసు పార్థసారథి శాశ్వత చిరునామాగా నిలుస్తారని స్థానికులు పేర్కొన్నారు.

# ఏపీలో వృద్ధి లక్ష్యంగా రియల్ ఎస్టేట్ ప్రణాళికలు

- జాతీయ పట్టణాభివృద్ధి సదస్సుకు ఏపీ సిద్ధం

విజయవాడ, ఫిబ్రవరి 11




ఆంధ్రప్రదేశ్‌లో విస్తరిస్తున్న మౌలిక సదుపాయాలు, పట్టణీకరణను జాతీయ స్థాయిలో ప్రదర్శించేందుకు రాష్ట్ర రియల్ ఎస్టేట్ రంగం సిద్ధమైంది. ఈనెల 13, 14వ తేదీల్లో న్యూఢిల్లీలోని 'యశోభూమి'లో జరగనున్న 'జాతీయ పట్టణ, రియల్ ఎస్టేట్ అభివృద్ధి సదస్సు 2026'లో నరెడ్కో ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రతినిధులు పాల్గొననున్నారు. అమరావతి, విశాఖపట్నం సహా రాష్ట్రంలోని ప్రధాన నగరాల్లో జరుగుతున్న అభివృద్ధిని, పెట్టుబడి అవకాశాలను ఈ వేదిక ద్వారా దేశవ్యాప్త పారిశ్రామికవేత్తల ముందు ఉంచనున్నారు. ఈ సందర్భంగా నరెడ్కో ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు జీ చక్రధర్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రియల్ ఎస్టేట్ రంగం ప్రస్తుతం స్థిరమైన వృద్ధిని సాధిస్తోందన్నారు. భారీ మౌలిక సదుపాయాల అభివృద్ధి, మెరుగైన రవాణా సౌకర్యాలు రాష్ట్రవ్యాప్తంగా పట్టణ కేంద్రాల వేగవంతమైన విస్తరణ ఈ వృద్ధికి ప్రధాన కారణాలు అన్నారు. క్వాంటం వ్యాలీలు, ఇన్నోవేషన్ హబ్‌లు, ఐటీ రంగం, డేటా సెంటర్లు, గ్రీన్ ఎనర్జీ కారిడార్లు, ఆటోమొబైల్ పరిశ్రమలు, ఎక్స్‌ప్రెస్‌వేలు, మెట్రో ప్రాజెక్టులు, గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయాలు, పారిశ్రామిక కారిడార్లు, వేర్‌హౌస్‌లు, లాజిస్టిక్స్, షిప్పింగ్, ఇంటిగ్రేటెడ్ టౌన్‌షిప్‌లలో వ్యూహాత్మక పెట్టుబడులతో ఆంధ్రప్రదేశ్ తన పట్టణాభివృద్ధి ప్రయాణాన్ని, భవిష్యత్తు ప్రాధాన్యతలను ప్రపంచానికి చాటి చెప్పేందుకు సిద్ధమవుతోందన్నారు. ఈ సదస్సు వివిధ రాష్ట్రాలు తమ అభివృద్ధి, భవిష్యత్తు ప్రణాళికలను పంచుకోవడానికి ఒక వేదికగా నిలవనుందన్నారు. ఆంధ్రప్రదేశ్ ఈ వేదికపై ప్రధానంగా ఈ క్రింది అంశాలను ప్రదర్శించనుందని పేర్కొన్నారు. పట్టణ మౌలిక సదుపాయాల బలోపేతం, గృహాల లభ్యతను పెంచడమన్నారు. అమరావతి, విశాఖపట్నం, విజయవాడ, గుంటూరు, తిరుపతి, కర్నూలు వంటి నగరాలతో పాటు ఎదుగుతున్న ఇతర పట్టణ కేంద్రాల ప్రణాళికాబద్ధమైన వృద్ధి కూడా అన్నారు. మెట్రో రైలు విస్తరణ, పారిశ్రామిక కారిడార్లు, లాజిస్టిక్ హబ్‌లు, స్మార్ట్ సిటీ ప్రాజెక్టులు, ఇంటిగ్రేటెడ్ టౌన్‌షిప్‌లపై ప్రత్యేక దృష్టి ఉందన్నారు. సులభతర వాణిజ్యం, నియంత్రణ సంస్కరణలు, సాంకేతికతతో కూడిన పాలన ద్వారా రియల్ ఎస్టేట్, మౌలిక సదుపాయాల రంగాలలో పెట్టుబడులను ఆకర్షించడంలో రాష్ట్రం సాధించిన విజయాన్ని దేశవ్యాప్త పరిశ్రమల భాగస్వాముల ముందు ప్రదర్శించనున్నారని తెలిపారు. దేశ రియల్ ఎస్టేట్ రంగం ప్రస్తుతం ఒక కీలక దశలోకి ప్రవేశిస్తోందన్నారు. స్థిరమైన ఆర్థిక వృద్ధి, వేగవంతమైన పట్టణీకరణ, ప్రభుత్వ అనుకూల విధానాలు దీనికి వెన్నుదన్నుగా నిలుస్తున్నాయని తెలిపారు. 2047 నాటికి దేశంలో పట్టణీకరణ 50 శాతానికి చేరుకుంటుందని అంచనా వేస్తున్న నేపథ్యంలో సమర్థవంతమైన, పారదర్శకమైన, సాంకేతికతతో కూడిన పట్టణాభివృద్ధి వ్యవస్థల ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. పట్టణాలలో జీవన ప్రమాణాలను మెరుగుపరచడానికి, పెట్టుబడిదారుల నమ్మకాన్ని బలోపేతం చేయడానికి, దీర్ఘకాలిక వృద్ధికి అవసరమైన కార్యాచరణను రూపొందించడమే ఈ సదస్సు లక్ష్యమన్నారు. మెట్రో రైలు, పారిశ్రామిక కారిడార్లు, విమానాశ్రయాలు, హైవే కనెక్టివిటీలో నిరంతర పెట్టుబడుల కారణంగా ఆంధ్రప్రదేశ్‌లో పట్టణ రూపురేఖలు మారిపోతున్నాయని తెలిపారు. ఇది విశాఖపట్నం, విజయవాడ, అమరావతి, తిరుపతి వంటి నగరాల్లో రియల్ ఎస్టేట్ కార్యకలాపాలను వేగవంతం చేస్తోందన్నారు. మెరుగైన విధానాలు, మౌలిక సదుపాయాల ఆధారిత వృద్ధి ఫలితంగా నివాస, వాణిజ్య, పారిశ్రామిక రంగాలలో కొత్త అవకాశాలు లభిస్తున్నాయని తెలిపారు. ఈ సదస్సు ద్వారా ఆంధ్రప్రదేశ్ సాధించిన పట్టణాభివృద్ధి అనుభవాలను పంచుకోవడానికి, సమగ్ర వృద్ధిపై జరిగే చర్చల్లో భాగస్వాములు కావడానికి నరెడ్కో ఆంధ్రప్రదేశ్ ఆసక్తిగా ఉందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా నరెడ్కో చైర్మన్ డాక్టర్ నిరంజన్ హిరానందని మాట్లాడుతూ భారతదేశ వృద్ధి పథంలో అత్యంత కీలకమైన సమయంలో ఈ 'జాతీయ పట్టణ మరియు రియల్ ఎస్టేట్ అభివృద్ధి సదస్సు 2026' జరుగుతోందని తెలిపారు. రియల్ ఎస్టేట్ అనేది కేవలం ఒక ప్రత్యేక రంగం మాత్రమే కాదని, ఇది ఆర్థిక విస్తరణకు, ఉపాధి కల్పనకు, పట్టణ పరివర్తనకు ప్రధాన చోదక శక్తిగా మారిందని పేర్కొన్నారు. రవాణా ఆధారిత అభివృద్ధి, నియంత్రణ సంస్కరణలు, సంస్థాగత పెట్టుబడులు, డిజిటల్ గవర్నెన్స్‌పై ఈ సదస్సులో జరిగే లోతైన చర్చలు భవిష్యత్తు అవసరాలకు సిద్ధంగా ఉండే రియల్ ఎస్టేట్ వ్యవస్థకు బాటలు వేస్తాయన్నారు. పెరుగుతున్న పట్టణ జనాభా నేపథ్యంలో 'వికసిత్ భారత్ 2047' దార్శనికతకు అనుగుణంగా, విభిన్న వాటాదారులను, వినూత్న ఆలోచనలను ఒకచోట చేర్చి ప్రపంచ స్థాయిలో పోటీ పడగల స్థిరమైన పట్టణ వ్యవస్థను నిర్మించడానికి ఈ సదస్సు ఒక కీలక వేదికగా ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ సందర్భంగా నరెడ్కో అధ్యక్షుడు ప్రవీణ్ జైన్ మాట్లాడుతూ నిర్మాణాత్మకమైన చర్చలు, ఆచరణాత్మక సంస్కరణల ద్వారా మాత్రమే స్థిరమైన పట్టణాభివృద్ధి సాధ్యమవుతుందని తెలిపారు. ఈ సదస్సు ప్రధానంగా నియంత్రణల సమన్వయం, పెట్టుబడిదారుల విశ్వాసాన్ని పెంపొందించడం, సాంకేతికతను అందిపుచ్చుకోవడం వంటి అంశాలపై దృష్టి సారిస్తుందని పేర్కొన్నారు. ఈ రంగం తదుపరి దశ వృద్ధికి ఇవి అత్యంత అవసరం అన్నారు.

# రైజ్ నైపుణ్యంతో ఆర్థిక స్వావలంబన

- మహిళల ఉపాధిని విస్తృతం చేసే కార్యక్రమాలు
- వన్ ఫ్యామిలీ -- వన్ ఆంత్రప్రెన్యూర్ దిశగా అడుగులు
- కొనసాగుతున్న సోలార్ టెక్నీషియన్ శిక్షణ



గుంటుపల్లి, ఫిబ్రవరి 11 మహిళల ఆర్థిక స్వావలంబన సాధనలో భాగంగాఇబ్రహీంపట్నం మండలం, గుంటుపల్లి రైజ్ కేంద్రంద్వారా అందిస్తున్న నైపుణ్య శిక్షణ కార్యక్రమంవిజయవంతంగా కొనసాగుతోంది. ఈ కార్యక్రమంద్వారా మహిళలకు ఆధునిక నైపుణ్యాలు, వ్యాపారనిర్వహణ పాఠాలు, డిజిటల్ పరిజ్ఞానం అందిస్తూస్వయం ఉపాధి అవకాశాలను విస్తరించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. మహిళల ఉపాధిని విస్తృతం చేసే సమగ్ర కార్యక్రమాల ద్వారా గ్రామీణ ప్రాంతాల మహిళలకు ప్రత్యేక శిక్షణలు, ఆర్థిక సహాయం, మార్కెటింగ్ మార్గదర్శకత అందిస్తున్నారు. స్వయం సహాయక సంఘాల ద్వారా మహిళల్లో వ్యాపార నైపుణ్యాల పెంపు, చిన్న మరియు సూక్ష్మ వ్యాపారాల స్థాపనకు ప్రోత్సాహం కల్పిస్తున్నారు."వన్ ఫ్యామిలీ -- వన్ ఆంత్రప్రెన్యూర్" లక్ష్యంతో ప్రతి కుటుంబంలో కనీసం ఒకరిని వ్యాపారవేత్తగా తీర్చిదిద్దే దిశగా ఈ కార్యక్రమం ముందుకు సాగుతోంది. దీనివల్ల కుటుంబ ఆర్థిక స్థితి మెరుగుపడటమే కాకుండా, సమాజంలో మహిళల సాధికారతకు దోహదపడుతుంది. రైజ్ కేంద్రం ద్వారా నిరంతర శిక్షణ కార్యక్రమాల్లో భాగంగా బుధవారం సోలార్ టెక్నీషియన్ ట్రైనింగ్ ఇవ్వడం జరిగింది. ఈ రంగం ప్రస్తుతం వడివడిగా ముందుకెళ్తున్న నేపథ్యంలో స్వయం ఉపాధి అవకాశాలు విస్తృతం కానున్నాయి.

## రోడ్డు ప్రమాదాల నివారణకు

# ఉదయం నుంచే విస్తృత వాహనాల తనిఖీలు

- ఇబ్రహీంపట్నం ట్రాఫిక్ పోలీసుల ప్రత్యేక డ్రైవ్

ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 11






రోడ్డు ప్రమాదాలకు అడ్డుకట్ట వేయడం, ప్రమాదాల వల్ల జరుగుతున్న ప్రాణనష్టాన్ని తగ్గించడం లక్ష్యంగా ఇబ్రహీంపట్నం ట్రాఫిక్ పోలీసులు ఉదయం 6 గంటల నుంచే ప్రత్యేక వాహనాల తనిఖీలు నిర్వహించారు.ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ ఎస్వీ రాజశేఖర్ బాబు ఐపీఎస్ ఆదేశాల మేరకు, ట్రాఫిక్ డీసీపీ షరీనా బేగం ఐపీఎస్ పర్యవేక్షణలో ఈ డ్రైవ్ చేపట్టారు. ప్రధాన రహదారులు, కూడళ్లు, జనసంచారం అధికంగా ఉండే ప్రాంతాల్లో వాహనాలను తనిఖీ చేసి ట్రాఫిక్ నిబంధనల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ వినియోగం ప్రాణరక్షణకు ఎంత ముఖ్యమో వివరించారు. హెల్మెట్ ధరించడం వల్ల తలకు తీవ్ర గాయాల నుంచి రక్షణ లభిస్తుందని తెలియజేశారు. హెల్మెట్ లేకుండా వాహనం నడిపితే జరిగే ప్రమాదాలు, చట్టపరమైన పరిణామాల గురించి స్పష్టంగా వివరిస్తూ, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై మోటారు వాహన చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజల ప్రాణాల రక్షణే ప్రధాన లక్ష్యంగా ఇటువంటి తనిఖీలు, అవగాహన కార్యక్రమాలు భవిష్యత్తులో కూడా నిరంతరం కొనసాగుతాయని జిల్లా పోలీసులు తెలిపారు. ప్రతి వాహనదారుడు ట్రాఫిక్ నియమాలను కచ్చితంగా పాటించి, హెల్మెట్ ధరించడం అలవాటుగా మార్చుకోవాలని విజ్ఞప్తి చేశారు.

# ఘనంగా పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ వర్ధంతి వేడుకలు

- నివాళులర్పించిన బిజెపి శ్రేణులు

గన్నవరం, ఫిబ్రవరి 11



భారతీయ జనసంఘ్ వ్యవస్థాపకులు, 'ఏకాత్మ మానవతావాద' సిద్ధాంతకర్త 'అంత్యోదయ' కార్యక్రమ ప్రదాత స్వర్గీయ పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ వర్ధంతిని పురస్కరించుకుని, గన్నవరం మండల భారతీయ జనతా పార్టీ కార్యాలయంలో ఆయనకు ఘనంగా నివాళులు అర్పించారు. మండల అధ్యక్షులు నీలం అశోక్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు చిగురుపాటి కుమార్ స్వామి మాట్లాడుతూ, సమాజంలో చిట్టచివరి వ్యక్తికి కూడా ఫలాలు అందాలనే 'అంత్యోదయ' సంకల్పం దీన్ దయాళ్ దూరదృష్టికి నిదర్శనమని కొనియాడారు. బిజెపి మూల సిద్ధాంతాల నిర్మాణంలో ఆయన పాత్ర అజరామరమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కిసాన్ మోర్చా స్టేట్ ఎగ్జిక్యూటివ్ సభ్యులు నాదెండ్ల మోహన్ , మహిళా మోర్చా స్టేట్ సెక్రటరీ కానూరు శేషు మాధవి , కురుమద్దాల ఫణి కుమార్ , స్టేట్ విద్యుత్ సెల్ మల్లికార్జున రాజు , గన్నవరం మండలం వైస్ ప్రెసిడెంట్ అనిల్ కుమార్ , నీటి సంఘం అధ్యక్షులు వెంకటేశ్వర రెడ్డి , గన్నవరం జనరల్ సెక్రటరీ వెంకటకృష్ణ , మండలం జనతా వారిది కో-కన్వీనర్ వెంకట బాలాజీ , యువ మోర్చా నాయకులు పాము సిద్దు , గన్నవరం మాజీ అధ్యక్షులు చంద్రశేఖర్ రెడ్డి , మండల ట్రెజరర్ అప్పల ఆనంద్ , సీనియర్ నాయకులు కోటేశ్వరరావు , ఉంగుటూరు మాజీ అధ్యక్షులు రామకోటి , చంటిబాబు తదితర సీనియర్ నాయకులు, కార్యకర్తలు ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.

## మహా శివరాత్రి తిరుణాలకి

# ముస్తాబైన వెల్వడం బాల కోటేశ్వర స్వామి దేవాలయం







11 (మహాశివరాత్రి పర్వదినం పురస్కరించుకొని మండలంలోని వెల్వడం గ్రామంలో ఉన్న బాల కోటేశ్వర స్వామి దేవాలయం నూతన శోబగులుదిద్దుకుంది. ఈ నెల 15 వ తేది ఆదివారం నుండి మూడురోజులపాటు జరిగే తిరుణాలకు అన్ని ఏర్పాట్లు చేశారు. ఆలయానికి ఎంతో ఘనమైన వైభవం ఉంది. సుమారు 200 సంవత్సరాల క్రితం నాటి గ్రామ పెద్ద యరమల కొండారెడ్డి, జ్వాలాంబిక ల కుమారుడు యరమల కృష్ణారెడ్డికి శ్రీ బాల కోటేశ్వర స్వామి కలలో దర్శనమిచ్చి గ్రామ శివారు చెరువు లోని కొండమీద తన ఆలయాన్ని నిర్మించాల్సిందిగా వాక్కు ఇవ్వడంతో 1.5 ఎకరాల విస్తీర్ణంలో ఈ ఆలయ నిర్మాణం జరిగిందని గ్రామ పెద్దలు చెబుతున్నారు. ఆనాటి నుండి నేటి వరకు కృష్ణారెడ్డి వంశీకులు ఇక్కడ తిరు నాళ్ళనిర్వహించడం ఆనవాయితీగా మారింది. వారిని అయ్యవార్లు అని పిలుచుకొంటారు. ఈ గుడి పూజా కార్యక్రమాల కోసం కొంత పొలం కూడా ఉంది. కోటప్ప కొండ తిరునాళ్ల ఎంత ప్రసిద్ధి కలదో వెల్వడం తిరునాళ్లకుకూడా అంత పేరు కలదు అంటే అందులో అతిశేయోక్తి లేశమాత్రం కూడా లేదు. తిరువూరు, గంపలగూడెం, రెడ్డిగూడెం, విస్సన్నపేట, తెలంగాణ రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాల నుంచి కోరిన కోర్కెలు తీరిన వాళ్ళు బళ్ళు, ప్రభలు కట్టుకొని వెల్వడం తిరునాళ్లకు వచ్చి ముడుపులు చెల్లించుకునే వారిని చరిత్ర చెబుతుంది. ఆలయం సమీపంలో దివంగత లక్కిరెడ్డి పాపులమ్మ, లక్ష్మి రెడ్డి కోనేరు తవ్వించారు. ఈ కోనేటిలోనే చనిపోయిన వారి జ్ఞాపకార్థం పూల తెప్పలు, మైల తెప్పలు వదిలి కోనేటి స్నానం ఆచరించి దైవదర్శనం చేసుకొంటారు. స్నానం అనంతరం దుస్తులు మార్చుకోవడానికి తలపరెడ్డి వెంకటేశ్వర రెడ్డి ఒక షెడ్ నిర్మించారు. ప్రస్తుతం కోనేరు బాగోగులు లకిరెడ్డి బాలి రెడ్డి సోదరుల పర్యవేక్షణలోనే జరుగుతున్నాయి. కోనేటికి చేరువలో చిన్న వినాయకుని గుడిని 2008 లో జయప్రకాశ్ రెడ్డి గారు నిర్మించారు. మహా శివరాత్రి పర్వదినాన్ని బాల కోటేశ్వర స్వామి తిరునాళ్లగా లకిరెడ్డి బాలి రెడ్డి సోదరుల ఆధ్వర్యంలో ఎంతో వేడుకగా జరుపుతుంటారు. ఆలయానికి రంగులు వేయించి విద్యుత్ దీపాలంకరణ చేశారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా రోడ్లు, విద్యుత్, తాగునీటి సౌకర్యం కల్పిస్తున్నారు. కోనేటి వద్ద మహిళలు స్నానాలు ఆచరించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. స్థానిక లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజనీరింగ్ కళాశాల ఎన్.ఎస్.ఎస్ యూనిట్ మరియు ఎన్. సి. సి క్యాడెట్స్, వాలంటీర్లు భక్తులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా అడుగడుగునా పోలీస్ డిపార్ట్మెంట్ వారికి తోడుగా నిలుస్తారని అలాగే రెవెన్యూ డిపార్ట్మెంట్, హెల్త్ డిపార్ట్మెంట్ వాళ్ళు కూడా వారి సేవలు అందజేస్తారని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ మైలవరం సబ్ బ్రాంచ్ సెక్రటరీ ఌ ట్రెజరర్, బాల కోటేశ్వర స్వామి యువజన సంఘం నాయకుడు గూడూరు నాగి రెడ్డి తెలియజేసారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తుల కోసం లకిరెడ్డి జయప్రకాశ్ రెడ్డి 15-02-2026 రోజు అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నారు. 2002లో లకిరెడ్డి బాలి రెడ్డి సోదరులు జయప్రకాశ్ రెడ్డి అన్నపూర్ణమ్మ దంపతుల సౌజన్యంతో 40 లక్షలతో ఆలయాన్ని సువిశాలంగా సుందరంగా తీర్చిదిద్దారు. జయప్రకాశ్ రెడ్డి స్వామి వారి కళ్యాణం నిర్వహించే మండపం జీర్ణోద్ధరణ కావడంతో నూతన కల్యాణ మండపాన్ని నిర్మించి ఇచ్చారు. దుంపా వెంకటేశ్వర రెడ్డి కల్యాణ మూర్తుల ఊరేగింపు కోసం రథం తయారుచేయించి ఇచ్చారు. అలాగే రథాన్ని ఉంచడానికి మండపం కుడా నిర్మించి ఇచ్చారు. గ్రామానికి చెందిన దివంగత తలపరెడ్డి నారాయణరెడ్డి జ్ఞాపకార్థం సతీమణి భారతమ్మ ఈ ఆలయంలో నవగ్రహా మూర్తుల విగ్రహాలను ఏర్పాటు చేశారు. దివంగత శీలం శివారెడ్డి స్మారక విశ్రాంత మందిరాన్ని ఆయన కుమారుడు వెంకట రవీందర్ రెడ్డి నిర్మించారు. యరమల సత్య నారాయణ రెడ్డి, శంకర్ రెడ్డి సోదరులు సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణకు కళా మండపాన్ని 2005 లో నిర్మించారు. వారే అఖండహారతి మండపాన్ని 2024లో నిర్మించారు. లకిరెడ్డి చిన్న పుల్లా రెడ్డి వినాయక గుడిని, వెల్లంకి శ్రీను నాగమయ్య గుడిని నిర్మించారు. కుడుముల కోటి రెడ్డి, బయ్యన శ్రీనివాస రావు ఆధ్వర్యంలో తారు రోడ్లు 2024లో నిర్మించారు. తిరుణాలకు వెళ్లే భక్తులకు ఇబ్బంది కలగకుండా తారు రోడ్ ను వెడల్పు చేసారు. డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి కోటి రూపాయల వితరణతో ఎప్పటినుండో మట్టి రోడ్ గా ఉన్న తోలుకోడు బైపాస్ వరవకట్ట బజారు రోడ్ ను సిమెంట్ రోడ్ గా వేయడం జరిగింది. కీర్తిశేషులు లకిరెడ్డి విశ్వనాథ రెడ్డి మనుమడు లకిరెడ్డి విస్సు జ్ఞాపకార్థం వారి తల్లీదండ్రులైన లకిరెడ్డి పుల్లారెడ్డి, నాగేంద్రమ్మ శ్రీ బాలకోటేశ్వరస్వామి మండపం నిర్మించారు. వారి ఆధ్వర్యంలోనే పడమటి చెరువుకట్ట ను పటిష్ట పరిచి తారు రోడ్ నిర్మించారు. ఇంకా చాలా మంది ప్రవాసాంధ్రులు తిరునాళ్ల కు విచ్చేసే భక్తులకు అనేక సౌకర్యాలు కల్పించారు. పలువురు దాతలు పులిహోర, చెక్కర పొంగలి, మంచినీరు, మజ్జిగ పంపిణీ చేయడానికి పూను కొంటున్నారు. వెల్వడం గ్రామానికి చెందినవారు అత్యధికంగా ప్రవాసాంధ్రులుకావడంతో ప్రతి ఏడాది అమెరికాలో ఉన్నటువంటి సుమారు 50మంది వరకు వెల్వడం గ్రామానికి చేరుకొని పండు గను అత్యంత వైభవంగాజరుపుతారు. మైలవరం పరిసర ప్రాంతాల నుంచి కూడా భక్తులు ప్రభలు కట్టుకొని శివరాత్రికి స్వామి వారి దేవాలయం చుట్టూ ప్రదక్షిణాలు చేసి మొక్కులు తీర్చుకుంటారు. పిల్లలు కలగని దంపతులు అంగప్రదిక్షిణలు చేస్తారు. అలాగే పాడి పశువులను కూడా గుడి చుట్టూ ప్రదక్షిణ చేయిస్తారు. మొదటి పంటను గుడి గంటలకు కడతారు. ఇక్కడ మొక్కుకొని ఎందరో అమెరికా వెళ్లి గొప్పవారు అయ్యారు. మొక్కుబడుల్లో భాగంగా పెళ్లిళు ,, అన్నప్రాసనలు నిర్వహించుకొంటారు. అంగరంగ వైభవంగా కార్తీక మాసంలో కార్తీక దీపోత్సవం నిర్వహిస్తారు. స్వామివారికి నిత్యం దూప దీప నైవేద్యాలు జరుపుతారు. శివరాత్రికి వెల్వడం గ్రామానికి ఒక ప్రత్యేకత ఉంది. గ్రామమంలోని తిరుణాలకు వెళ్లే ఉత్తరపు బజారులోని అన్ని ఇళ్లను శుభ్రపరచుకొని సున్నాలు, రంగులు వేయించి విద్యుత్ అలంకరణగావించి సిద్ధం అవుతారు. కుటుంబసభ్యులందరు నూతన దుస్తులు ధరిస్తారు. బంధువులందరూ విచ్చేసి బాలకోటేశ్వర స్వామి తిరుణాలను కనులపండుగగా జరుపుకొంటారు.

**మూడు రోజులు ఉత్సవాలు...**

బాల కోటేశ్వర స్వామి ఆలయంలో శివరాత్రి తిరునాళ్లు 15-02-2026 ఆది వారం నుంచి మూడు రోజులపాటు దేవుని చెరువులోని మైదాన ప్రాంతంలో జరగనున్నాయి. మొదటి రోజు ఉత్సవ విగ్రహాలను గ్రామంనుండి ఊరేగింపుగా బాలకోటేశ్వర స్వామి గుడికి చేర్చడంతో ప్రారంభమవుతాయి. ఉదయం 04 గంటలకే మూల విరాట్ కు అభిషేకాలు అంగరంగ వైభవంగా జరుగుతాయి. పెద్ద కోనేటి లో స్నానాలు చేసి పితృ తర్పణాలు వదులుతారు. 15వ తేదీ రాత్రి ఒంగోలు జాతి ఎడ్లబండితో ప్రబల ఊరేగింపు చూసి తీరాల్సిందేగాని చెప్పనలవికాదు. బాలకోటేశ్వరస్వామి యువజన సంఘం ఆధ్వర్యంలో మొదటి ప్రభ బండి రంగు రంగుల విద్యుత్ దీపాలంకరణ తో ఊరేగింపు జరుగుతుంది. ఇందులో డప్పులు, కనకతప్పెటలు, సన్నాయి బ్యాండ్ మేళం, కోలాటం, కాళికా నృత్యం, ఇంకా అనేక రకాల కళారూపాలతో కార్యక్రమాలతో ప్రభోత్సవం అత్యంత వైభవంగా జరుగుతుంది. ప్రవాసాంధ్రులు తుళ్లూరి శ్రీనివాసాచారి ఌ ఫ్రెండ్స్ ఆధ్వర్యంలో సొసైటీ సెంటర్ నుండి రెండవ ప్రభ కూడా భారీ ఊరేగింపు తో తిరుణాలకు తరలివెళు తుంది. ఇందులో కూడా పాలకొల్లు బ్యాండ్ మేళం, తీన్మార్, రుంజా మేళా, భద్రాచలం వారి కోయ డాన్స్, కళ్ళు మిరుమిట్లుగొలిపే బాణాసంచా వెలుగులు, చెక్క భజనలు, బుట్ట బొమ్మలు, తెలంగాణ బోనాల డాన్స్, కోబ్రా డాన్స్, ఏలూరు వారి డాన్స్ మ్యూజికల్ నైట్ తో అత్యంత ఘనంగా గ్రామ ఊరేగింపు జరగబోతుందని తుళ్లూరి శ్రీనివాసాచారి ఌ ఫ్రెండ్స్ తెలియజేసారు. 16 వ తేదీన స్వామి వారి కళ్యాణం మరియు రథం ఊరేగింపు, అఖండ హారతి, కూచిపూడి, భరతనాట్యం, పౌరాణిక నాటకాలు మొదలైన సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. తిరునాళ్ల మూడు రోజులు గుడి పరిసరాలలో వ్యాపారస్తులు అనేకరకాలైన దుకాణాలు పెట్టుకొంటారు. చెఱుకుగెడలు, మిఠాయిలు, ఖర్జురా పండ్లు విరివిగా అమ్ముడవుతాయి. పిల్లలకు, పెద్దలకు అనేకరకాలైన వినోద కార్యక్రమాలు ఉంటాయి. ఈ తిరునాళ్ల వేసవి ప్రారంభంలో వస్తుంది కావునా నీటిని చల్లగా ఉంచే తాబేటి కాయలు (బుర్రకాయలు) కొనుకొంటారు. 17-02-2025 ముందుగా గ్రామ ప్రభలను, చివరగా ఉత్సవ విగ్రహాలను గ్రామోత్సవం నిర్వహించి అయ్యవార్ల మండపంలోకి చేరుస్తారు. గ్రామోత్సవంలో అయ్యవార్ల ఆధ్వర్యంలో నార్జములు అని చిన్న చిన్న శూలములతో శరీరంలో పొడుచుకొని శివుణ్ణి ఆరాధించడం విభూధిపండు తో ఎటువంటి గాయాలుకాకుండా చేయడం ఈ గ్రామ తిరునాళ్ల ప్రత్యేకత. ఇంతటితో మూడు రోజుల తిరునాళ్ల ముగుస్తుంది. వెల్వడం గ్రామంలో ఈనాటి కాలంలో అంతా గ్రానైట్ తో నిర్మించిన ఆధునిక శివాలయం గా పేరొందిన శ్రీ విజయలక్ష్మీ వెంకట పరమేశ్వరాలయం నందు కూడా మహాశివరాత్రి వేడుకలు ఘనంగా నిర్వహిస్తామని ఇప్పటికే భక్తులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా అన్ని సౌకర్యములు ఏర్పాటు చేశామని లకిరెడ్డి బాలిరెడ్డి సోదరులు శ్రీ లకిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. ఈ తిరుణాలకు మూడు రోజులలో వివిధ ప్రాంతాల నుండి సుమారు 5 లక్షల మందికి పైగానే భక్తులు వస్తుంటారు అని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ మైలవరం సబ్ బ్రాంచ్ సెక్రటరీ ఌ ట్రెజరర్, బాల కోటేశ్వర స్వామి యువజన సంఘం నాయకుడు గూడూరు నాగి రెడ్డి తెలియజేసారు.

# ఉద్యోగుల సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ప్రాధాన్యత

- విద్యుత్ ఉద్యోగుల పని ఒత్తిడి తగ్గించేందుకు నూతన నియామకాలు
- గత ప్రభుత్వం విధ్వంసం చేసిన వ్యవస్థని గాడిలో పెడుతున్నాం
- బీసీ ఉద్యోగుల సంఘం డైరీఆ విష్కరణలో మంత్రి గొట్టిపాటి




**అమరావతి, ఫిబ్రవరి**

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలోని కూటమి ప్రభుత్వం ఉద్యోగుల సమస్యలను ప్రథమ ప్రాధాన్యతతో పరిష్కరిస్తుందని ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ స్పష్టం చేశారు. ఆంధ్రప్రదేశ్ విద్యుత్ బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం డైరీ, క్యాలెండర్ ను ఎమ్మెల్యే, పీయుసీ ఛైర్మన్ కూన రవికు మార్ తో కలిపి మంత్రి గొట్టిపాటి సచివాల యంలో బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి గొట్టిపాటి మాట్లాడుతూ., ప్రజల్లో సంతృప్త స్థాయిలు పెరిగేలా విద్యుత్ ఉద్యోగులు విధులు నిర్వహించాలని సూచించారు. అదే విధంగా విద్యుత్ ఉద్యోగులపై ఉన్న పని ఒత్తిడిని తగ్గించేందుకు సీఎం చంద్రబాబు అనుమతితో త్వరలోనే నూతన నియామకాలు చేపడుతున్నట్లు ఆయన వెల్లడించారు. మెడికల్ ఇన్సూరెన్స్ లిమిట్ కు సంబంధించి ఏవైనా సమస్యలు ఉంటే పరిష్కారం దిశగా చర్యలు చేపడతామని మంత్రి హామీ ఇచ్చారు. అదే విధంగా విద్యుత్ ఉద్యోగులు ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చిన డిమాండ్లలో 90 శాతంపైగా పరిష్కరించామని గుర్తు చేశారు. గత వైసీపీ ప్రభుత్వం ధ్వంసం చేసిన విద్యుత్ వ్యవస్థను గాడిలో పెడుతున్నామని ఆయన పేర్కొన్నారు. ట్రూ అప్ ఛార్జీలను ట్రూ డౌన్ చేసిన రాష్ట్రం కూడా దేశంలో ఆంధ్రప్రదేశ్ ఒక్కటే అన్నారు. ప్రైవేటు సంస్థల నుంచి అధిక ధరలకు విద్యుత్ కొనుగోళ్లను తగ్గించడమే కాకు ండా రాష్ట్రంలో ఉన్న వనరులను వినియోగించుకుని రికార్డు స్థాయి విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నామన్నారు. ఏదేమైనా విద్యుత్ ఉద్యోగులకు అన్ని విషయాల్లోనూ సహాయ, సహకారాలు అందిస్తామని మంత్రి గొట్టిపాటి భరోసా ఇచ్చారు. పీయూసీ ఛైర్మన్, ఎమ్మెల్యే కూన రవికుమార్ మాట్లాడుతూ., ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రవేశ పెట్టిన విద్యుత్ సంస్కరణలను నేడు దేశంలో అనేక రాష్ట్రాలు అమలు చేస్తున్నాయన్నారు. టీడీపీ అంటేనే బీసీలు అని.., బీసీలు అంటేనే టీడీపీ అని ఆయన పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ విద్యుత్ బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం అధ్యక్షులు పోలాకీ శ్రీనివాసరావు మాట్లాడుతూ., ప్రభుత్వం ప్రవేశ పెట్టిన అనేక సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో ఉద్యోగులు కీలక పాత్ర పోషిస్తున్నారన్నారు. పీఆర్సీ, డీఏ, ఇంక్రిమెంట్లతో పాటు విద్యుత్ శాఖలో కారుణ్య నియామకాల విషయంలో ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జనరల్ సెక్రటరీ కే.అప్పారావు, ఫైనాన్స్ సెక్రటరీ ఎస్.వెంకటరావు, అసోసియేట్ ప్రెసిడెంట్ జీ.రాము, బీసీ సంఘం నేత కేశన శంకర్రావుతో పాటు వివిధ జిల్లాల నుంచి పలువురు ఉద్యోగ సంఘ నేతలు, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

## సంపాదకీయం



# న్యాయం గెలిచింది

**అక్రమంగా, అన్యాయంగా పి.డి.యాక్టు బనాయించి అనకాపల్లి జిల్లా రైతుసంఘం కార్యదర్శి, సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం.అప్పలరాజును కూటమి ప్రభుత్వం 43 రోజుల పాటు విశాఖ సెంట్రల్ జైల్లో పి.డి చట్టం కింద నిర్బంధించింది. గంజాయి, డ్రగ్స్ మాఫియా, భూ ఆక్రమణదారులు, అక్రమ మద్యం వ్యాపారులు, మహిళలను ఇతర దేశాలకు అమ్మేవాళ్లు, పదే పదే నేరాలకు పాల్పడి శిక్షలు పడ్డవారిపై పెట్టాల్సిన పి.డి చట్టాన్ని ఒక ప్రజా నాయకుడిపై, ఉద్యమ నేతపై పెట్టి కూటమి ప్రభుత్వం అభాసు పాలయ్యింది.**

ఎం.అప్పలరాజుపై పెట్టిన పి.డి యాక్టుకు సరైన ఆధారాలు లేవని...జనవరి 30న విచారించిన ప్రివెంటివ్ డిటెన్షన్ యాక్ట్ అడ్వయిజరీ బోర్డు సభ్యుల అభిప్రాయం, మినిట్స్ ఆధారంగా ఆయనపై పి.డి.యాక్టును వెనక్కు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. అనంతరం రాష్ట్ర ప్రభుత్వం 2026 ఫిబ్రవరి 5న జి.ఓ ఆర్.టి.నెంబర్ 234ను విడుదల చేసి...ఫిబ్రవరి 6వ తేదీన విశాఖ కేంద్ర కారాగారం నుండి నిర్దోషిగా విడుదల చేయాల్సి వచ్చింది. ఆయన అరెస్టు, విడుదల వారి కుటుంబ సభ్యులకు సైతం కనీస సమాచారం లేకుండా జరిగాయి. ఎం.అప్పలరాజు అరెస్టు నుండి విడుదల వరకు జరిగిన ఘటనలలో ప్రభుత్వం తన తప్పిదాలను కప్పిపుచ్చుకోవడానికి ప్రయత్నించినట్లే కనిపించాయి. ఇది రాష్ట్ర ప్రభుత్వ నిర్బంధానికి పరాకాష్ట. ఈయనపై రాష్ట్ర ప్రభుత్వం అన్యాయంగా పెట్టిన పలు కేసుల ఆధారంగా పి.డి యాక్టు పెడుతున్నట్లు ప్రభుత్వ యంత్రాంగం ప్రకటించింది. సిని పక్కీలో ముగ్గురు సిఐ లు, ఎస్ఐ లు, సుమారు 30 మంది పోలీసులు డిసెంబర్ 24 ఉదయం 7 గంటలకు ఎం.అప్పలరాజు ఇంటిని చుట్టుముట్టి మూకుమ్మడిగా అరెస్టుకు పూనుకున్నారు. సాధారణ అరెస్టు అని చెప్పి తీసుకెళ్ళిన పోలీసులు సుమారు 600 పేజీలపై సంతకాలు చేయించుకునే వరకు తనపై పి.డి యాక్టు పెట్టినట్లు ఆయనకు తెలియదు. అనంతరం విశాఖ సెంట్రల్ జైల్‌కు తరలించారు. ఆయన వాట్సాప్ ప్రొఫైల్ ఫోటోను ఆయన పి.డి యాక్టు కేసులకు సంబంధించిన స్పైరల్ పుస్తకంలో మొదటి పేజీలో వేశారు. ఎం.అప్పలరాజుకు ఇచ్చిన స్పైరల్ బుక్‌లో 2013 నుండి నేటి వరకు ఎస్.రాయవరం, నక్కపల్లి మండలాల్లో పెట్టిన పలు కేసుల వివరాలున్నాయి. పి.డి చట్టాన్ని బనాయించడానికి ఏ రకమైన ఆధారాలు లేకపోవడంతో పాత కేసులన్నింటిని పెట్టి జైల్లో నిర్బంధించాలని రాష్ట్ర ప్రభుత్వం కుట్ర పూరితంగా వ్యవహరించింది. అనకాపల్లి జిల్లాలో పారిశ్రామిక అభివృద్ధి పేరుతో నక్కపల్లిలో 5500 ఎకరాల భూమిని రాష్ట్ర ప్రభుత్వం ఎపిఐఐసి ద్వారా భూ సేకరణ చేస్తున్నది. భూములు కోల్పోయిన రైతులకు నష్టపరిహారం ఇవ్వడంలో తీవ్ర నిర్లక్ష్య ధోరణి ప్రదర్శిస్తున్నది. దశాబ్దాలుగా అదే భూములపై ఆధారపడిన రైతులు, కూలీలు, వృత్తిదారులు వంటి వారిని కనీసం పట్టించుకోవడం లేదు. ఇటీవల కాలంలో బల్క్ డ్రగ్ పార్కు ఏర్పాటుకు నిర్వహించిన ప్రజాభిప్రాయ సేకరణలో స్థానిక మత్స్యకారులు, ప్రజలు బల్క్ డ్రగ్ పార్కు వద్దంటూ పెద్దఎత్తున వ్యతిరేకించారు. అయినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం మొండిగా వెళ్ళడంతో దాదాపు 75 రోజులు నిరవధికంగా రిలే నిరాహార దీక్షలు నిర్వహించారు. తీవ్ర వ్యతిరేకత నేపథ్యంలో మీ సమస్యను రాష్ట్ర ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తానని పాయకరావుపేట ఎమ్మెల్యే, హోంమంత్రి వంగలపూడి అనిత చెప్పారు. అనకాపల్లి జిల్లా పర్యటన సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి దగ్గరకు బల్క్ డ్రగ్ వ్యతిరేక పోరాట కమిటీ నాయకులను తీసుకు వెళ్ళారు. ఆ సందర్భంగా మీ ప్రాంతంలో బల్క్‌డ్రగ్ పార్కు ఏర్పాటు కాదని నోటి మాట ద్వారా చెప్పారు తప్ప లిఖితపూర్వకంగా నేటికీ ఎటువంటి ఉత్తర్వులు విడుదల చేయలేదు. ఇదే ప్రాంతంలో ప్రైవేటు ఆర్సెలర్ నిప్పన్ మిట్టల్ స్టీల్‌ప్లాంట్ కోసం సేకరించిన భూముల్లో నిర్మాణ పనులు వేగవంతం చేశారు. మిట్టల్ స్టీల్‌ప్లాంట్‌కు కేటాయించిన భూముల్లో ఉన్న రైతులు, కూలీలు, వృత్తిదారులకు 2013 భూసేకరణ చట్ట ప్రకారం నేటికీ పూర్తి స్థాయిలో పరిహారం, ప్యాకేజీ, పునరావాసం కల్పించలేదు. ఈ అన్యాయాన్ని ప్రజల తరపున అప్పలరాజు ప్రశ్నించారు. దీన్ని సహించలేని ప్రభుత్వం ఆయనను 60 రోజుల పాటు గృహ నిర్బంధం చేయడమే కాకుండా అక్రమంగా పి.డి యాక్టు బనాయించింది. కంపెనీలకు కావాల్సిన భూములు ఇవ్వకపోతే మీపై కూడా అక్రమంగా కేసులు పెడతామని ప్రజలను బెదిరించే చర్యలకు పూనుకున్నారు. జైల్లో నిర్బంధించిన తరువాత ఆయనను ఎలా కలవాలనే కనీసమైన సమాచారం కూడా ప్రభుత్వ యంత్రాంగం ఇవ్వలేదు. పి.డి యాక్టు పెట్టిన వారికి వారానికి ఒకసారి ఇంటర్వ్యూ, నెలకు రెండుసార్లు ములాఖత్ ఇవ్వాలనే జీవో ఎం.ఎస్.నెం.149లో పేర్కొన్న వాటిని అమలు చేయలేదు. ఎం.అప్పలరాజు డిసెంబర్ 24 అరెస్టయి జైలుకు వెళ్ళిన వెంటనే తమ కుటుంబ సభ్యులను కలవాలని పదిమంది పేర్లతో డిసెంబర్ 26న సెంట్రల్ జైల్ అధికారులు దరఖాస్తు చేసుకున్నారు. వారు దానిని డిసెంబర్ 26నే అనకాపల్లి జిల్లా ఎస్‌పి ఆఫీసుకు మెయిల్ ద్వారా పంపారు. పార్టీ జిల్లా నాయకత్వం జనవరి 12న కలిసే వరకు ఆయన పెట్టిన దరఖాస్తును పట్టించుకోలేదు. ఆయన కలవాలని పెట్టుకున్న 10 మందిలో ఏడుగురికి మాత్రమే అనుమతి వుందని జనవరి 23 వరకు ఎవరికీ తెలియదు. చివరికి జనవరి 24వ తేదీన ఎం.అప్పలరాజు కుటుంబ సభ్యులు ఆయనను జైల్లో కలిసేందుకు ఇంటర్వ్యూ లభించింది. దీనికి ప్రధాన కారణం హోంమంత్రి అనిత చెప్పినట్లే పోలీస్ యంత్రాంగం అమలు చేసింది తప్ప చట్టాన్ని కనీసంగా అమలు చేయలేదు. ఇదే కాదు, ఇటీవల కాలంలో నెల్లూరు జిల్లాలో గంజాయి, మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా పోరాడుతున్న సిపిఎం నాయకులు పెంచలయ్యను గంజాయి గూండాలు అతి కిరాతకంగా తమ కన్న పిల్లల ఎదుటే కత్తులతో దాడి చేసి చంపారు. సినీ నటుడు మోహన్‌బాబు యూనివర్సిటీలో అక్రమంగా ఫీజులు వసూళ్లు చేయడాన్ని వ్యతిరేకిస్తున్న ఎస్ఎఫ్ఐ తిరుపతి జిల్లా నాయకులు అక్బర్, వినోద్‌లను మోహన్‌బాబు బౌన్సర్లు వారిపై దాడి చేసి కిడ్నాప్ చేశారు. ఇలాంటి అరాచకాలు జరుగుతున్న ఏ సందర్భంలో కూడా కూటమి అగ్ర నాయకులు స్పందించిన ఘటనలు లేవు. పైగా ఎం.అప్పలరాజుపై పి.డి యాక్టు పెట్టడం సరైనదేనని పలు సందర్భాల్లో కూటమి నాయకులు సమర్థించుకున్నారు. ప్రజా పోరాటాలు చేసేవారిపై నిర్బంధకాండ ప్రయోగిస్తే ప్రజలు క్షమించరని, నిర్బంధాలతో ప్రజాగ్రహాన్ని, ప్రజా ఉద్యమాలను అణచలేరని ఎం.అప్పలరాజుపై అక్రమ పి.డి యాక్టు బనాయించిన విషయంలో మరోసారి తేటతెల్లమయ్యింది.

ఎం.అప్పలరాజుపై పెట్టిన పి.డి యాక్టు చెల్లదని అడ్వైజరీ బోర్డు తేల్చడంతో నేడు రాష్ట్ర కూటమి ప్రభుత్వమే ప్రజల ముందు ముద్దాయిగా నిలబడాల్సిన పరిస్థితి వచ్చింది! జైలు నుండి విడుదలైన తరువాత నిర్వాసితులు అప్పలరాజుకు నీరాజనాలు పలుకుతున్నారు. వందలాది మంది నిరాశ్రయులు ఆయన ఇంటికి వచ్చి ఆవేదన వెళ్లబుచ్చుతున్నారు. ఇప్పటికైనా రాష్ట్ర కూటమి ప్రభుత్వం చట్టాలను గౌరవించి నిర్వాసితులకు 2013 భూసేకరణ చట్టం ప్రకారం న్యాయం చేయాలి. లేని పక్షంలో ప్రజాగ్రహానికి గురికావాల్సి వస్తుంది.



# మార్కెట్లకు ఏఐ సెగ

## ఐటీ షేర్ల పతనం.. ముగిసిన రెండ్రోజుల లాభాల పరంపర!

**రెండు రోజుల వరుస లాభాలకు తెరపడింది. దేశీయ స్టాక్ మార్కెట్లు బుధవారం మోస్తరుగా నష్టపోయాయి. గ్లోబల్ మార్కెట్ల నుంచి నెగటివ్ సంకేతాలు రావడం, ఆంత్రోపిక్ సహా ఏఐ టూల్స్ భయంతో ఐటీ షేర్లు భారీగా పతనమవ్వడం, అమెరికా జాబ్ డేటా పడిపోతుండటం, క్రైసిస్ సూచనలు కనిపిస్తుండటమే ఇందుకు కారణాలు నిఫ్టీలో 25900 శ్రేణిలో బుల్స్,బేర్స్ మధ్య హోరాహోరీ పోరు జరిగింది. ఈ లెవల్ను కాపాడేందుకు బుల్స్ విపరీతంగా శ్రమించాయి.**

క్రితం సెషన్లో 84,273 వద్ద ముగిసిన బీఎస్ఈ సెన్సెక్స్ బుధవారం 84,339 వద్ద మొదలైంది. 84,081 వద్ద ఇంట్రాడే కనిష్ఠాన్ని తాకింది. 84,487 వద్ద ఇంట్రాడే గరిష్ఠాన్ని అందుకుంది. చివరికి 40 పాయింట్ల నష్టంతో 84,233 వద్ద ముగిసింది. 25,997 వద్ద ఓపెనైన ఎన్ఎస్ఈ నిఫ్టీ 25,899 వద్ద కనిష్ఠ, 26,009 వద్ద గరిష్ఠ స్థాయుల్ని అందుకుంది. మొత్తంగా 18 పాయింట్లు తగ్గి 25,953 వద్ద క్లోజైంది. నిఫ్టీ బ్యాంకు 118 పాయింట్లు ఎగిసి 60,745 వద్ద స్థిరపడింది.నిఫ్టీ50లో 28 కంపెనీలు లాభపడగా 22 నష్టపోయాయి. ఐచర్ మోటార్స్, అపోలో హాస్పిటల్స్, ఎస్బీఐ, మ్యాక్స్ హెల్త్, మారుతీ షేర్లు అత్యధికంగా లాభపడ్డాయి. టీసీఎస్, కోల్ ఇండియా, ఇన్ఫీ, హెచ్సీఎల్ టెక్, ఎటర్నల్ షేర్లు నష్టపోయాయి. నేడు హెల్త్ కేర్, ఆటో, పీఎస్యూ బ్యాంకు, ఫార్మా, రియాల్టి, కన్జూమర్ డ్యూరబుల్స్, మీడియా, ఇన్ఫ్రా, చమురు, మెటల్ సూచీలు ఎగిశాయి. ఐటీ, ప్రైవేటు బ్యాంకు, పీఎస్ఈ సూచీలు ఎరుపెక్కాయి. ఎన్ఎస్ఈలో నేడు మార్కెట్ బ్రెడ్త్ సెల్లర్లకు అనుకూలంగా మారింది. మొత్తం 3248 స్టాక్స్ ట్రేడ్ అవ్వగా 1485 లాభపడ్డాయి. 1683 నష్టపోయాయి. 52వారాల గరిష్ఠాన్ని 79 షేర్లు, 52వారాల కనిష్ఠాన్ని 43 తాకాయి. అప్పర్ సర్క్యూటును 86 లోయర్ సర్క్యూటును 45 చేరాయి.డాలరుతో పోలిస్తే రూపాయి కాస్త బలహీనపడి 90.70 వద్ద స్థిరపడింది. హిమత్సింగ్కా సీడే కంపెనీ మూడవ త్రైమాసిక నికర లాభం 65 శాతం తగ్గి 7.6 కోట్ల రూపాయలకు పరిమితమైంది. గత ఏడాది ఇదే సమయంలో ఇది 21.8 కోట్ల రూపాయలుగా ఉండేది. ఎస్కార్ట్స్ షేరుపై హెచ్ఎస్‌బిసి 'హోల్డ్' రేటింగ్‌ను కొనసాగిస్తూ 3,700 రూపాయల లక్ష్య ధరను నిర్ణయించింది. జెట్ ఎయిర్‌వేస్ తన మూడు విమానాల బాడీలను, ఇంజిన్లను విక్రయించడానికి ఒప్పందం కుదుర్చుకుంది. ఐషర్ మోటార్స్ మరియు జూబిలెంట్ ఫుడ్‌వర్క్స్ షేర్ల విషయంలో హెచ్ఎస్‌బిసి 'బై' రేటింగ్‌ను ఇస్తూ, వరుసగా 8,200 రూపాయలు, 700 రూపాయల లక్ష్య ధరలను ఇచ్చింది. ఎస్‌జేవీఎన్ (రాజీఎచీ) నికర లాభం 50.6 శాతం వృద్ధితో 224.4 కోట్ల రూపాయలకు చేరింది. మూడవ రోజు మధ్యాహ్నానికి ఏయే ఫైనాన్స్ ఐపీఓ 0.94 రెట్లు, ఫ్రాక్టల్ అనలిటిక్స్ ఐపీఓ 2.35 రెట్లు సబ్‌స్క్రైబ్ అయ్యాయి. అవంతి ఫీడ్స్ మూడవ త్రైమాసిక నికర లాభం 10.5 శాతం పెరిగి 149.4 కోట్ల రూపాయలుగా నమోదవ్వడమే కాకుండా, ఆ సంస్థ మార్జిన్లు కూడా మెరుగుపడ్డాయి. సూర్య రోష్నీ నికర లాభం 11.4 శాతం తగ్గి 79.7 కోట్ల రూపాయలకు పరిమితమైంది. డోలట్ క్యాపిటల్ సంస్థ లెమన్ ట్రీ హోటల్స్ షేరును 'బై' రేటింగ్‌కు అప్‌గ్రేడ్ చేస్తూ 165 రూపాయల టార్గెట్ ధరను నిర్ణయించింది. జెటెక్ట్ ఇండియా లాభం 25.2 శాతం పెరిగి 20.4 కోట్ల రూపాయలకు, మిసెస్ బెక్టర్స్ ఫుడ్ స్పెషాలిటీస్ నికర లాభం 10 శాతం వృద్ధితో 38 కోట్ల రూపాయలకు చేరుకున్నాయి.

### 1. టీవీఎస్ మోటార్స్

టీవీఎస్ మోటార్స్ ప్రస్తుతం రూ.3,874.00 వద్ద ట్రేడవుతూ, మీరు సూచించిన రూ.3,800 స్థాయిని విజయవంతంగా అధిగమించింది. గత నాలుగు రోజులుగా వరుస లాభాలతో ఈ స్టాక్ తన ఆల్-టైమ్ గరిష్ఠ స్థాయి రూ.3,909 కి చాలా చేరువలో ఉంది. ప్రీమియం ఎలక్ట్రిక్ వాహనాల (EV) విభాగంలో కంపెనీ సాధిస్తున్న వృద్ధి మరియు మెరుగైన ఎగుమతులు ఈ బుల్లిష్ ట్రెండ్‌కు ప్రధాన కారణం. టెక్నికల్‌గా ఇది అన్ని కీలక మూవింగ్ యావరేజ్‌ల పైన బలంగా ఉంది. ఒకవేళ ధర రూ.3,750-రూ.3,800స్థాయికి తగ్గితే, అక్కడ దీర్ఘకాలిక పెట్టుబడి కోసం మరింతగా సేకరించడం మంచి వ్యూహం.

### 2. హిందుస్థాన్ జింక్

హిందుస్థాన్ జింక్ ప్రస్తుతం రూ.629.00 వద్ద ఉంది, ఇది మీ ఎంట్రీ పాయింట్ అయిన రూ.620 కి సమీపంలో ఉండటం వల్ల మంచి కొనుగోలు అవకాశంగా కనిపిస్తోంది. ప్రపంచవ్యాప్తంగా వెండి (Silver) ధరలు పెరుగుతుండటం ఈ కంపెనీకి పెద్ద సానుకూల అంశం, ఎందుకంటే ఇది వెండి ఉత్పత్తిలో కూడా అగ్రస్థానంలో ఉంది. విశ్లేషకులు ఈ స్టాక్‌కు రూ.750--రూ.770లక్ష్యాలను ఇస్తున్నారు. ఇది అధిక డివిడెండ్ ఇచ్చే స్టాక్ కావడంతో దీర్ఘకాలిక ఇన్వెస్టర్లకు అదనపు ఆదాయాన్ని కూడా ఇస్తుంది. మార్కెట్ ఒడిదుడుకుల్లో రూ.600 స్థాయి వద్ద దీనికి బలమైన సపోర్ట్ ఉంది.

### 3. అదానీ గ్రీన్ ఎనర్జీ

అదానీ గ్రీన్ ప్రస్తుతం రూ.972.00 వద్ద కన్సాలిడేషన్ (స్థిరత్వం) దశలో ఉంది. మీరు చెప్పినట్లుగా రూ.990 స్థాయిని దాటితేనే ఇందులో బలమైన బుల్లిష్ ట్రెండ్ ప్రారంభమవు తుంది. ఈ స్థాయి ఒక కీలకమైన అడ్డంకి (Resistance) గా పనిచేస్తోంది. ఒకసారి రూ.990 పైన స్థిరపడితే, స్వల్పకాలంలోనే రూ.1,160 వరకు వెళ్ళే అవకాశం ఉంది. పునరుత్పాదక శక్తి రంగంలో కంపెనీ కొత్త ప్రాజెక్టులను ప్రారంభించడం దీనికి భవిష్యత్తులో బలం చేకూరుస్తుంది. ప్రస్తుతానికి రూ.990 పైన క్లోజింగ్ వచ్చే వరకు వేచి చూసి ఎంట్రీ తీసుకోవడం సురక్షితమైన పద్ధతి.

### 4. టాటా పవర్

టాటా పవర్ ప్రస్తుతం రూ.376.00 వద్ద ట్రేడవుతూ బుల్లిష్ ట్రెండ్ను కొనసాగిస్తోంది. మీరు సూచించిన రూ.370 స్థాయి పైన ఇది బలంగా క్లోజ్ అవ్వడం సానుకూల సంకేతం. 2026 బడ్జెట్‌లో విద్యుత్ సరఫరా మరియు గ్రీన్ ఎనర్జీ కారిడార్లకు ఇచ్చిన భారీ కేటాయింపులు ఈ కంపెనీకి పెద్ద ఊతాన్ని ఇచ్చాయి. టెక్నికల్ చార్టుల్లో ఇది 'రౌండింగ్ బాటమ్' ప్యాటర్న్‌ను పూర్తి చేయడం వల్ల త్వరలోనే రూ.410 స్థాయిని చేరుకునే అవకాశం ఉంది. ఏదైనా చిన్న పతనం వస్తే రూ.350-రూ.360 మధ్య కొనుగోలు చేయడం దీర్ఘకాలిక లాభాలకు అద్భుతమైన అవకాశం.

### 5. ఐసీఐసీఐ లాంబార్డ్

ఐసీఐసీఐ లాంబార్డ్ ప్రస్తుతం రూ.1,930.00 వద్ద స్థిరంగా ఉంది. గతంలో వచ్చిన భారీ పతనం తర్వాత, రూ.1,900 స్థాయి వద్ద ఇది బలమైన సపోర్ట్ తీసుకుని బుల్లిష్ రివర్సల్ సంకేతాలను ఇస్తోంది. ఇన్సూరెన్స్ రంగంలో పెరుగుతున్న డిమాండ్ మరియు కంపెనీ మార్కెట్ వాటా దీనికి అదనపు బలం. మీరు ఈ స్థాయి వద్ద ప్రతి పతనాన్ని కొనుగోలుకు ఉపయోగించుకుని, దీర్ఘకాలిక వ్యూహంతో హోల్డ్ చేయవచ్చు. టెక్నికల్‌గా ఇది మళ్ళీ రూ.2,200స్థాయి వైపు ప్రయాణించే అవకాశం మెండుగా ఉంది. నాన్-లైఫ్ ఇన్సూరెన్స్ విభాగంలో దీని ఆధిపత్యం ఇన్వెస్టర్లకు నమ్మకాన్ని కలిగిస్తోంది.



**మూర్తినాయుడు పాదం**
నిఫ్టీ మాస్టర్, స్టాక్ మార్కెట్ అనలిస్ట్
988 555 9709

## పసికూనపై ఆస్ట్రేలియా ప్రతాపం





టీ20 ప్రపంచకప్ 2026లో మాజీ ఛాంపియన్ ఆస్ట్రేలియా ఘనంగా బోణీ కొట్టింది. కొలంబోలోని ప్రేమదాస స్టేడియంలో ఇవాళ (ఫిబ్రవరి 11) మధ్యాహ్నం జరిగిన మ్యాచ్‌లో పసికూన ఐర్లాండ్‌పై 67 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ చేసిన ఆస్ట్రేలియా నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 182 పరుగులు చేసింది. ఆసీస్ ఇన్నింగ్స్‌లో ఎవరూ పెద్ద స్కోర్లు చేయలేదు. 45 పరుగులు చేసిన మార్కస్ స్టోయినిస్ టాప్? స్కోరర్‌గా నిలిచాడు. జోష్ ఇంగ్లిస్, మ్యాట్ రెన్షా తలో 37 పరుగులు.. కూపర్ కన్నోలీ, జేవియర్ బార్ట్‌లెట్ చెరో అజేయమైన 11 పరుగులు.. తాత్కాలిక కెప్టెన్ ట్రవిస్ హెడ్ , గ్లెన్ మ్యాక్స్‌వెల్ 9 పరుగులు చేశారు. ఐర్లాండ్ బౌలర్లలో మార్క్ అడైర్ 2, మాథ్యూ హంఫ్రేస్, జార్జ్ డాక్రెల్, హ్యారీ టెక్టార్ తలో వికెట్ దక్కించుకున్నారు.అనంతరం 183 పరుగుల లక్ష్య ఛేదనలో ఐర్లాండ్ ఆదిలోనే చేతులెత్తేసింది. ఆడమ్ జంపా (4-0-23-4), నాథన్ ఎల్లిస్ (3.5-1-12-4) ధాటికి 16.5 ఓవర్లలో 115 పరుగులకే చాపచుట్టేసింది. మిగతా ఆసీస్ బౌలర్లలో కుహ్నేమన్ (4-0-29-1) కూడా రాణించాడు. ఐర్లాండ్ ఇన్నింగ్స్‌లో ఎనిమిదో స్థానంలో బ్యాటింగ్‌కు దిగిన జార్జ్ డాక్రెల్ (41) టాప్ స్కోరర్‌గా నిలిచాడు. డాక్రెల్ ఈ స్కోర్ చేయకపోయుంటే ఐర్లాండ్ 100 పరుగుల మార్కును కూడా దాటలేకపోయేది. మిగతా ఐరిష్ బ్యాటర్లలో లోర్కన్ టక్కర్ (24), రాస్ అడైర్ (12), గెరాత్ డెలానీ (11) రెండంకెల స్కోర్లు చేశారు.

## రూథర్‌ఫోర్డ్ వీరంగం?.. హోల్డర్ మెరుపులు.. విండీస్ భారీ స్కోం



"టీ20 ప్రపంచకప్ 2026లో భాగంగా ఇవాళ (ఫిబ్రవరి 11) రాత్రి 7 గంటలకు మొదలైన మ్యాచ్‌లో వెస్టిండీస్, ఇంగ్లండ్ జట్లు తలపడుతున్నాయి. ఈ మ్యాచ్‌లో ఇంగ్లండ్ టాస్ గెలిచి తొలుత బౌలింగ్ ఎంచుకుంది. మిడిలార్డర్, లోయర్ ఆర్డర్ బ్యాటర్లు? చెలరేగడంతో విండీస్ నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 196 పరుగులు చేసింది.8 పరుగులకే ఓపెనర్లు బ్రాండన్ కింగ్ (1), షాయ్ హోప్ (0) వికెట్లు కోల్పోయిన విండీస్‌ను షిమ్రోన్ హెట్‌మైర్ (23), రోస్టన్ ఛేజ్ (34) ఆదుకున్నారు. వీరిద్దరు ఔటయ్యాక రూథర్‌ఫోర్డ్ (76 నాటౌట్), హోల్డర్ (33) చెలరేగి ఆడి విండీస్‌కు భారీ స్కోర్ అందించారు. వీరిద్దరు చివరి ఓవర్లలో విధ్వంసం? సృష్టించారు. పోటీపడి సిక్సర్లు బాది స్కోర్‌ను 200 దరికి చేర్చారు. రూథర్‌ఫోర్డ్ 42 బంతుల్లో 2 ఫోర్లు, 7 సిక్సర్లు బాదగా.. హోల్డర్ 17 బంతుల్లో ఓ ఫోర్, 4 సిక్సర్లు కొట్టాడు. మిగతా విండీస్ బ్యాటర్లలో రోవ్‌మన్ పావెల్ 14, రొమారియో షెపర్డ్ ఒక్క పరుగు (నాటౌట్) చేశారు.ఇంగ్లండ్ బౌలర్లలో ఆదిల్ రషీద్ (4-0-16-2) అత్యంత? పొదుపుగా బౌలింగ్ చేసి విండీస్ బ్యాటర్లను కట్టడి చేయగా.. జేమీ ఓవర్టన్ (4-0-33-2) పర్వాలేదనిపించాడు. జోఫ్రా ఆర్చర్ వికెట్ తీసినా (4-0-48-1) ధారాళంగా పరుగులు సమర్పించుకున్నాడు. గత మ్యాచ్‌లో సత్తా చాటిన సామ్ కర్రన్ (3-0-36-1) ఈ మ్యాచ్‌లో పెద్దగా ?ప్రభావం చూపించలేకపోయాడు. జాక్స్ 2 ఓవర్లలో 32, డాసన్ 3 ఓవర్లలో 27 పరుగులు సమర్పించుకున్నారు.

# టీమిండియాకు గుడ్ న్యూస్





రేపు (ఫిబ్రవరి 12) నమీబియాతో జరుగబోయే టీ20 ప్రపంచకప్ మ్యాచ్‌కు ముందు టీమిండియాకు గుడ్ న్యూస్ అందుతుంది. కడుపు ఇన్ఫెక్షన్‌తో బాధపడుతూ, గత రెండు రోజులుగా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న అభిషేక్ శర్మ డిశ్చార్జ్ అయ్యాడని తెలుస్తుంది. ఈ విషయాన్ని అభిషేక్ సహ టీమిండియా సభ్యుడు తిలక్ వర్మ ఇవాళ ప్రెస్ కాన్ఫరెన్స్‌లో వెల్లడించాడు. అయితే అభిషేక్ రేపటి మ్యాచ్ ఆడతాడా లేదా అన్నదానిపై మాత్రం తిలక్ క్లారిటీ ఇవ్వలేదు. అభిషేక్ జట్టుకు అందుబాటులోకి రావడంతో టీమిండియాకు మరో సమస్య వచ్చి పడింది. అభిషేక్ నమీబియా మ్యాచ్‌కు అందుబాటులోకి రాలేడేమోనని, జట్టు మేనేజ్‌మెంట్ సంజూ శాంసన్‌ను రేపటి మ్యాచ్‌కు సిద్ధం చేసింది. సంజూ.. మరో ఓపెనర్ ఇషాన్ కిషన్‌తో కలిసి ఇవాళ కూడా నెట్స్‌లో చాలాసేపు శ్రమించాడు. మ్యాచ్ సమయానికి అభిషేక్ ఫిట్ అయితే, ఆఖరి నిమిషంలో అయినా సంజూకు హ్యాండ్ తప్పకపోవచ్చు.ఒకవేళ కీలకమైన పాకిస్తాన్ మ్యాచ్ (ఫిబ్రవరి 15) వరకు అభిషేక్‌కు రెస్ట్ ఇవ్వాలని మేనేజ్‌మెంట్ భావిస్తే మాత్రం, నమీబియాతో మ్యాచ్‌లో ఇషాన్, సంజూ భారత ఇన్నింగ్స్‌ను ప్రారంభిస్తారు. ఇక్కడ మరో సమస్య కూడా ఉంది. సంజూ నమీబియా మ్యాచ్‌లో రాణిస్తే.. పాక్‌తో మ్యాచ్‌కు ముందు అభిషేక్‌తో పోటీపడే అవకాశం ఉంది. ఈ పరిస్థితుల్లో మేనేజ్‌మెంట్ ఏ నిర్ణయం తీసుకుంటుందో చూడాలి.

ఇటీవలికాలంలో భీకర ఫామ్‌లో ఉన్న అభిషేక్ ప్రపంచకప్ తొలి మ్యాచ్‌లో యూఎస్ఏపై గోల్డెన్ డకౌటయ్యాడు. ఆ మ్యాచ్ సందర్భంగానే అతను తొలుత అస్వస్థతకు గురయ్యాడు. ఆతర్వాత టీమ్ కోచ్ గౌతమ్ గంభీర్ ఇంట్లో (ఢిల్లీ) డిన్నర్‌కు వెళ్లినప్పుడు పరిస్థితి క్షీణించి, ఆసుపత్రిలో చేరాడు. ఈ ప్రపంచకప్‌లో అభిషేక్‌పై భారీ అంచనాలు ఉన్నాయి. అతను తన సహజ శైలిలో అందించే మెరుపు ఆరంభాలు మ్యాచ్ గతినే మార్చేస్తాయి. అభిషేక్ ప్రతి మ్యాచ్‌లో 30, 40 పరుగులు చేసినా టీమిండియా భారీ స్కోర్లు చేసే అవకాశం ఉంటుంది. భారత బౌలింగ్ విభాగం కూడా పటిష్టంగా ఉంది కాబట్టి, ఆ స్కోర్లను విజయవంతంగా కాపాడుకోవచ్చు. అభిషేక్‌తో పాటు టీమిండియా సభ్యులంతా తలో మ్యాచ్‌లో సత్తా చాటినా భారత్ మరోసారి ప్రపంచకప్ ఎగరేసుకుపోవడం ఖాయమని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# టి20 ప్రపంచ కప్‌లో సూపర్ 2

### రెండో సూపర్ ఓవర్‌లో నెగ్గిన దక్షిణాఫ్రికా

### చెమటలు పట్టించిన ఆఫ్ఘనిస్తాన్





అహ్మదాబాద్: టి20 ప్రపంచకప్ మ్యాచ్‌లు ఉత్కంఠభరితంగా సాగుతున్నాయి. టైటిల్ ఫేవరెట్ జట్లకు తొలిసారి టోర్నీకి అర్హత సాధించిన జట్లు చెమటలు పట్టిస్తున్నాయి. టోర్నీ ఆరంభంలో నెదర్లాండ్స్ జట్టు పాకిస్తాన్‌ను ఓడించేంత పనిచేయగా.. మొన్నటికి మొన్న ఇంగ్లండ్‌పై గెలుపుకు చేరువలో నేపాల్ జట్టు ఓటమిపాలైంది. హమ్మయ్యా... అనుకునేంతలోపే అహ్మదాబాద్ వేదికగా ఆఫ్ఘనిస్తాన్, దక్షిణాఫ్రికా జట్ల మధ్య బుధవారం జరిగిన రసవత్తరంగా సాగింది. ఈ మ్యాచ్ ఫలితం తేలేందుకు ఇరుజట్లు రెండు సూపర్ ఓవర్లు ఆడాల్సి వచ్చింది. దక్షిణాఫ్రికా మధ్య నరేంద్ర మోడీ స్టేడియంలో జరిగిన ఈ మ్యాచ్‌లో హైడ్రామా చోటుచేసుకుంది. సూపర్ థ్రిల్లింగ్‌గా సాగిన ఈ మ్యాచ్‌లో రెండుసార్లు సూపర్ ఓవర్ వరకు వెళ్లింది. చివరకు దక్షిణాఫ్రికా రెండో సూపర్ ఓవర్‌లో 4 పరుగుల తేడాతో గెలిచి ఊపిరి పీల్చుకుంది. ఈ వరల్డ్‌కప్‌లో సూపర్ ఓవర్ వరకు వెళ్లిన తొలి మ్యాచ్ ఇదే. భారీ పవర్ హిట్టర్లు ఉన్న రెండు జట్లు.. మ్యాచ్‌పై చివరి వరకు తమ పట్టును కోల్పోలేదు. ఈ మ్యాచ్‌లో సిక్సర్ల వర్షం కురిసింది. తొలి మ్యాచ్‌లో రెండు జట్లు కలిపి 20 సిక్సర్లు కొట్టాయి. ఇక సూపర్ ఓవర్స్‌లో మరో 10 సిక్సర్లు బాదాయి. తొలుత బ్యాటింగ్‌కు దిగిన దక్షిణాఫ్రికా నిర్ణీత ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 187 పరుగులు చేసింది. డికాక్(59), రికల్టన్(61) అర్ధసెంచరీలతో రాణించారు. ఛేదనలో ఆఫ్ఘనిస్తాన్‌కు గుర్బాజ్ అదిరే ఆరంభాన్నిచ్చాడు. అతను 42 బంతుల్లో 84 పరుగులు చేశాడు. అజ్మతుల్లా, రషీద్ ఖాన్ కూడా చివర్లో చెలరేగారు. చివరి ఓవర్లో ఆఫ్ఘన్ జట్టు 13 పరుగులు చేయాల్సి రాగా.. రబడా వేసిన ఆ ఓవర్లో తొలి రెండు బంతులకే ఆఫ్ఘన్ 8పరుగులు చేసింది. ఆ తర్వాత రబడా అద్భుతంగా బౌలింగ్ చేసి మ్యాచ్‌ను టైగా ముగించాడు. దీంతో ఆఫ్ఘనిస్తాన్ 19.4 ఓవర్లలో 187 పరుగులకు ఆలౌటైంది. మ్యాచ్ టై కావడంతో సూపర్ ఓవర్‌కు వెళ్లగా.. తొలి సూపర్ ఓవర్‌లో ఆఫ్ఘనిస్తాన్ బ్యాటింగ్‌కు దిగి 17 పరుగులు చేసింది. ఛేదనలో దక్షిణాఫ్రికా కూడా 17పరుగులే చేసింది. రెండో సూపర్ ఓవర్లో దక్షిణాఫ్రికా 23 పరుగులు చేస్తే.. ఆఫ్ఘనిస్తాన్ 19పరుగులే చేసి ఓటమిపాలైంది. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ లుంగీ ఎన్గిడికి దక్కింది.

# గులిమితో క్యాన్సర్ గుర్తింపు!
## వైద్య రంగంలో షాక్



చెవిలో పేరుకుపోయే గులిమి... ఇప్పటివరకు మనకు అసౌకర్యంగా అనిపించే ఒక చిన్న సమస్య మాత్రమే. కానీ అదే గులిమి ఒక రోజు క్యాన్సర్‌ను ముందే హెచ్చరించే సంకేతంగా మారుతుందని ఎవరైనా ఊహించారా? బ్రెజిల్‌లోని ఫెడరల్ యూనివర్సిటీ ఆఫ్ గోయాస్ శాస్త్రవేత్తలు చేసిన తాజా పరిశోధన ఈ ప్రశ్నకు సంచలనాత్మక సమాధానం ఇచ్చింది. చెవి గులిమిని ఆధారంగా తీసుకుని క్యాన్సర్‌ను గుర్తించే ఈ వినూత్న పరిశోధనకు "సెరూమెనోగ్రామ్" అనే పేరు పెట్టారు. ఈ ప్రాజెక్ట్‌కు 2025 కాపెస్ అవార్డుల్లో గౌరవ ప్రస్తావన కూడా లభించింది. ఇప్పటివరకు క్యాన్సర్ నిర్ధారణ అంటే ఖరీదైన రక్త పరీక్షలు, బాధాకరమైన బయాప్సీలు, ఖరీదైన స్కాన్‌లు గుర్తొస్తాయి. కానీ ఇప్పుడు... ఒక చిన్న గులిమి నమూనాతోనే శరీరంలో దాగి ఉన్న ప్రమాదాన్ని కనిపెట్టే దశకు వైద్యం చేరింది. శాస్త్రవేత్తల మాటల్లో చెప్పాలంటే – శరీరం ఆరోగ్యంగా ఉన్నప్పుడు చెవి గులిమి రసాయన కూర్పు దాదాపు ఒకేలా ఉంటుంది. కానీ క్యాన్సర్ వంటి తీవ్రమైన వ్యాధి మొదలైన వెంటనే ఆ రసాయన సమతుల్యత మారిపోతుంది. "చెవి గులిమి ఇప్పుడు మన ఆరోగ్యానికి వేలిముద్రలా మారింది" అని ఈ అధ్యయన సమన్వయకర్త నెల్సన్ అంటోనియోసి ఫిలో వ్యాఖ్యానించారు. అంటే... మన శరీరంలో ఏం జరుగుతుందో చెవి గులిమి చెప్పగలుగుతోంది. ఈ పరిశోధనలో భాగంగా 751 మంది నుంచి గులిమి నమూనాలను సేకరించారు. క్యాన్సర్ చికిత్సలో ఉన్న 531 మందిలో ఈ పరీక్ష ఖచ్చితంగా క్యాన్సర్ ఉనికిని గుర్తించింది. ఇక వ్యాధి లేనట్లు భావించిన 220 మందిలో 5 నమూనాలు అనుమానాస్పదంగా తేలాయి. తర్వాత సంప్రదాయ పరీక్షలు చేయగా... ఆశ్చర్యకరంగా ఆ ఐదుగురికీ నిజంగానే క్యాన్సర్ ఉన్నట్లు నిర్ధారణ అయింది. దీంతో ఈ విధానం ఎంత నమ్మదగినదో స్పష్టమైంది. ఇక్కడితో కథ ఆగలేదు. 2025లో మరో కీలక మైలురాయి చేరుకున్నారు శాస్త్రవేత్తలు. ఈ గులిమి ఆధారిత పరీక్ష ప్రీ–క్యాన్సర్ దశను కూడా గుర్తించగలదని వెల్లడించారు. అంటే వ్యాధి పూర్తిగా ప్రబలకముందే చికిత్స మొదలుపెట్టే అవకాశం. దీని వల్ల తక్కువ బాధ, తక్కువ ఖర్చు, ఎక్కువ జీవనావకాశాలు సాధ్యమవుతాయి. ' ప్రస్తుతం నియంత్రణ నిబంధనల కారణంగా ఈ పరీక్ష బ్రెజిల్ ప్రభుత్వ ఆరోగ్య వ్యవస్థలో ఉచితంగా అందుబాటులో లేదు. అయినప్పటికీ, త్వరలోనే ప్రైవేటు ఆసుపత్రులు, ప్రభుత్వ విద్యా సంస్థల ద్వారా ఇది అందుబాటులోకి వచ్చే అవకాశాలున్నాయని నిపుణులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. మరిన్ని వ్యాధులను గుర్తించే దిశగా.. ఇంకా ఆశ్చర్యం ఏమిటంటే... ఇదే సాంకేతికతను ఉపయోగించి అల్జీమర్స్, పార్కిన్సన్స్, డిమెన్షియా వంటి మెదడు సంబంధిత వ్యాధులను గుర్తించే దిశగా కూడా పరిశోధనలు సాగుతున్నాయి. ఇది విజయవంతమైతే, వైద్య నిర్ధారణ రంగమే కొత్త మలుపు తిరగనుంది. ఇంతకాలం శుభ్రం చేయాల్సిన వ్యర్థంగా భావించిన చెవి గులిమి... ఇప్పుడు ప్రాణాలు కాపాడే కీలక సూచనగా మారుతోంది. ఈ బ్రెజిలియన్ పరిశోధన ఒక విషయాన్ని స్పష్టంగా చెబుతోంది – క్యాన్సర్‌ను సకాలంలో, చవకగా, సులభంగా గుర్తించడం ఇక అసాధ్యం కాదు.

## క్యాన్సర్ ఎందుకు పెరుగుతోంది? ఎలా జయించాలి?

ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మందిని ప్రభావితం చేస్తున్న క్యాన్సర్ వ్యాధిపై అవగాహన పెంచడం, ముందస్తు నివారణకు ప్రోత్సహించడం, బాధితుల్లో ఆశను నింపడం ఈ దినం ప్రధాన ఉద్దేశ్యం. వైద్య శాస్త్రం ఎన్నో ముందడుగులు వేసినా, క్యాన్సర్ ఇప్పటికీ మానవాళికి అతిపెద్ద ఆరోగ్య సవాళ్లలో ఒకటిగా నిలుస్తోంది. భారతదేశంలోనే ప్రతి ఏడాది సుమారు 15 లక్షలకు పైగా కొత్త క్యాన్సర్ కేసులు నమోదవుతున్నట్లు వైద్య నిపుణులు అంచనా వేస్తున్నారు. గత దశాబ్దంతో పోలిస్తే క్యాన్సర్ కేసుల సంఖ్య గణనీయంగా పెరిగింది. ఒకప్పుడు పట్టణాలకు పరిమితమైన ఈ వ్యాధి, ఇప్పుడు గ్రామీణ ప్రాంతాలకూ విస్తరించడం ఆందోళన కలిగించే అంశం. ప్రయాణీకులకు్యాన్సర్ పెరుగుదలకు ఒక్క కారణం లేదు. మారుతున్న జీవనశైలి ప్రధాన కారణంగా నిపుణులు చెబుతున్నారు. అనారోగ్యకరమైన ఆహారపు అలవాట్లు, పొగతాగడం, మద్యం సేవించడం, శారీరక వ్యాయామం లేకపోవడం, అధిక ఒత్తిడి, నిద్రలేమి వంటి అంశాలు క్యాన్సర్ ప్రమాదాన్ని పెంచుతున్నాయి. దీనితో పాటు కాలుష్యం, రసాయనాల వినియోగం, పురుగుమందులు, ప్రాసెస్ చేసిన ఆహారం కూడా శరీరంపై ప్రతికూల ప్రభావం చూపుతున్నాయి. మహిళల్లో ముఖ్యంగా స్తన క్యాన్సర్, గర్భాశయ క్యాన్సర్ కేసులు పెరుగుతుండగా, పురుషుల్లో ఊపిరితిత్తుల క్యాన్సర్, నోటి క్యాన్సర్ ఎక్కువగా నమోదవుతున్నాయి. పొగాకు వినియోగం దీనికి ప్రధాన కారణంగా మారుతోంది. ఆలస్యమే ప్రమాదం క్యాన్సర్ మరణాలకు ప్రధాన కారణం ఆలస్యంగా గుర్తించడమే. ప్రారంభ దశలో క్యాన్సర్ లక్షణాలు చాలా స్వల్పంగా ఉండటం వల్ల చాలామంది నిర్లక్ష్యం చేస్తారు. ఫలితంగా వ్యాధి ముదిరిన దశలో మాత్రమే వైద్యులను ఆశ్రయిస్తారు. ఈ ఆలస్యం ప్రాణాంతకంగా మారుతోంది. వైద్యులు చెబుతున్న ముఖ్యమైన విషయం ఏమిటంటే.. సకాలంలో గుర్తిస్తే క్యాన్సర్ పూర్తిగా నయం కావచ్చు. అందుకే రెగ్యులర్ హెల్త్ చెకప్‌లు, స్క్రీనింగ్ పరీక్షలు ఎంతో కీలకం. నివారణే అసలైన విజయం క్యాన్సర్‌పై పోరాటంలో నివారణే అత్యంత శక్తివంతమైన ఆయుధం. పొగతాగడం పూర్తిగా మానడం ద్వారా నోటి, ఊపిరితిత్తుల క్యాన్సర్ ప్రమాదాన్ని భారీగా తగ్గించవచ్చు. మద్యం సేవనాన్ని నియంత్రించడం, రోజూ కనీసం అరగంట శారీరక వ్యాయామం చేయడం ద్వారా శరీరంలోని హార్మోన్ల సమతుల్యత మెరుగుపడుతుంది. శరీర బరువును నియంత్రణలో ఉంచుకోవడం కూడా ఎంతో ముఖ్యం. అధిక బరువు అనేక రకాల క్యాన్సర్లకు దారితీస్తుందని పరిశోధనలు స్పష్టం చేస్తున్నాయి. భారత్ తో ఆడకపోతే పోతా్రోయ్.. కట్టకట్టుకు పోతారు నక్కతోక తొక్కొచ్చాడ్రోయ్– చిచ్చరపిడుగు దొరికాడు: రసవత్తరంగా టీ20 వరల్డ్ కప్ ప్రయాణీకులకు ఆహారమే ఔషధం క్యాన్సర్ నివారణలో ఆహారం కీలక పాత్ర పోషిస్తుంది. తాజా పండ్లు, కూరగాయలు, ఆకుకూరలు శరీరానికి అవసరమైన యాంటీఆక్సిడెంట్లు అందిస్తాయి. ఇవి క్యాన్సర్ కణాల పెరుగుదలను అడ్డుకుంటాయి. టమాటాలో ఉండే లైకోపీన్, క్యారెట్‌లోని బీటా కెరోటిన్, బ్రోకోలీ, క్యాబేజీ వంటి క్రూసిఫెరస్ కూరగాయలు క్యాన్సర్ నిరోధక లక్షణాలు కలిగి ఉంటాయి. పసుపులోని కర్క్యూమిన్, వెల్లుల్లిలోని సల్ఫర్ సమ్మేళనాలు రోగనిరోధక శక్తిని పెంచుతాయి. జంక్ ఫుడ్, అధిక చక్కెర, అధిక ఉప్పు ఉన్న ఆహారాన్ని తగ్గించడం ద్వారా శరీరంపై వచ్చే భారాన్ని తగ్గించవచ్చు. నీటిని తగినంత తీసుకోవడం కూడా చాలా అవసరం. ' మానసిక ఆరోగ్యానికి ప్రాధాన్యం క్యాన్సర్ చికిత్సలో మానసిక ఆరోగ్యం కూడా కీలకం. వ్యాధి నిర్ధారణ అయిన వెంటనే చాలామంది మానసికంగా కుంగిపోతారు. భయం, ఒంటరితనం, నిరాశ చికిత్సపై ప్రతికూల ప్రభావం చూపుతుంది. కుటుంబ సభ్యుల మద్దతు, స్నేహితుల ప్రోత్సాహం, సమాజం నుంచి సహకారం రోగి కోలుకోవడంలో కీలక పాత్ర పోషిస్తాయి. సానుకూల ఆలోచనలు, ధైర్యం, ఆశ రోగి పోరాట శక్తిని పెంచుతాయి. క్యాన్సర్ బాధితులను దూరం పెట్టకుండా, వారికి అండగా నిలవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిదీ. క్యాన్సర్‌ను జయించడం క్యాన్సర్ డే సందర్భంగా వైద్యులు, ఆరోగ్య నిపుణులు ఇస్తున్న సందేశం ఒక్కటే .. క్యాన్సర్ అనేది తప్పనిసరిగా ఓటమి కాదు. అవగాహన, ముందస్తు పరీక్షలు, ఆరోగ్యకరమైన జీవనశైలి, సరైన ఆహారం, మానసిక ధైర్యం ఉంటే క్యాన్సర్‌ను జయించవచ్చు.




# రెస్టారెంట్ స్టైల్ పెరుగు వడలు.. ఇలా చేస్తే సూపర్ రుచులు!

మనం తీసుకునే ఆహారంలో బ్రేక్ ఫాస్ట్ కు చాలా ప్రాధాన్యత ఉంటుంది. అయితే బ్రేక్ ఫాస్ట్ గా తీసుకునే ఆహారం కూడా మన శరీరానికి అనేక ఆరోగ్య ప్రయోజనాలను కలిగించేలా ఉండాలి. అటువంటి ఆహారాలలో దహి వడ ఒకటి. వీటినే పెరుగు వడలు అని కూడా అంటారు. ఈ పెరుగు వడలను, చాలా సాఫ్ట్ గా రెస్టారెంట్ స్టైల్ లో ఎలా తయారు చేయాలి. అలా రావాలంటే ఎటువంటి చిట్కాలను పాటించాలి అనేది ప్రస్తుతం తెలుసుకుందాం. పెరుగు వడలు తయారీ కి కావలసిన పదార్థాలు మినపప్పు– ఆరేడు గంటల పాటు నానబెట్టి మెత్తగా రుబ్బుకున్న ది ఉప్పు– రుచికి తగినంత పచ్చిమిరపకాయలు– 4 అల్లం– చిన్న ముక్క కరివేపాకు– రెండు రెమ్మలు నూనె– పావు కిలో పెరుగు వడలు తయారీ ముందుగా పెరుగు వడలు తయారు చేయడానికి మినపప్పును ఆరేడు గంటల పాటు నానబెట్టుకొని మిక్సీలో కానీ గ్రైండర్లో కానీ మెత్తగా రుబ్బుకోవాలి. ఎక్కువ



నీరు పోయకుండా, కొద్దికొద్దిగా నీరు పోస్తూ రుబ్బుకోవాలి. మనం చేత్తో వడ చేసుకొని వేసుకోవడానికి ఎంత కన్సిస్టెన్సీ కావాలో అంతే ఉండేలా చూసుకోవాలి. ఈ మినపప్పుతో పాటే పచ్చిమిరపకాయలు, అల్లం, ఉప్పు, కరివేపాకు కూడా వేసి రుబ్బుకోవాలి. వడలు చేసుకున్నాక ఇలా తప్పక చెయ్యాలి పిండిని గిన్నెలో వేశాక పిండిని బాగా కలిపి బోలుగా వచ్చేలా చూడాలి. పిండి బాగా కలిపాక చిన్న ముద్దను నీటిలో వేస్తే అది తేలాలి. అప్పటిదాకా పిండిని కలపాలి. తేలినట్టు చూశాక స్టవ్ మీద పాన్ పెట్టి నూనె పోసి, నూనె కాగిన తర్వాత అందులో వడల పిండిని వడలా చేసుకుని మధ్యలో చిన్న రంధ్రం చేసి వేసి వడలు కాల్చుకోవాలి. ఆ తర్వాత వడలను తీసి నీళ్ళలో వేసి, పిండి వేరే గిన్నెలో వేసుకోవాలి. పెరుగులో వడలు ఇలా వేసుకోవాలి ఆ తర్వాత వడలను పెరుగులో వేసుకోవడానికి పెరుగులో కొద్దిగా ధనియాల పొడి, లైట్ గా సాల్ట్ కలిపి బాగా గట్టిగా, బాగా పలుచగా లేకుండా, మీడియం చిక్కగా ఉండేలా చూసుకోవాలి. అందులో కొద్దిగా పోపు వేసి కలుపుకోవాలి. ఆపై వడలు అన్నింటిని పెరుగులో నానబెట్టి ఐదారు గంటల తర్వాత తింటే వడ చాలా సాఫ్ట్ గా, టేస్టీగా రెస్టారెంట్ స్టైల్ లో ఉంటుంది.

# మద్యం తాగుతూ దమ్ము కొడుతున్నారా - అయితే, ఇది తెలుసుకోవాల్సిందే..!!



మద్యపానం.. ధూమపానం రెండూ హాని కరం. ఈ రెండింటిని కలిపితే మహా డేంజర్. కొత్త ఆరోగ్య సమస్యలు రావటం ఖాయం. గుండె జబ్బులు, జీర్ణ సమస్యలు, క్యాన్సర్ వంటి తీవ్ర అనారోగ్య సమస్యలను ఎదుర్కోవాల్సి వస్తుంది. కొంతమంది అప్పుడప్పుడు తాగే మద్యం, ధూమపానం వల్ల ఆరోగ్యానికి ఎటువంటి హాని కలగదు అని భావిస్తారు. కానీ ఈ రెండింటిని కలిపి ఒకే సమయంలో చేయడం వల్ల ఆరోగ్యానికి రెట్టింపు నష్టం తప్పదని నిపుణులు హెచచరిస్తున్నారు. అసలు, ఈ రెండు కలిపి తీసుకోవం వలన ఏం జరుగుతుందో వివరిస్తున్నారు. ఇలా చేయవద్దని హెచ్చరికలు చేస్తున్నారు.చాలా మంది మద్యపానం సమయంలోనే ధూమపానం చేస్తూ ఉంటారు. దీని కారణంగా పైకి కనిపించని నష్టాలు ఎన్నో ఉన్నాయి. శరీరం పన ఒత్తిడి పెరుగుతుంది. శరీర డీహైడ్రేషన్‌కు దారి తీస్తుంది, సరైన నిర్ణయాలు తీసుకునే స్థామర్యం తగ్గేలా చేస్తుంది. ధూమపానం వల్ల ఏకకాలంలో శ్వాసకోశ వ్యవస్థపై దాడి జరుగుతుంది. శ్వాస తీసుకోవడం కష్టంగా మారుతుంది. ఇక ఈ రెండు కలిసినప్పుడు జీర్ణవ్యవస్థకు అసౌకర్యం, గ్యాస్, ఉబ్బరం, అజీర్ణం వంటి సమస్యలు తలెత్తు తాయి. మరిన్ని కనుగొనండి క్రీడా ఉత్పత్తులు టీవీ అంతర్జాతీయ వార్తలు ప్రకటన సేవలు ఓఎ సంబంధించిన వార్తలు వీడియో వార్తల సేవ సమన్వయ లోపం వంటి తక్షణ ప్రభావాలను కూడా అనుభవిస్తారు. ధూమపానం, మద్య పానం విడివిడిగా శరీరంలో ముఖ్యమైన అవయవాలను దెబ్బతీస్తాయి. ఇలాంటి రెండు కలిపి తీసుకోవటం వలన ఎక్కువ ప్రమాదం పొంచి ఉంది. ధూమపానం ఊపిరితిత్తులను దెబ్బతీస్తే, మద్యపానం కాలేయ ఆరోగ్యాన్ని దెబ్బతీస్తుంది. ఇవి రెండు కలిసి గుండె ఆరోగ్యాన్ని దెబ్బ తీస్తాయి. శరీరంలో అవయవాలన్నీ ఇబ్బందులకు గురి అవుతాయి. ఆరోగ్యానికి ప్రమాదం ఈ రెండు కలవటం వలన ఒకే సారి రక్తపోటు పెరిగి గుండెపై అధిక ఒత్తిడి పడుతుంది. కాల క్రమేణా ఇది శరీర రోగనిరోధక వ్యవస్థను దెబ్బతీస్తుంది. తరచూ ఇన్ఫెక్షన్ ల బారిన పడాల్సి వస్తుంది. పునరుత్పత్తి ఆరోగ్యం దెబ్బతింటుంది. సంతానోత్పత్తి తగ్గడంతోపాటు లైంగిక సామర్థ్యం తగ్గుతుందని వైద్యులు చెబుతున్నారు. ధూమపానం, మద్యపానం కలిపి చేయడం వల్ల ఊపిరితిత్తులు, కాలేయం, గొంతు, రొమ్ము క్యాన్సర్ వంటి ప్రాణాంతక సమస్యల బారిన పడాల్సి వస్తుంది. ఒటలవతీబితిబవఎవనిబి దీర్ఘకాలిక మద్యపానం వల్ల కాలేయ సిర్రోసిస్ వంటి సమస్యలు తలెత్తుతాయి. దీర్ఘకాలిక ధూమపానం వల్ల బ్రోన్కైటిస్, ఎంఫిసెమా, గుండె జబ్బులు, స్ట్రోక్ వంటి సమస్యలను ఎదుర్కోవాల్సి వస్తుంది. యువకులు, మధుమేహం ఉన్న వారు, శ్వాసకోశ సమస్యలతో బాధపడే వారికి ఇవి మరింత హానిని కలిగిస్తాయి. యువకులు చిన్న వయసులోనే వీటిని అలవాటు చేసుకోవడం వల్ల వ్యసనంగా మారడంతో పాటు తీవ్ర అనారోగ్య సమస్యలను ఎదుర్కోవాల్సి వస్తుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

# రాయలసీమ స్పెషల్ శనగకాయ పచ్చడి ఇలా చేస్తే బెస్ట్..!

వంటింట్లో శనగకాయ పచ్చడి (వేరుశనగ పల్లీల పచ్చడి) కి ఒక ప్రత్యేక గుర్తింపు ఉంది. ఇది కేవలం టిఫిన్లలోకే కాకుండా, వేడివేడి అన్నంలోకి కూడా అద్భుతంగా ఉంటుంది. కాగా మాంసాహారంతో సమానమైన ప్రోటీన్ పల్లీల్లో ఉంటుంది. అలానే ఇందులో గుండెకు మేలు చేసే మోనో అన్ శాచురేటెడ్ ఫ్యాటీ యాసిడ్స్ ఉంటాయి. తక్కువ పరిమాణంలో తిన్నా ఎక్కువ శక్తిని ఇస్తుంది. ఆరోగ్య ప్రయోజనాలు.. ఈ పచ్చడిని ఫ్రిజ్‌లో 1–2 రోజులు నిల్వ చేసుకోవచ్చు. వేరుశెనగల్లో ప్రోటీన్, మంచి కొవ్వులు ఎక్కువగా ఉంటాయి. ఎనర్జీ ఇవ్వడంలో ఇది చాలా మంచిది. పల్లీలు కాలిపోకుండా మధ్యమంటపై వేయించడం చాలా ముఖ్యం. అలానే ఎక్కువ పులుపు ఇష్టంలేనివారు చింతపండు పరిమాణం తగ్గించుకోవచ్చు. వెల్లుల్లి ఇష్టంలేనివారు తీసేయొచ్చు, కానీ రాయలసీమ ఫ్లేవర్ కోసం ఇది బెస్ట్. ఈ పచ్చడిని 10 నిమిషాల్లోనే సులభంగా తయారు చేయవచ్చు. ఒశ్రీబనీ ఖీవజీట "రెస్టారెంట్ స్టైల్ 'గ్రీన్ మిర్చి చికెన్'.. ఇలా చేస్తే టేస్ట్ నెక్స్ట్ లెవెల్..!" కావలసిన పదార్థాలు.. వేరుశెనగ గుళ్లు (పల్లీలు) – 1 కప్పు"ఖాళీ కడుపుతో ఈ వాటర్ తీసుకుంటే చాలు.. క్లీన్" పచ్చిమిర్చి – 5–6 (కారం తగినట్లు) చింతపండు – చిన్న నిమ్మకాయంత వెల్లుల్లి రెబ్బలు – 4–5 జనీబీ ఓజీఎ ఒశ్రీబనీ ఒతినెవ "పది నిమిషాల్లో తయారయ్యే మిక్స్‌డ్ వెజిటబుల్ పచ్చడి.. ఇలా చేస్తే అన్నం మెతుకు మిగలదు!" జీలకర్ర –½ స్పూన్ ఉప్పు – తగినంత నూనె – 2 స్పూన్లు ఒటలవతీబితిబవఎవనిబి పోపు కోసం: ఆవాలు –½ స్పూన్ మినపప్పు – 1 స్పూన్ కరివేపాకు – కొద్దిగా ఎండుమిర్చి – 1 (ఐచ్చికం) తయారీ విధానం.. ముందుగా బాణలిలో వేరుశెనగ గుళ్లను మోస్తరు మంటపై దోరగా వేయించాలి. పల్లీలు బాగా చల్లారిన తర్వాత తొక్కలు తీసేసి పక్కన పెట్టుకోవాలి. అదే బాణలిలో కొద్దిగా నూనె వేసి పచ్చిమిర్చులను స్వల్పంగా వేయించాలి. ఇలా చేస్తే పచ్చడి వాసన, రుచి బాగా వస్తాయి. చల్లారిన పల్లీలు, వేయించిన పచ్చిమిర్చి, చింతపండు, వెల్లుల్లి, జీలకర్ర, ఉప్పు అన్నింటిని మిక్సీ జార్‌లో వేసి అవసరమైతే కొద్దిగా నీళ్లు పోసి మెత్తగా రుబ్బాలి. మీకు నచ్చినట్లుగా కొంచెం రఫ్‌గా లేదా మెత్తగా చేసుకోవచ్చు. చిన్న బాణలిలో నూనె వేడి చేసి ఆవాలు, మినపప్పు, ఎండుమిర్చి, కరివేపాకు వేసి పోపు పెట్టాలి. ఈ పోపును పచ్చడిలో కలిపితే రుచి మరింత పెరుగుతుంది.



# రైతులకు 'ఈ పంట' నమోదు తప్పనిసరి

## క్షేత్రస్థాయి పర్యటనలో పశ్చిమగోదావరి జిల్లా కలెక్టర్ నాగరాణి



నరసాపురం, ఫిబ్రవరి 11 నరసాపురం మండలం ఎల్.బి చర్ల భైరవపాలెంలో రైతులు కూనపురెడ్డి మల్లిఖార్జునరావు, బర్రి మునలయ్య ఈ–క్రాప్ బుకింగ్ ను బుధవారం పశ్చిమగోదావరి జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి, జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంలో రైతుతో మాట్లాడుతూ ఏ వెరైటీ వేశారు, విస్తీర్ణం ఎంత, పంట రుణం ఏమైనా తీసుకున్నారా, ఎప్పటికీ కోతలకు వస్తుంది తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గతంలో వ్యవసాయ శాఖ సిబ్బంది ఈ పంట నమోదు రైతుతో కలిసి వారి పొలం దగ్గరకు వచ్చి ఈ క్రాప్ బుకింగ్ చేసేవారని, ఇప్పుడు ఈ విధానాన్ని ప్రభుత్వం సరళతరం చేస్తూ రైతే స్వయంగా ఈ పంట నమోదుకు అవకాశం కల్పించిందన్నారు. దీనికోసం ప్రభుత్వం ఏపీ ఏ ఐ ఎం ఎస్ యాప్ (ఆంధ్రప్రదేశ్ అగ్రికల్చర్ ఇన్ఫర్మేషన్ మేనేజ్మెంట్ సిస్టం) ను రూపొందించి అమల్లోకి తీసుకువచ్చింది అన్నారు. ఇప్పుడు రైతు ఈ పంట పక్రియను స్వయంగా నమోదు చేసుకోవచ్చని తెలిపారు. ఈ–క్రాప్ బుకింగ్ చేసుకోవడం వల్ల రైతులకు అనేక ప్రభుత్వ పథకాలు, సబ్సిడీలు, రుణాలు సులభంగా అందుతాయని తెలిపారు. పంటల డేటాను డిజిటల్‌గా రికార్డ్ చేసి పరిహారాలు, బీమా వంటివి వేగంగా అందించడానికి సహాయపడుతుందన్నారు. బ్యాంకుల నుంచి పంట రుణాలు, సున్నా వడ్డీ పథకాలు సులభంగా పొందవచ్చు అన్నారు. ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన వంటి పంట బీమాలో ఈ క్రాప్ బుకింగ్ చేసుకుంటే చేరవచ్చు అని తెలిపారు. విత్తనాలు, ఎరువులు, యంత్రాలపై సబ్సిడీలు, రాయితీలు లభిస్తాయి అన్నారు. వర్షాలు, తుఫానులు, కరువు వంటి సందర్భాల్లో పంట నష్టానికి త్వరగా పరిహారం వస్తుంది, ఈ పంట డేటా ఆధారంగా లెక్కింపు సులభం అవుతుందన్నారు. పి యం కిసాన్, అన్నదాత సుఖీభవ వంటి పథకాల లబ్ధి పొందడానికి ఈ క్రాప్ బుకింగ్ తప్పనిసరి అని, అలాగే ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో మద్దతు ధరకు అమ్మకం చేయడానికి వీలవుతుంది అన్నారు. ప్రతి ఒక్క రైతు ఈ పంట నమోదును తప్పకుండా పూర్తి చేసుకోవాలి జిల్లా కలెక్టర్ తెలిపారు. తొలుత దర్భరేపు వెస్ట్ పూడిక తీత పనులపై స్థానిక రైతులు జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. షట్టర్లు ఏర్పాటు, 8.3 కిలోమీటర్ల పొడవునా వెస్ట్ దబ్బరేవులో పూడికతీత పనులు చేపట్టడం వలన సుమారు తొమ్మిది పంచాయతీల్లోని రైతులు రెండు పంటలు పండించుకునే అవకాశం కలుగుతుందని కలెక్టర్ కు విన్నవించడం జరిగింది. దీనిపై స్పందించిన జిల్లా కలెక్టర్ అధికారులతో ప్రతిపాదనలను తయారు చేయించి ప్రభుత్వానికి నివేదిస్తామని తెలిపారు. ఈ సందర్భంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జెడ్.వెంకటేశ్వరరావు, ఆర్డీవో దాస్ రాజు, ఏడీఏ ఎంవీఎస్ ప్రసాద్, ఎంఏఓ జోషీల, వీఏఏ నాగజ్యోతి, డెల్టా కమిటీ చైర్మన్ గుబ్బల మర్రి రాజు, తహసిల్దార్ ఐ వి వి సత్యనారాయణ, ఎంపీడీవో ఎం.అసుర రెడ్డి, ఈవోపీఆర్డీ కె.నాగేంద్ర కుమార్, రైతులు పాల్గొన్నారు.

# విద్యుత్ శాఖ ఆకస్మిక తనిఖీలు

గుడ్లవల్లేరు, ఫిబ్రవరి 11): మండలంలోని వివిధ గ్రామాల్లో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ డీపీఈ సిహెచ్.వాసు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఆపరేషన్ జి.బి.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో విద్యుత్ శాఖ వారు బుధవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. మొత్తం 40 బందాలుగా ఏర్పడి... 3,030సర్వీసెస్‌ను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో మొత్తం 399కేసులుకు గాను అపరాధ రుసుము రూ.12,02,000ను విధించారు. కార్యక్రమములో గుడివాడ రూరల్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పి.కిరణ్‌బాబు, గుడ్లవల్లేరు మండల అసిస్టెంట్ ఇంజనీర్ సిహెచ్.శ్యామలా కుమారి, గుడివాడ డివిజన్ అసిస్టెంట్ ఇంజనీర్స్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్స్ పాల్గొన్నారు. విద్యుత్ చౌర్యం సామాజిక నేరమని ఎవరైనా విద్యుత్ చౌర్యం చేస్తున్నట్లయితే 9440812091, 9440812086కు తెలుపగలరని అధికారులు కోరారు.

# ప.గో. జిల్లా వార్తలు




# జిల్లాలో మహా శివరాత్రి ఉత్సవాలకు పటిష్ట ఏర్పాట్లు

## ఉత్సవాల్లో సామాన్య భక్తులకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలి

## పారిశుద్ధ్యం.. మెడికల్ క్యాంపులు పక్కాగా నిర్వహించాలి

## శైవ క్షేత్రాల వద్ద కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాట్లు చేయాలి

## మహా శివరాత్రి ఉత్సవ ఏర్పాట్లపై సమీక్షలో ప.గో.జిల్లా కలెక్టర్ నాగరాణి



భీమవరం, ఫిబ్రవరి 11 : జిల్లాలోని ప్రముఖ శైవ క్షేత్రాలలోమహా శివరాత్రి సందర్భంగా సామాన్య భక్తులకు అత్యధిక ప్రాధాన్యతనుఇస్తూ ఎటువంటి అసౌకర్యం లేకుండా చక్కని దర్శనం కలిగేలా మహా శివారాత్రి ఉత్సవాల ఏర్పాట్లను పటిష్టంగా చేపట్టాలని పశ్చిమగోదావరి జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి సంబంధిత అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుండి ఈ నెల 15న మహా శివారాత్రి సందర్భంగా ఫిబ్రవరి 13 నుండి 18 వరకు భీమవరం సోమేశ్వర స్వామి, పాలకొల్లు క్షీర రామలింగేశ్వర స్వామి ప్రసిద్ధ శైవ క్షేత్రాలతోపాటు, మిగిలిన ప్రాంతాల్లో కూడా మహా శివరాత్రి ఉత్సవ ఏర్పాట్లపై జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మితో కలసి బుధవారం జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ జిల్లాలో ప్రముఖ శైవ క్షేత్రాలైన రెండు ప్రముఖ పంచారామ క్షేత్రాలు భీమవరం సోమేశ్వర స్వామి, పాలకొల్లు క్షీర రామలింగేశ్వర స్వామి దేవాలయాలకు లక్షలాది సంఖ్యలో భక్తులు హాజరు అవుతారని వారందరికీ ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని శాఖల సమన్వయంతో పటిష్ట ఏర్పాట్లు చేయాలన్నారు. గత సంవత్సరాల వేడుకల అనుభవాలను దృష్టిలో ఉంచుకొని ఎటువంటి సంఘటనలకు ఆస్కారం లేనివిధంగా ఏర్పాట్లను పూర్తి చేయాలన్నారు. భక్తుల రద్దీకి అనుగుణంగా క్యూ లైన్లు, త్రాగునీటి సరఫరా, చిన్నారులకు పాలు, పెద్దవారికి అల్పాహారం, దర్శనం చేసుకున్న ప్రతిభక్తునికి ఉచిత ప్రసాదం పంపిణీకి పటిష్ట ఏర్పాట్లు చేయాలన్నారు. పారిశుద్ధ్య నిర్వహణకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. మంచినీటి నాణ్యతను పరీక్షించి సరఫరా చేయాలన్నారు. శ్రీశైలం సంఘటన, పొరుగు జిల్లాలో గత సంవత్సరం సంఘటనలను దృష్టిలో ఉంచుకొని గోదావరి, సముద్ర స్థానాలకు వెళ్ళే భక్తులకు జాగ్రత్తలు తెలియజేసేలా టాశీ.. టాశీ.. వేయించాలని జిల్లా పంచాయతీ అధికారి ఆదేశించారు. రెండు శైవ క్షేత్రాలలో ప్రాథమిక వైద్యసేవలు అందించేందుకు వైద్యులను, వైద్య సిబ్బందిని ఏర్పాటు చేయాలన్నారు. 108 వాహనాలు కుడా అందుబాటులో ఉంచాలని సూచించారు. రెండు పంచారామాలతో పాటు, నత్తా రామేశ్వరం, మావుళ్ళమ్మ దేవస్థానాలు వద్ద క్యూ లైన్లు పక్కాగా ఏర్పాటు చేయాలన్నారు. విఐపి, ప్రోటోకాల్ దర్శనాలను క్రమబద్ధీకరిస్తూ సామాన్య భక్తులకు, దివ్యాంగులకు అత్యధిక ప్రాధ్యాన్యత ఇవ్వాలని ఆదేశించారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా విద్యుత్ అధికారులు పర్యవేక్షించాలన్నారు. రథయాత్రలు, తెప్పోత్సవాలు నిర్వహణకు ముందస్తుగా ఆర్ అండ్ బి అధికారులకు తెలియజేసి, సర్టిఫికెట్ పొందాలన్నారు. భక్తులకు ప్రసాద వితరణ కచ్చితంగా చేయాలని సూచించారు. భక్తుల సౌకర్యార్థం అవసరమైన పీఏ సిస్టం ఏర్పాట్లను కుడా చేయాలన్నారు. అదే విధంగా జిల్లాలో మహా శివరాత్రి సందర్భంగా సుమారు 3 వేల నుండి 10 వేల వరకు భక్తులు వచ్చే దేవాలయాలను గుర్తించి రెవెన్యూ, పోలీసు, దేవాదాయ శాఖలు ముందస్తు ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. భక్తులకు అసౌకర్యం లేకుండా ఆర్టీసీ బస్సులను నడపాలన్నారు. ఎక్కడ కుడా భక్తులకు అసౌకర్యాలు కలగుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు.

జిల్లా సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ అద్నాన్ నయీం అస్మి మాట్లాడుతూ ఈ నెల 13వ తేదీ నుండి 18వ తేదీ వరకు మహా శివరాత్రి ఉత్సవాలు సందర్భంగా జిల్లాలోని ప్రముఖ శైవ క్షేత్రాలకు వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా పగడ్బంధిగా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ముఖ్యంగా ఫిబ్రవరి 14, 15 తేదీలలో అధిక సంఖ్యలో భక్తుల రద్దీ ఉంటుందని అందుకు అనుగుణంగా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ప్రత్యేకంగా ప్రస్తుతం ఉన్న సిసి కెమెరాలకు అదనంగా సిసి కెమెరాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. భక్తుల రద్దీ, ఏర్పాట్లు, తదితర అంశాలను అంచనా వేసేందుకు రెవెన్యూ, పోలీస్, దేవాదాయ, స్వర్ణ గ్రామ, స్వర్ణ వార్డు సిబ్బందితో కంట్రోల్ రూమ్ ను ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. క్యూ లైన్ల క్రమబద్ధీకరణ కోసం ప్రత్యేక ఏర్పాట్లలో భాగంగా డ్రోన్లను వినియోగించాలన్నారు. శివరాత్రి సందర్భంగా ఎటువంటి వాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీస్ శాఖ ద్వారా కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాటు చేయడం జరుగుతుందని ఎస్పీ తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్ లో డీఆర్వో బి.శివన్నారాయణ రెడ్డి, జిల్లా అడిషనల్ ఎస్పీ వి.భీమారావు, ఆర్టీవోలు, డిఎస్పిలు, రెవెన్యూ, పోలీస్, దేవాదాయ, వైద్య, ఫైర్, విద్యుత్, ఆర్ అండ్ బి, పంచాయతీ రాజ్, తదితర శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# చిన్న మామిడిపల్లి, దర్శిపర్రు గ్రామాల రైతుల భూముల రిజిస్ట్రేషన్లకు విముక్తి





నరసాపురం, ఫిబ్రవరి 11 : నరసాపురం సబ్ రిజిస్ట్రార్‌కార్యాలయాన్ని బుధవారం పశ్చిమగోదావరి జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి సందర్శించి నరసాపురం మండలం చిన్న మామిడిపల్లి, పెంటపాడు మండలం దర్శిపర్రు గ్రామాలలో రైతుల భూముల పెండింగ్ రిజిస్ట్రేషన్ల పరిష్కారానికి నేడు వెబ్ ల్యాండ్ లో రిజిస్ట్రేషన్ల ప్రక్రియను ప్రారంభించి, పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి కూడా ఉన్నారు. నరసాపురం మండలం చిన్న మామిడిపల్లి, పెంటపాడు మండలం దర్శిపర్రు గ్రామాలలోని కొంత ప్రాంతం నరసాపురం, తాడేపల్లిగూడెం మున్సిపాలిటీలలో కలవడంతో ఆయా గ్రామాలలో నిర్వహించిన రిసర్వే లో ఆ ప్రాంతాలకు ఎల్పీఎంలు విడుదల కాకపోవడం, గత రెండు సంవత్సరాలుగా రైతుల భూములకు రిజిస్ట్రేషన్లు జరగక పడుతున్న ఇబ్బందులు నేటితో తొలగిపోయాయి. ఈ రెండు గ్రామాల రిజిస్ట్రేషన్ సమస్యలను పరిష్కరించేందుకు జిల్లా యంత్రాంగం ప్రభుత్వంతో పలు దఫాలుగా చర్చించిన మీదట వెబ్ ల్యాండ్ లో 2.0 గ్రామాలుగా క్రియేట్ చేసి ఎల్పీఎంలు కాకుండా సర్వే నెంబర్లు జారీ ద్వారా నేటి నుండి రిజిస్ట్రేషన్ ల పక్రియకు మార్గం ఏర్పాటు చేయడం జరిగింది. గత రెండు సంవత్సరాలుగా రైతులు తమ భూములను అవసరాలకు అమ్మడానికి, వారసులు పేరున రిజిస్ట్రేషన్ చేయడానికి ఆటంకంగా ఉండేది. రెండు గ్రామాల్లో సుమారు 1,700 ఎకరాలలోని 2 వేల మంది రైతులకు ప్రయోజనం చేకూరనున్నది. కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి, ఆర్డీవో దాసిరాజు, ఇంచార్జ్ సబ్ రిజిస్ట్రార్ ఎన్.నిరంజన్ కుమార్, తహసిల్దార్ ఐతం సత్యనారాయణ, పాల్గొన్నారు.

# మ్యుటేషన్ ప్రక్రియను పక్కాగా నిర్వహించాలి

## అధికారులకు ప.గో. జిల్లా కలెక్టర్ నాగరాణి ఆదేశం

నరసాపురం, ఫిబ్రవరి 11 : నరసాపురం ఆర్డీవో కార్యాలయంను బుధవారం పశ్చిమగోదావరి జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి ఆకస్మికంగా సందర్శించి కొన్ని భూమి, స్థిరాస్తిలకు సంబంధించి యజమాన్యంలో మార్పులను ప్రభుత్వ రెవెన్యూ రికార్డుల్లో నమోదు చేసే ప్రక్రియను స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ మ్యుటేషన్ ప్రక్రియను వివాదాలకు తావు లేకుండా పక్కగా నిర్వహించాలన్నారు. మ్యుటేషన్ అనేది భూమి యజమాన్యంలో మార్పు వచ్చినప్పుడు ప్రభుత్వ రికార్డుల్లో నమోదు చేసే ముఖ్యమైన ప్రక్రియ అన్నారు. ఇది చట్టబద్ధ హక్కుకు ప్రత్యామ్నాయం కాకపోయినా, పరిపాలనా పరంగా చాలా అవసరం అన్నారు. భూమి కొనుగోలు చేయడం, వారసత్వం రావడం జరిగిన వెంటనే మ్యుటేషన్ పూర్తి చేసుకోవాలన్నారు. ఒక భూమి లేదా ఆస్తి యజమాని మారినప్పుడు, ఆ మార్పును గ్రామ, మండల రెవెన్యూ రికార్డుల్లో మ్యుటేషన్ చేయించాల్సి ఉంటుందన్నారు. ప్రభుత్వ రికార్డుల్లో కొత్త యజమాని పేరు నమోదు కావడం వల్ల పన్నులు చెల్లించడం, పాసుబుక్లు పొందడం వంటివాటికి సులువుగా ఉంటుందన్నారు. మ్యుటేషన్ ప్రక్రియకి సంబంధిత మండల రెవెన్యూ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని లేదా



ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా రిజిస్ట్రేషన్ డీడ్ కాపీ, పాత పట్టాదారు పాసుబుక్ ఆధార్, గుర్తింపు పత్రాలు, వారసత్వ ధృవపత్రం సమర్పించాల్సి ఉంటుందని తెలిపారు. ఈ సందర్భంలో జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి, ఆర్డీవో దాసిరాజు ఉన్నారు.

# అడ్డుకట్ట నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేయాలి

## అధికారులకు పశ్చిమగోదావరి జిల్లా కలెక్టర్ నాగరాణి ఆదేశం



నరసాపురం, ఫిబ్రవరి 11 కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి దత్తతగ్రామం పెద్దమైనవాని లంక సముద్రం ఒడ్డున నిర్మిస్తున్న అడ్డుకట్టను పశ్చిమగోదావరి జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి పరిశీలించారు. నరసాపురం మండలం పెద్దమైనవాని లంక వద్ద నిర్మాణంలో ఉన్న సముద్రపు కోత నిరోధక అడ్డుకట్ట నిర్మాణ పనులను జిల్లాకలెక్టర్ చదలవాడ నాగరాణి జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డితో కలిసి ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా నిర్మాణ పనులు ఎప్పటికీ పూర్తవుతాయి, ఇంకా ఏమి పనులు చేపట్టాలి, తదితరు వివరాలను డిలైట్ కంపెనీ ప్రతినిధులను అడిగి తెలుసుకున్నారు. కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మల సీతారామన్ మీ గ్రామ ప్రజల కోసం చేస్తున్న ఎంత గొప్ప మేలు అని, ప్రజలందరూ సహకరించాలన్నారు. నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని, ఏమైనా ఇబ్బందులు ఉంటే వెంటనే జిల్లా యంత్రాంగం దృష్టి తీసుకురావాలని డిలైట్ ప్రతినిధులకు సూచించారు. అనంతరం రాజమహేంద్రవరం రామకృష్ణ మిషన్ సహకారంతో మొంథా తుఫాన్ పునరావసర పథకం కింద మత్స్యకారులకు అందజేయడానికి సిద్ధం చేస్తున్న బోట్లు నిర్మాణ పనులను, వలలను స్వయంగా పరిశీలించి నిర్మాణ ఏజెన్సీకి పలు సూచనలు చేశారు. పూర్తిస్థాయిలో బోట్లు నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేసి తెలియజేస్తే, లబ్ధిదారులకు అందజేసే కార్యక్రమాన్ని నిర్వహిస్తామని తెలిపారు. బోట్లు వినియోగానికి లబ్ధిదారుల పేరున లైసెన్స్ పొందడానికి అవసరమైన చర్యలను వెంటనే చేపట్టాలని మత్స్య శాఖ ఎఫ్డిఓ ను ఆదేశించారు. రామకృష్ణ మిషన్ సహకారంతో మొంథా తుఫాన్ పునరావసర పథకం కింద వందమంది మత్స్యకారులకు ఒక్కొక్కరికీ రూ.50 వేలు విలువ కలిగిన పడవ, రూ.20 వేలు విలువ కలిగిన వలను రూ.70 లక్షల వ్యయంతో అందజేయనున్నారు. చివరిగా పడవలు ప్రారంభానికి అనువైన సముద్ర బ్యాక్ వాటర్ చానల్ ను పరిశీలించారు. కార్యక్రమంలో ఆర్డీవో దాసిరాజు, జిల్లా మత్స్య సహకార సంఘం అధ్యక్షులు మైల వసంతరావు, మత్స్య శాఖ ఎఫ్డిఓ ఏ.దుర్గ ఏడుకొండలు, తహసిల్దార్ ఐవివి సత్యనారాయణ, తదితరులు ఉన్నారు.



# 'ఈ-పంట' నమోదును వేగవంతంచేయాలి

## అధికారులకు పశ్చిమగోదావరి జిల్లా జేసీ రాహుల్‌కుమార్‌రెడ్డి ఆదేశం



ఆకివీడు, ఫిబ్రవరి 11 ( : ఈ పంట, ఫార్మర్స్ రిజిస్ట్రేషన్ ద్వారా కలిగే ప్రయోజనాలపై రైతులకు అవగాహన కల్పించి నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని పశ్చిమగోదావరి జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి ఆదేశించారు. ఆకివీడు మండలం చినకాపవరం గ్రామంలో జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి ఫార్మర్స్ రిజిస్ట్రేషన్, ఈ పంట, డ్రోన్స్ పనితీరుపై క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం రైతు సేవా కేంద్రం వద్ద రైతులతో మాట్లాడుతూ యాప్ ద్వారా డ్రోన్ బుకింగ్, డ్రోన్స్ పనితీరు ఏవిధంగా ఉన్నది రైతులను అడిగి తెలుసుకున్నారు. ఫార్మర్స్ రిజిస్ట్రేషన్, ఈ పంట నమోదు ద్వారా రైతులకు కలిగే ప్రయోజనాలను జాయింట్ కలెక్టర్ రైతులకు వివరించారు. పట్టాదార్ పాస్ పుస్తకాల పంపిణీ, ఇకెవైసి ప్రగతిపై అధికారులను వివరాలు అడిగి అని తెలుసుకున్నారు. ఈ సందర్భంలో ఆర్డిఓ కె.ప్రవీణ్ కుమార్ రెడ్డి, తహసిల్దార్ ఫరూక్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జెడ్.వెంకటేశ్వర్రావు, సహాయ సంచాలకులు ప్రతాప్ జీవన్, మండల వ్యవసాయ శాఖ అధికారి ప్రియదర్శిని తదితరులు ఉన్నారు.



### రేషన్‌షాపు ఆకస్మిక తనిఖీ

ఆకివీడు మండలం ఆకివీడులో జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి 0534024 నెంబర్ గల రేషన్ షాపును ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రేషన్ షాప్ నందు ఉన్న నిత్యావసర సరుకుల భౌతిక నిల్వలను, ఆన్లైన్ నిల్వలతో సరిపోయినవి లేనివి పరిశీలించారు. ఎటువంటి తేడాలు లేనట్టుగా గుర్తించడం జరిగింది. రేషన్ కార్డుదారులకు పంపిణీ చేస్తున్న సరుకుల నాణ్యతను పరిశీలించారు. ఈ సందర్భంగా 65 సంవత్సరాల పైబడిన కార్డుదారులకు డీలర్ వారి ఇంటివద్దకే నిత్యావసర సరుకులు తీసుకెళ్లి ఇస్తున్నారా లేదా అని విచారణ చేశారు. ఈ సందర్భంగా స్థానిక రేషన్ కార్డుదారులను రేషన్ పంపిణీలో ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. చౌక ధరల దుకాణం ద్వారా సరుకులు సకాలంలో అందుతున్నాయని ఎటువంటి ఇబ్బందులు లేవని జాయింట్ కలెక్టర్ కు తెలిపారు. ఈ సందర్భంలో డీఎస్ఓ ఎన్.సరోజ, ఏఎస్ఓ రవిశంకర్, తహసిల్దార్ ఫరూక్, రెవెన్యూ సిబ్బంది, తదితరులు ఉన్నారు.

# ప్రభుత్వ నిబంధనలు ఖచ్చితంగా పాటించాలి

## పెట్రోలు బంకు ఆకస్మిక తనిఖీలో ప.గో.జేసీ రాహుల్‌కుమార్‌రెడ్డి




భీమవరం, ఫిబ్రవరి 11 : జిల్లాలోని పెట్రోల్ బంక్ యజమానులు ప్రభుత్వ నియమ నిబంధనలను కచ్చితంగా పాటించాలని పశ్చిమగోదావరి జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. భీమవరం మండలం, యనమదుర్రు గ్రామంలోని ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ పెట్రోల్ బంక్ ను జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి బుధవారం ఆకస్మిక తనిఖీ చేసినారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ ఇంధన నాణ్యత, కొలతలు సరిగ్గా ఉండడం, ధరల ప్రదర్శన, భద్రతా ప్రమాణాలు, వినియోగదారుల సేవలపై ప్రత్యేకంగా పరిశీలించారు. వినియోగదారులకు నాణ్యమైన ఇంధనం, సరైన సేవలు అందించాలన్నారు. పెట్రోల్ బంకుల యాజమాన్యాలు ప్రభుత్వ నిబంధనలు కచ్చితంగా పాటించాలన్నారు. ప్రజలు ఇంధనం తీసుకునే సమయంలో బిల్లు తీసుకోవాలని, ఏవైనా అనుమానాలు ఉంటే సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేయాలని జాయింట్ కలెక్టర్ వినియోగదారులకు సూచించారు. పెట్రోల్ బంకు నుండి వృదా నీరు రోడ్డు పైకి రావడం గమనించి, నేరుగా భూగర్భంలోకి వెళ్ళే విధంగా చర్యలు తీసుకోవాలని బంకు యాజమాన్యాన్ని జాయింట్ కలెక్టర్ ఆదేశించారు. ఈ సందర్భంలో ఏఎస్ఓ శివశంకర్, తహసిల్దార్ రావి రాంబాబు, వీఆర్వో తదితరులు ఉన్నారు.

నినాదం
నిఖార్సైన జర్నలిజం

# డబ్బు కోసమే పాక్ దిగివచ్చింది

## పాకిస్థాన్‌కి మాడు పగిలే కౌంటర్



**టీ20 వరల్డ్ కప్ 2026లో ఫిబ్రవరి 15న జరగనున్న భారత్-పాకిస్థాన్ మ్యాచ్‌పై నెలకొన్న హైడ్రామా ముగిసింది. మొదట ఈ మ్యాచ్‌ను బహిష్కరిస్తామని భీష్మించుకు కూర్చున్న పాకిస్థాన్, చివరి నిమిషంలో యూ-టర్న్ తీసుకుంది. ఈ నిర్ణయంపై భారత మాజీ క్రికెటర్లు హర్భజన్ సింగ్, సౌరవ్ గంగూలీ, మదన్ లాల్ వంటి ప్రముఖులు తమదైన శైలిలో స్పందించారు. పాక్ వెనక్కి తగ్గడానికి ప్రధాన కారణం డబ్బు, ఐసీసీ జరిమానాల భయమేనని వారు విశ్లేషిస్తున్నారు.**

### డబ్బు కోసమే పాక్ దిగివచ్చింది: హర్భజన్ సింగ్

టీమిండియా మాజీ స్పిన్నర్ హర్భజన్ సింగ్ పాకిస్థాన్ నిర్ణయాన్ని తీవ్రంగా ఎద్దేవా చేశారు. "భారత్ లేకపోయినా ఈ టోర్నీ సాగుతుంది కానీ, భారత్ లేకపోతే ఏదీ జరగదు అన్న నిజాన్ని పాకిస్థాన్ ఆలస్యంగా గుర్తించింది. బంగ్లాదేశ్‌కు మద్దతు ఇస్తున్నామని, భారత్‌తో ఆడబోమని గొప్పలు చెప్పుకున్నారు. కానీ ఈ మ్యాచ్ ఆడకపోతే వచ్చే ఆర్థిక నష్టం, ఐసీసీ విధించే జరిమానాలు, భవిష్యత్తులో టోర్నీల ఆతిథ్య హక్కులు కోల్పోతామనే భయం వారిని ఉక్కిరిబిక్కిరి చేశాయి. అందుకే ఇప్పుడు గత్యంతరం లేక దారిలోకి వచ్చారు" అని భజ్జీ ఏఎన్ఐతో మాట్లాడుతూ పేర్కొన్నారు.

### క్రీడలు వేరు, రాజకీయం వేరు: సౌరవ్ గంగూలీ

మాజీ కెప్టెన్ సౌరవ్ గంగూలీ మాత్రం ఈ నిర్ణయాన్ని స్వాగతించారు. క్రీడలను, రాజకీయాన్ని విడివిడిగా చూడాలని ఆయన అభిప్రాయపడ్డారు. "భారత్-పాక్ మ్యాచ్‌లు ఎప్పుడూ ఉత్సాహాన్నిస్తాయి. గత కొన్నేళ్లుగా పాకిస్థాన్ నుంచి సరైన పోటీ లేకపోయినా, ఈ మ్యాచ్ జరగడం మంచి పరిణామం. టీమిండియా ప్రస్తుతం చాలా బలంగా ఉంది, వారిని ఓడించడం పాకిస్థాన్‌కు అంత సులభం కాదు" అని గంగూలీ వ్యాఖ్యానించారు.

### డ్రామా ఆడుతున్నారు: అతుల్ వాసన్

మరో మాజీ క్రికెటర్ అతుల్ వాసన్ పాక్ తీరును డ్రామాగా అభివర్ణించారు. "ఒకసారి ఆడమంటారు, మరోసారి కోపం అంటారు. ఇలాంటి వింత చేష్టల వల్ల పాక్ ఆటగాళ్ల మనోధైర్యం దెబ్బతింటుంది. ఐసీసీ మీద కోపం ఉంటే టోర్నీ మొత్తాన్నే బహిష్కరించాలి కానీ, కేవలం భారత్ మ్యాచ్‌ను ఇష్యూ చేయడం ఏంటి?" అని ఆయన ప్రశ్నించారు. అలాగే, 1983 వరల్డ్ కప్ హీరో మదన్ లాల్ మాట్లాడుతూ.. ఈ మ్యాచ్ జరగకపోతే టోర్నీ కళ తప్పుతుందని, శ్రీలంక, బంగ్లాదేశ్ ఒత్తిడి వల్ల పాక్ వెనక్కి తగ్గడం శుభపరిణామమని అన్నారు.

బంగ్లాదేశ్‌లో మైనారిటీలపై జరుగుతున్న దాడుల నేపథ్యంలో, కోల్‌కతా నైట్ రైడర్స్ పేసర్ ముస్తాఫిజుర్ రెహమాన్‌ను బీసీసీఐ స్క్వాడ్ నుంచి తొలగించగా, భద్రతా కారణాల దృష్ట్యా తమ మ్యాచ్‌లను భారత్ వెలుపల నిర్వహించాలని బంగ్లాదేశ్ కోరింది. ఐసీసీ దీనిని తిరస్కరించడంతో బంగ్లాదేశ్ స్థానంలో స్కాట్లాండ్‌ను చేర్చారు. దీనికి నిరసనగా పాకిస్థాన్ మొదట భారత్ మ్యాచ్‌ను బహిష్కరించాలని చూసింది. అయితే, శ్రీలంక అధ్యక్షుడు, ఐసీసీ అధికారులతో చర్చల అనంతరం, పాక్ ప్రధానమంత్రి షెహబాజ్ షరీఫ్ తన జట్టును ఫిబ్రవరి 15న కొలంబోలో ఆడాలని ఆదేశించారు.

# మళ్ళీ మనమే ఛాంపియన్స్..

## 96 శాతం మంది ఇండియాకే ఓటేస్తున్నారు

**టీ20 వరల్డ్ కప్ 2026 వేదికగా సాగుతున్న ఈ మెగా టోర్నీలో డిఫెండింగ్ ఛాంపియన్ భారత్ తన జైత్రయాత్రను ఘనంగా ప్రారంభించింది. ముంబైలోని వాంఖడే స్టేడియంలో అమెరికాపై సాధించిన ఘనవిజయంతో టీమిండియా ఫామ్‌ను ప్రపంచానికి చాటిచెప్పింది. ఈ నేపథ్యంలో క్రికెట్ విశ్లేషకులు, మాజీ దిగ్గజాలు భారత్ విజయావకాశాలపై సంచలన అంచనాలు వేస్తున్నారు.**

టీ20 వరల్డ్ కప్ 2026 వేదికగా సాగుతున్న ఈ మెగా టోర్నీలో డిఫెండింగ్ ఛాంపియన్ భారత్ తన జైత్రయాత్రను ఘనంగా ప్రారంభించింది. ముంబైలోని వాంఖడే స్టేడియంలో అమెరికాపై సాధించిన ఘనవిజయంతో టీమిండియా ఫామ్‌ను ప్రపంచానికి చాటిచెప్పింది. ఈ నేపథ్యంలో క్రికెట్ విశ్లేషకులు, మాజీ దిగ్గజాలు భారత్ విజయావకాశాలపై సంచలన అంచనాలు వేస్తున్నారు. దాదాపు 96 శాతం మంది నిపుణులు ఈసారి కూడా కప్పు భారత్‌దేనని గంటాపథంగా చెబుతున్నారు. జియోస్టార్ బ్రాడ్‌కాస్టర్లకు చెందిన 46 మంది క్రికెట్ నిపుణులు ఈ టోర్నీపై తమ అంచనాలను వెల్లడించారు. వీరిలో 96 శాతం మంది భారత్ కచ్చితంగా ఫైనల్ చేరుతుందని, టైటిల్ నెగ్గుతుందని జోస్యం చెప్పారు. 2007 వరల్డ్ కప్ హీరోలు ఇర్ఫాన్ పఠాన్, పీయూష్ చావ్లాతో పాటు అనిల్ కుంబ్లే, సబా కరీం, యుజ్వేంద్ర చాహల్ వంటి దిగ్గజాలు భారత్ విజయంపై ధీమా వ్యక్తం చేశారు. గత మూడు ఐసీసీ ఈవెంట్లలో (2023 వన్డే వరల్డ్ కప్, 2024 టీ20 వరల్డ్ కప్, 2025 ఛాంపియన్స్ ట్రోఫీ) భారత్ ఫైనల్ చేరిన ట్రెండ్‌ను ఈసారి కూడా కొనసాగిస్తుందని వారు భావిస్తున్నారు.




### ఫైనల్ లో తలపడేది ఎవరు?

ఈసారి ఫైనల్ మ్యాచ్ ఎవరి మధ్య జరుగుతుందనే దానిపై నిపుణుల మధ్య ఆసక్తికరమైన చర్చ నడుస్తోంది.

భారత్ వర్సెస్ ఆస్ట్రేలియా: సుమారు 35 శాతం మంది నిపుణులు అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియంలో భారత్-ఆస్ట్రేలియా మధ్య ఫైనల్ పోరు ఉంటుందని అంచనా వేస్తున్నారు.ఎభారత్ వర్సెస్ సౌత్ ఆఫ్రికా: 30 శాతం మంది నిపుణులు 2024 టీ20 వరల్డ్ కప్ ఫైనల్ రిపీట్ అవుతుందని, మళ్ళీ భారత్-సౌతాఫ్రికా తలపడతాయని భావిస్తున్నారు.

### సెమీ ఫైనల్ రేసులో నిలిచే జట్లు

సునీల్ గవాస్కర్, ఆరోన్ ఫించ్, అలాన్ విల్కిన్స్ వంటి దిగ్గజాలు సెమీ ఫైనల్ చేరే జట్లపై తమ అభిప్రాయాలను పంచుకున్నారు. భారత్ తో పాటు సౌతాఫ్రికా, ఆస్ట్రేలియా, ఇంగ్లాండ్, న్యూజిలాండ్ జట్లు టాప్-4లో ఉండే అవకాశం ఉందని మెజారిటీ నిపుణులు చెబుతున్నారు. కొందరు అఫ్గానిస్తాన్, పాకిస్థాన్ జట్లకు కూడా స్వల్ప అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు.

### ఎందుకు భారత్ కే విజయావకాశాలు?

న్యూజిలాండ్ మాజీ బౌలర్ డానీ మోరిసన్ విశ్లేషణ ప్రకారం.. "భారత్ సొంత గడ్డపై ఆడుతోంది. ఇక్కడి పరిస్థితులు, పిచ్‌లపై వారికి పూర్తి అవగాహన ఉంది. ఈ బ్లూ జెర్సీని ఆపడం ఎవరికైనా కష్టమే". ఐపీఎల్ ఆడిన అనుభవం ఉండటం వల్ల విదేశీ ఆటగాళ్లు గట్టి పోటీ ఇచ్చే అవకాశం ఉన్నప్పటికీ, టీమిండియా బ్యాలెన్సుడుగా ఈసారి అద్భుతంగా ఉందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఫిబ్రవరి 12న నమీబియాతో జరగబోయే మ్యాచ్ కోసం ఫ్యాన్స్ ఈగర్‌గా వెయిట్ చేస్తున్నారు.

# బంగ్లాదేశ్ యూ టర్న్..

## వరల్డ్ కప్ నుంచి తప్పుకోవడంపై 20 రోజుల్లోనే ప్లేట్ ఫిరాయించిన సర్కార్



**టీ20 వరల్డ్ కప్ 2026 వేదికగా సాగుతున్న హైడ్రామాలో బంగ్లాదేశ్ మరో అనూహ్య మలుపు తిరిగింది. మెగా టోర్నీ నుంచి తప్పుకుంటున్నట్లు ప్రకటించి సంచలనం సృష్టించిన ఆ దేశం, కేవలం 20 రోజుల వ్యవధిలోనే తన మాట మార్చేసింది.**

టీ20 వరల్డ్ కప్ 2026 వేదికగా సాగుతున్న హైడ్రామాలో బంగ్లాదేశ్ మరో అనూహ్య మలుపు తిరిగింది. మెగా టోర్నీ నుంచి తప్పుకుంటున్నట్లు ప్రకటించి సంచలనం సృష్టించిన ఆ దేశం, కేవలం 20 రోజుల వ్యవధిలోనే తన మాట మార్చేసింది. గత నెలలో ప్రభుత్వమే ఈ నిర్ణయం తీసుకుందని చెప్పిన బంగ్లాదేశ్ క్రీడా సలహాదారు ఆసిఫ్ నజ్రుల్, ఇప్పుడు ప్లేట్ ఫిరాయించి అసలు ఆ నిర్ణయానికీ ప్రభుత్వానికీ సంబంధమే లేదన్నట్లుగా మాట్లాడుతున్నారు. ఈ పరిణామం ఇప్పుడు క్రికెట్ ప్రపంచంలో చర్చనీయాంశంగా మారింది.

### అసలేం జరిగింది?

జనవరి 22న బంగ్లాదేశ్ క్రీడా సలహాదారు ఆసిఫ్ నజ్రుల్ మీడియాతో మాట్లాడుతూ.. టీ20 వరల్డ్ కప్ 2026 నుంచి తప్పుకోవాలని ప్రభుత్వం నిర్ణయించిందని, ఆ విషయాన్ని ఆటగాళ్లకు కూడా వివరించానని చెప్పారు. దేశ గౌరవం కోసం ఈ నిర్ణయం తీసుకున్నట్లు అప్పట్లో బిల్డప్ ఇచ్చారు. అయితే ఆ సమయంలోనే స్టార్ ప్లేయర్ లిట్టన్ దాస్ షాకింగ్ కామెంట్స్ చేశారు. ఈ నిర్ణయంలో ఆటగాళ్ల ప్రమేయం అస్సలు లేదని, తమకు కేవలం సమాచారం మాత్రమే ఇచ్చారని ఆయన కుండబద్దలు కొట్టారు.

కానీ, సరిగ్గా 20 రోజుల తర్వాత అంటే ఫిబ్రవరి 10న ఆసిఫ్ నజ్రుల్ మాట మార్చేశారు. వరల్డ్ కప్ నుంచి తప్పుకోవడం అనేది ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం కాదని, అది బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు (బీజబీ) మరియు ఆటగాళ్ల సమిష్టి నిర్ణయమని చెప్పుకొచ్చారు. దేశ క్రికెట్ మనుగడ కోసం వారు ఈ త్యాగం చేశారని కొత్త భాష్యం చెప్పారు.

### ఐసీసీ సాఫ్ట్ కార్నర్ వెనుక మతలబు ఏంటి?

మెగా టోర్నీ నుంచి తప్పుకున్నప్పటికీ, ఐసీసీ బంగ్లాదేశ్‌పై ఎలాంటి కఠిన చర్యలు తీసుకోకపోవడం గమనార్హం. సాధారణంగా ఇలాంటి నిర్ణయాలు తీసుకుంటే భారీ జరిమానాలు లేదా సస్పెన్షన్ విధిస్తారు. కానీ ఐసీసీ మాత్రం బంగ్లాదేశ్‌పై సాఫ్ట్ కార్నర్ చూపిస్తోంది. భవిష్యత్తులో అంతర్జాతీయ మ్యాచ్‌ల నిర్వహణకు బంగ్లాదేశ్‌కు అవకాశం ఉంటుందని కూడా హామీ ఇచ్చింది. ఐసీసీ ఈ విధంగా స్పందించడంతోనే, బంగ్లాదేశ్ ప్రభుత్వం సేఫ్ సైడ్ ఉండటానికి ఈ నిర్ణయం బోర్డుదే అని ప్లేట్ ఫిరాయించి ఉంటుందని విశ్లేషకులు భావిస్తున్నారు.

### అంతర్జాతీయ ఒత్తిడి ఉందా?

బయటి ప్రపంచానికి ఇది బోర్డు నిర్ణయం అని చెబుతున్నా, దీని వెనుక పాకిస్థాన్‌తో ఉన్న లోపాయికారీ ఒప్పందాలు లేదా ఇతర దౌత్య కారణాలు ఉన్నట్లు వార్తలు వస్తున్నాయి. ముఖ్యంగా పాకిస్థాన్ కూడా భారత్‌తో మ్యాచ్‌పై మొండికేసి వెనక్కి తగ్గిన నేపథ్యంలో, బంగ్లాదేశ్ ఒంటరి కాకుండా ఉండేందుకు తన వాదనను మార్చుకున్నట్లు తెలుస్తోంది. మొత్తానికి బంగ్లాదేశ్ చేసిన ఈ యూ-టర్న్ ఆ దేశ క్రికెట్ భవిష్యత్తును ఏ తీరానికి చేరుస్తుందో చూడాలి.

# బీసీసీఐ సంచలన నిర్ణయం..

## షమీ, సర్ఫరాజ్ ఖాన్‌లకు మొండిచేయి

బీసీసీఐ నిబంధనల ప్రకారం.. ఒక నిర్దిష్ట సీజన్‌లో కనీసం నిర్ణీత సంఖ్యలో అంతర్జాతీయ మ్యాచ్‌లు ఆడితేనే సెంట్రల్ కాంట్రాక్ట్‌కు అర్హత లభిస్తుంది. మహమ్మద్ షమీ, సర్ఫరాజ్ ఖాన్, ఇషాన్ కిషన్, ముకేశ్ కుమార్‌లు గత కాంట్రాక్ట్ సైకిల్‌లో ఒక్క అంతర్జాతీయ మ్యాచ్ కూడా ఆడలేదు.

భారత క్రికెట్ నియంత్రణ మండలి 2025-26 సీజన్‌కు సంబంధించి ఆటగాళ్ల వార్షిక సెంట్రల్ కాంట్రాక్ట్ జాబితాను విడుదల చేసింది. ఈసారి ప్రకటించిన జాబితాలో ఊహించని మార్పులు చోటుచేసుకున్నాయి. టీమిండియా దిగ్గజాలు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ గ్రేడ్ తగ్గడం ఒక ఎత్తైతే.. స్టార్ పేసర్ మహమ్మద్ షమీ, యువ బ్యాటర్ సర్ఫరాజ్ ఖాన్ వంటి ప్లేయర్లకు అసలు కాంట్రాక్టే దక్కకపోవడం మరో ఎత్తు. గతంలో 34 మందికి చోటు కల్పించిన బీసీసీఐ, ఈసారి ఆ సంఖ్యను 30కి తగ్గించింది.

బీసీసీఐ నిబంధనల ప్రకారం.. ఒక నిర్దిష్ట సీజన్‌లో కనీసం నిర్ణీత సంఖ్యలో అంతర్జాతీయ మ్యాచ్‌లు ఆడితేనే సెంట్రల్ కాంట్రాక్ట్‌కు అర్హత లభిస్తుంది. మహమ్మద్ షమీ, సర్ఫరాజ్ ఖాన్, ఇషాన్ కిషన్, ముకేశ్ కుమార్‌లు గత కాంట్రాక్ట్ సైకిల్‌లో ఒక్క అంతర్జాతీయ మ్యాచ్ కూడా ఆడలేదు. షమీ గాయం కారణంగా సుదీర్ఘ కాలం దూరంగా ఉండగా, సర్ఫరాజ్ ఖాన్ ఆస్ట్రేలియా పర్యటనలో ఉన్నా తుది జట్టులో అవకాశం దక్కలేదు. దీంతో వీరికి కాంట్రాక్ట్ రెన్యూవల్ కాలేదు. ఇది షమీ కెరీర్‌పై సెలక్టర్ల ఆలోచనను స్పష్టం చేస్తోంది.

### కోహ్లీ, రోహిత్ గ్రేడ్ తగ్గడానికి కారణం?

ఈసారి గ్రేడ్-ఎ లో కేవలం శుభ్‌మన్ గిల్, జస్ప్రీత్ బుమ్రా, రవీంద్ర జడేజా మాత్రమే చోటు దక్కించుకున్నారు. భారత కెప్టెన్ రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ గ్రేడ్-బీ కి పరిమితమయ్యారు. వీరు కేవలం ఒకటి లేదా రెండు ఫార్మాట్లకే పరిమితం కావడం లేదా భవిష్యత్తు ప్రణాళికల్లో యువ ఆటగాళ్లకు ప్రాధాన్యత ఇవ్వడం వల్ల ఈ మార్పు జరిగినట్లు తెలుస్తోంది. ఆశ్చర్యకరంగా, నిలకడగా రాణిస్తున్న ఆల్‌రౌండర్ అక్షర్ పటేల్ గ్రేడ్-సి కి పడిపోయారు.

### బీసీసీఐ సెంట్రల్ కాంట్రాక్ట్ జాబితా 2025-26

గ్రేడ్-ఎ (రూ. 5 కోట్లు): శుభ్‌మన్ గిల్, జస్ప్రీత్ బుమ్రా, రవీంద్ర జడేజా.

గ్రేడ్ బీ (రూ. 3 కోట్లు): వాషింగ్టన్ సుందర్, రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ, కేఎల్ రాహుల్, మహమ్మద్ సిరాజ్, హార్దిక్ పాండ్యా, రిషబ్ పంత్, కుల్దీప్ యాదవ్, యశస్వి జైస్వాల్, సూర్యకుమార్ యాదవ్, శ్రేయస్ అయ్యర్.

# నమీబియా క్రికెట్ టీమ్?లో నల్లజాతీయులకు చోటు ఎందుకు దక్కడం లేదు? అసలు కారణం ఇదే

**ఆఫ్రికా దేశమైన పేరు వినగానే మనకు నల్లజాతీయులే గుర్తొస్తారు. ముఖ్యంగా నమీబియా లాంటి దేశంలో 90 శాతానికి పైగా జనాభా నల్ల జాతీయులే(బ్లాక్ పీపుల్). కానీ, ప్రస్తుతం జరుగుతున్న టీ20 వరల్డ్ కప్ 2026లో ఆ దేశ జట్టును గమనిస్తే మాత్రం కథ వేరేలా ఉంది.**

ఆఫ్రికా దేశమైన పేరు వినగానే మనకు నల్లజాతీయులే గుర్తొస్తారు. ముఖ్యంగా నమీబియా లాంటి దేశంలో 90 శాతానికి పైగా జనాభా నల్ల జాతీయులే(బ్లాక్ పీపుల్). కానీ, ప్రస్తుతం జరుగుతున్న టీ20 వరల్డ్ కప్ 2026లో ఆ దేశ జట్టును గమనిస్తే మాత్రం కథ వేరేలా ఉంది. ఫిబ్రవరి 12న ఢిల్లీలో టీమిండియాను ఎదుర్కోబోతున్న నమీబియా జట్టులో కేవలం ఇద్దరంటే ఇద్దరే నల్లజాతీయులు ఉండటం ఇప్పుడు అందరినీ ఆశ్చర్యానికి గురి చేస్తోంది. ఆ ఇద్దరు ఆటగాళ్లు మరెవరో కాదు.. బెన్ షికోంగో, మాక్స్ హెన్నింగో. వీరిద్దరూ ఫాస్ట్ బౌలర్లు. మరి మెజారిటీ జనాభా ఉన్న చోట జట్టులో మాత్రం ఇంత తక్కువ మంది ఎందుకు ఉన్నారో వివరంగా తెలుసుకుందాం.

### నమీబియా జట్టులో ఈ వ్యత్యాసానికి కారణాలేంటి?

నమీబియా జట్టులో ఇంత తక్కువ మంది నల్లజాతీయులు ఉండటానికి ప్రధానంగా చారిత్రక, సాంస్కృతిక కారణాలు ఉన్నాయి.

చారిత్రక నేపథ్యం: నమీబియా 1990 వరకు సౌతాఫ్రికా ఆధీనంలో ఉండేది. ఆ కాలంలో క్రికెట్ అనేది కేవలం శ్వేతజాతీయుల క్రీడగా మాత్రమే పరిగణించబడేది. తెల్లజాతీయులు చదువుకునే పెద్ద పెద్ద స్కూళ్లలోనే క్రికెట్ కోచింగ్ ఇచ్చేవారు. నల్లజాతీయులు ఉండే ప్రాంతాల్లో కనీస మౌలిక సదుపాయాలు ఉండేవి కావు.



రాజధాని ప్రాముఖ్యత: నమీబియా రాజధాని విండ్‌హోక్ లోనే క్రికెట్ ఎక్కువగా ప్రాచుర్యంలో ఉంది. ఇక్కడ శ్వేతజాతీయులు ఎక్కువగా నివసిస్తారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉండే నల్లజాతీయులకు క్రికెట్ కంటే సాకర్ (ఫుట్‌బాల్) అంటేనే ఎక్కువ ఇష్టం.

కోటా విధానం: సౌతాఫ్రికా తరహాలోనే నమీబియాలో కూడా 2010 నుంచి కోటా సిస్టమ్ అమలు చేస్తున్నారు. అయితే క్రికెట్ అక్కడ ఇంకా ఎదుగుతున్న క్రీడ కావడం వల్ల, అట్టడుగు స్థాయి నుంచి నల్లజాతీయుల భాగస్వామ్యం పెరగడానికి సమయం పడుతోంది.

సౌతాఫ్రికా మూలాలు: ప్రస్తుత నమీబియా జట్టులోని చాలా మంది ఆటగాళ్లు సౌతాఫ్రికా మూలాలు ఉన్న శ్వేతజాతీయులే. అందుకే జట్టులో వారి ప్రాతినిధ్యం ఎక్కువగా కనిపిస్తోంది.

Printed, Published & Owned by B. Srinivas, Printed at Sree Seshasai EnterprisesPlot no. 98/1, Co-operative Industrialp Estate,Gandhi Nagar, near Balanagar Medchel -Malkajgiri Dist.Hyderabad 500037 (T.S). Published at Plot S11, 3rd Floor, Ballard estate Margadarshi building Tarnaka Secundrabad, Hyderabad 500 007 (T.S), Editor : B. Srinivas, PRGI.REGN.NO. APTEL/2003/11288, Gmail: ninadamnews@gmail.com, CELL: +91 8333068787